సోపాటల్ / సోమవారం స్పెషల్ (illustrated label)
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-3-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 31 పేజీలు: 10+4 వెల: 6.50

దౌత్య చర్చల ద్వారానే పశ్చిమాసియా పరిష్కారం

ఇజ్రాయెల్ ప్రధానితో మోడీ ఫోన్ చర్చలు

5

# జోరుగా వార్

## మూడో రోజున దాడులు ముమ్మరం



ఇజ్రాయెల్- అమెరికా బాంబు దాడికి ఇరాన్‌లో ఎగిరిపోతున్న శాంతికపోతాలు

ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ సతీమణి మృతి

హార్మోజ్ మూసివేతతో చమురు ధరలకు రెక్కలు



ఇజ్రాయెల్- అమెరికా దాడులతో ఇరాన్‌లో నేలకూలిన భవనాలు, ఎగసిపడుతున్న పొగలు

కువైట్‌లో మూడు అమెరికా యుద్ధవిమానాలు కూల్చివేత

70 హెజ్బొల్లా స్థావరాలు టార్గెట్‌గా ఇజ్రాయెల్ దాడులు

యుఎస్ బేస్‌లపై ఇరాన్ ప్రతీకార దాడులు

తాత్కాలిక సుప్రీం కమాండర్ కూడా దాడుల్లో మరణించినట్లు కథనాలు, ఖండించిన ఇరాన్

**టెహ్రాన్, మార్చి 2:** ఇరాన్ అణ్వాయుధ తయారీని నిలిపివేయాలని, ఒప్పందానికి నిరాకరించడంతో సైనిక చర్యలుచేపట్టిన అమెరికా, ఇజ్రాయెల్ దాడులు మూడోరోజు కూడా కొనసాగాయి. సుదూర లక్ష్యాలుఛేదించగలిగే క్షిపణులతో

>>2



## యుద్ధం మరో నాలుగైదు వారాలు తప్పదు

ఇరాన్ మిసైల్ వ్యవస్థను నాశనం చేస్తాం: ట్రంప్

# పిఎం రేసులో ఉంటా..

పరమశివుని త్రిశూలం వంటి పార్టీ కాంగ్రెస్

కష్టపడేవారికే అధిష్ఠానం నుంచి పిలుపు

గ్రామాలకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోండి

తెలంగాణ, ఏపి డిసిసి అధ్యక్షుల శిక్షణ ముగింపులో రాహుల్ గాంధీ

సిఎం రేవంత్ తీర్మానానికి డిసిసిల మద్దతు



సోమవారం వికారాబాద్‌లో డిసిసి అధ్యక్షుల సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



సదస్సుకు హాజరైన డిసిసి అధ్యక్షులు, పలువురు నాయకులు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 2, ప్రభాతవార్త:** రాబోయే ఎన్నికల్లో ప్రధానిగా పోటీలో ఉంటానని పార్లమెంట్‌లో కాంగ్రెస్ పక్ష నేత రాహుల్‌గాంధీ సూచన ప్రాయంగా అంగీకారం తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల కు 10 రోజుల పాటు వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో నిర్వహించిన శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాహుల్ గాంధీ సుమారు 3 గంటల పాటు డీసీసీ అధ్యక్షులతో గడిపారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన మేరకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ప్రధానమంత్రి అభ్యర్థిగా బరిలో ఉండేందుకు అంగీకారం తెలిపారు. 2004 నుంచి ఎంపీగా గెలుపొందుతూ ప్రధాని పదవికి రెండుసార్లు అవకాశం వచ్చినా ఎందుకు చేపట్టలేదని రేవంత్‌రెడ్డి అడిగారు. కార్యకర్తలు, పార్టీ శ్రేణులో తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని, ఇప్పటికైనా ప్రధాని పదవి చేపట్టేందుకు ముందుకు వస్తే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ ఎంపీ స్థానాలు గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని విశ్వాసం వ్యక్తం చేశారు. అంతకు ముందు రాహుల్ మాట్లాడుతూ అజాత శత్రువుగా పేరున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనని గుర్తు చేశారు. పరమ శివుని వెనక ఉండే త్రిశూలం వంటి పాత్ర కాంగ్రెస్ పోషిస్తుందని డీసీసీలకు ఉద్బోధించారు. శివుడి ఎడమ చేతి వద్ద త్రిశూలం ఉంటుందని, దాంతో శత్రువులను పొడిచినా ప్రాణాలు కోల్పోలేరని వ్యాఖ్యానించారు. కత్తితో విన్యాసం చేసి ప్రాణాలు తీసేంత అవసరం ఇతర పార్టీల మాదిరిగా కాంగ్రెస్‌కు ఉండదని అన్నారు. గాంధీయ వాదం పూర్తిగా నిండిన కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యమే పరమావధిగా పనిచేయాలని సూచించారు. పార్టీలో ఇప్పుడంతా సమానత్వం ఉందని రాహుల్ గుర్తు చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు పిలవలేదని దూరంగా ఉండకూదని డీసీసీ అధ్యక్షులకు సూచించారు. స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి పార్టీ కార్యక్రమాలను భుజాలపై వేసుకొని నడపాలని పిలుపునిచ్చారు. కుర్చీ కోసం ఎవరి కాళ్లపైనా పడాల్సిన ఖర్మ ఉండకూడదని ఆయన అన్నారు. టిక్కెట్ల కోసం ఎవరినో అడుక్కునే పరిస్థితి కూడా ఉండదని, కష్టపడి

>>2

## మోడీ నిర్ణయాలు దేశానికి ప్రమాదకరం

-రాహుల్ గాంధీ ఆరోపణ

2

# భారత్‌కు కెనడా యురేనియం

ఉభయదేశాల మధ్య రూ.23 వేల కోట్ల ఒప్పందం

కొత్త అణుసాంకేతికతపై కలిసి పనిచేస్తామన్న ప్రధాని మోడీ, కెనడా ప్రధాని మార్క్ కెర్నీ



న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో సోమవారం ప్రధాని మోడీతో భేటీ అయిన కెనడా ప్రధాని మార్క్

**న్యూఢిల్లీ, మార్చి 2:** మధ్యప్రాచ్యంలో ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ భారత్‌కు కీలకమైన దౌత్య, ఇంధన రంగానికి సంబంధించి శుభవార్త అందింది. భారత్, కెనడా మధ్య సుమారు 2.6 బిలియన్ డాలర్ల (రూ.23,000 కోట్లు) విలువైన దీర్ఘకాలిక యురేనియం సరఫరా ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా భారత శాంతియుత అణుశక్తి కార్యక్రమానికి స్థిరమైన ఇంధన భద్రత లభించనుంది. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కెనడా ప్రధాని మార్క్ మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చల అనంతరం ఈ ఒప్పందం ప్రకటించారు. 2026 చివరి నాటికి సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సిఇపిఎ)ను పూర్తి చేయాలని రెండు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ప్రధాని నరేంద్రమోడీ మాట్లాడుతూ "దీర్ఘకాలిక

>>2

UDGAM Unclaimed Deposits Gateway To Access inforMation

మీ బ్యాంక్‌లో
10 సంవత్సరాల కంటే
ఎక్కువ కాలం నుండి
క్లెయిమ్ చేయకుండా
పడి ఉన్న
మీ డబ్బుని మళ్ళీ
ఉపయోగపరచుకోండి



UDGAM లో దాన్ని కనుగొని
బ్యాంక్ నుండి దాన్ని ఎలా
పొందాలో తెలుసుకోండి

- UDGAM పోర్టల్‌పై నమోదు చేసుకోండి.
- ఖాతాదారుని పేరు, బ్యాంక్(ల) పేరు మరియు జన్మదినం, ప్యాన్ కార్డ్ మొదలైనటువంటి వివరాలను ఉపయోగించి వెతకండి.

UDGAM అనేది ఒక అన్వేషణ సౌకర్యం మాత్రమే. క్లెయిమ్ చేయబడని డిపాజిట్లను ఆయా బ్యాంక్(ల) నుండే క్లెయిమ్ చేసుకోవలసి ఉంటుంది.

ఆర్‌బీఐ అంటుంది... విషయాలు తెలుసుకోండి, జాగరూకంగా ఉండండి!

UDGAM పోర్టల్‌పై బ్యాంక్‌ల జాబితా లభిస్తుంది.

మరిన్ని వివరాల కొరకు https://rbikehtahai.rbi.org.in/ud సందర్శించండి
ఈ సందేశంపై అభిప్రాయం కోసం, rbikehtahai@rbi.org.inకి వ్రాయండి

జనహితానికై జారీ చేయునది
భారతీయ రిజర్వ్ బ్యాంక్
RESERVE BANK OF INDIA
www.rbi.org.in

## సూర్యాపేట మైనింగ్ ఇ-వేలంలో భారీ అక్రమాలు

ముఖ్యమంత్రికి కెటిఆర్ బహిరంగ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి2:** సూర్యాపేట జిల్లాలో మైనింగ్ ఈవేలంలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని, స్వతంత్ర విచారణ చేసి టెండర్లు



రద్దు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. సుమారు 1,100 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్‌పై స్పష్టత లేకుండానే వేలం నిర్వహించారని ఆరోపించారు. కీలక సాంకేతిక వివరాల్లోలోపం, లాటిట్యూడ్, లాంగిట్యూడ్, డీజీపీఎస్ సర్వే వివరాలు

>>2



## సుమన్‌కు షరతులతో బెయిల్

2

# గల్ఫ్ బాధితుల కోసం ఢిల్లీలో కంట్రోల్ రూం



తెలంగాణ భవన్‌లో నిరంతర సేవలు

ఇరాన్ వార్‌లో చిక్కుకొన్న తెలంగాణ ప్రజలకు పూర్తి సాయం

తెలుగువారు అప్రమత్తంగా ఉండాలి: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి2:** మధ్యప్రాచ్య (పశ్చిమ ఆసియా)లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ పౌరుల కోసం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24గంటల పాటు అందుబాటులో ఉండే విధంగా తెలంగాణ ప్రభుత్వం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు మధ్యప్రాచ్య (పశ్చిమ ఆసియా) ప్రాంతంలోని కొన్ని దేశాల్లో ఏర్పడుతున్న పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం సమగ్రంగా పర్యవేక్షిస్తోంది. న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో ఇప్పటికే నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న,చిక్కుకున్న తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న విచారణలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణ ప్రభుత్వం న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. అవసరమైన సమన్వయం, సహాయం అందించేందుకు ఈ కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది.ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు లేదా తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఎలాంటి ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఈ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు.24 గంటల పాటు అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు (న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్ నుంచి పనిచేస్తుంది) వందన బరువా పీఎస్ టు రెసిడెంట్ కమిషనర్, లైజన్ హెడ్+91 9871999044, సీహెచ్. చక్రవర్తిపబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్+91 9958322143, జావేద్ హుస్సేన్ లైజన్ ఆఫీసర్ 9910014749, రక్షిత్ నాయక్ లైజన్ ఆఫీసర్+91 9643723157.. మధ్యప్రాచ్య ప్రాంత పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పర్యవేకిస్తూ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉంటుందని తెలంగాణ సమాచార కేంద్రం పౌర సంబంధాల అధికారి ఓ ప్రకటనలో తెలిపారు.పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలుగువారంతా అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను పాటించాలని స్పష్టం చేశారు.

>>2

## ప్రజా సేవలో శ్రీపాదరావు ఆదర్శం

2

- కర్ణాటక స్పీకర్ ఖాదర్ ఫరీద్

మాదాపూర్‌లో ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు



వికారాబాద్‌లో డిసిసి అధ్యక్షుల సమావేశానికి వెళ్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్,సిఎం రేవంత్, ఎపి పిసిసి చీఫ్ షర్మిల

# పిఎం రేసులో ఉంటా..

>> పనిచేసిన వారికి అధిష్టానం నుంచి గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ పగ్గాలు డీసీసీలే మోయాలని సూచించారు. సర్వాధికారాలు కల్పిస్తున్నట్లు రాహుల్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి ముందుకు నడవాలని సూచించారు. అట్టడుగు వర్గాల సమస్యలు తెలుసుకునేందుకు గ్రామాలకు వెళ్లాలని తెలిపారు. గిరిజన తండాలు, చెంచు గూడేలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు సమానత్వం కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఏపీ ఇన్చార్జ్ వైయస్ షర్మిల కూడా మాట్లాడారు. ఉదయం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్‌కు చేరుకున్న రాహుల్‌గాంధీని సీఎం రేవంత్ ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో వికారాబాద్‌కు చేరుకుని రోడ్డు మార్గాన అనంతగిరి హిల్స్‌లోని శిబిరం వద్దకు విచ్చేశారు. ఉదయం 11 గంటలకు ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షులు, వారి కుటుంబాలో ఫొటో కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం లంచ్ తర్వాత డీసీసీ అధ్యక్షుల శిబిరంలో రాహుల్ మాట్లాడారు. సుమారు మూడు గంటల పాటు సాగిన ఇష్టాగోష్టిలో అనేక అంశాలపై చర్చించారు. నేలపై కూర్చున్న డీసీసీల వద్దకు నడుచుకుంటూ కలియతిరుగుతూ రాహుల్ అనేక సూచనలు చేశారు. కొన్ని అంశాలపై డెమో ద్వారా అవగాహన కల్పించారు.

## బాల్క సుమన్‌కు షరతులతో బెయిల్

**క్యాతన్‌పల్లి, మార్చి 2, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లా చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌కు సోమవారం మంచిర్యాల జిల్లా కోర్టులో ఊరట లభించింది. క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో జరిగిన అల్లర్ల కేసులో రిమాండ్‌లో ఉన్న ఆయనకు జిల్లా జడ్జి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బెయిల్ మంజూరు కోసం కోర్టు పలు నిబంధనలను విధించింది. రూ. 25,000 విలువ గల ఎగ్జిక్యూటివ్ బాండ్‌తో పాటు, ఒక్కొక్కరికి ఇద్దరు షూరిటీలను సమర్పించాలని ఆదేశించింది. అదేవిధంగా, ప్రతి ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల మధ్యలో రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌కు స్వయంగా హాజరై సంతకం చేయాలని స్పష్టం చేసింది. ఈ నిబంధనలు రాబోయే మూడు నెలల పాటు లేదా కేసులో ఛార్జ్ షీట్ దాఖలు చేసే వరకు అమలులో ఉంటాయని జడ్జి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గత కొద్దిరోజులుగా రిమాండ్‌లో ఉన్న బాల్క సుమన్‌కు బెయిల్ రావడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ హోలీ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి2:** తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి పండుగగా హోళీని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రేమ, ఆప్యాయత సంతోషాల హరివిల్లుగా, శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే పండుగ హోలీ అని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

సహజ సిద్ధమైన రంగులు, సాంప్రదాయ పద్ధతులతో పండుగను జరుపుకోవాలన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజల సమైక్యతను చాటే పండుగ హోళీని వేడుకగా జరుపుకోవాలని అన్నారు.

## ఢిల్లీలో కంట్రోల్ రూం

>> ఈ మేరకు ఈ ముఖ్యమంత్రి కార్యాలయం ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. అత్యవసర పరిస్థితి ఎదురైతే తెలుగు ప్రజలను సురక్షితంగా రప్పించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు కేంద్రంతో సమన్వయం చేసుకుంటుందని చెప్పారు. ఇరాన్‌తోపాటు గల్ఫ్ దేశాల్లోని తెలంగాణవాసుల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తుందని తెలిపారు. కేంద్రంతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులని అప్రమత్తం చేసినట్లు వివరించారు. తెలంగాణ ప్రజల భద్రత రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలని సీఎం ఆకాంక్షించారు. గల్ఫ్ దేశాలకు కార్మికులుగా వెళ్లివారి కళ్లముందే బాంబుల వర్షం కురియడంతో వారిలో ఒక్కసారిగా భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో వారంతా స్వస్థలాలకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఆయా దేశాల్లో గగనతలం మూసివేయడంతో ఎటూవెళ్లలేని దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇళ్లకు వద్దామనుకుంటే విమాన సర్వీసులన్నీ రద్దయ్యాయి. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న కారణంగా ఆదివారం కువైట్, మస్కట్, బహ్రెయిన్, దమ్మామ్, మదీనా, అబుధాబి, దుబాయ్, షార్జా, జెడ్డా, రియాద్, దోహా తదితర నగరాల నుంచి హైదరాబాద్‌కు రావాల్సిన పలు విమానాలు అక్కడే నిలిచిపోయాయి. దీంతో పాటు ఇక్కడి నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన పలు అంతర్జాతీయ సర్వీసులు కూడా నిలిచిపోయాయి. ఈ రకంగా విమాన సర్వీసులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు, వాహనాల రద్దీ తగ్గిపోయింది. మరోవైపు ఇజ్రాయెల్‌తో పాటు సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, కువైట్ తదితర గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఎయిర్ బేస్‌లను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణుల వర్షం కురిపిస్తోంది. దీంతో ఆయా దేశాల్లో ఉన్న భారతీయులు భయాందోళనలకు లోనవుతున్నారు. ఈ దేశాల్లో ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో పని చేస్తున్నారు. ఇరాన్ వేసిన క్షిపణులు పడే సమయంలో తాము బంకర్లలోకి వెళ్తున్నామని ఇజ్రాయెల్ దేశంలో ఉన్న పలువురు తెలుగువారు సోషల్ మీడియా వేదికగా వీడియోలను షేర్ చేశారు. దుబాయ్‌లో క్షిపణుల దాడిపై సినీ నటుడు మంచు విష్ణు సైతం తన ఎక్స్ వేదిక ద్వారా తెలిపారు. కామారెడ్డి జిల్లా నుంచి సుమారు 30 వేల మంది, నిజామాబాద్ జిల్లా నుంచి సుమారు 50 వేల మంది దుబాయ్, బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఇరాన్, ఇజ్రాయెల్, ఖతార్, మస్కట్ ప్రాంతాలకు వలస వెళ్లారు. దుబాయ్ విమానాశ్రయానికి దగ్గరలో కామారెడ్డికి చెందిన వంగ బాల్‌రెడ్డి ఓ మాల్‌లో పని చేస్తున్నారు. దీనికి దగ్గరలోనే ఓ సైనిక స్థావరం ఉంది. అయితే బాల్‌రెడ్డి పని చేస్తున్న మాల్‌కు సుమారు వంద మీటర్ల దూరంలోనే ఓ బాంబు పేలింది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో దేవుడిపైనా భారం వేసి బతుకుతున్నామని బాల్‌రెడ్డి కామారెడ్డిలో ఉన్న తన బంధువులతో ఫోన్‌లో పేర్కొన్నారు.

## ఇ-వేలంలో భారీ అక్రమాలు

>> వెల్లడించలేదని విమర్శించారు. ఈ మేరకు కేటీఆర్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. జియోలాజికల్ నివేదికలు సైతం లేవని ఆరోపించారు. మినరల్ ఆక్షన్ రూల్స్ 2015 ఉల్లంఘన జరిగిందని హైకోర్టు సూచనలు పట్టించుకోలేదన్నారు. పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్ల ప్రకటన, కంపెనీల ఎంపికపై అనుమానాలున్నాయని పేర్కొన్నారు.

మైనింగ్‌లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కేసులు ఎదుర్కొంటున్న డెక్కన్ సిమెంట్స్, ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్‌కు బ్లాక్‌ల కేటాయింపుపై సందేహాలున్నాయని తెలిపారు. టెండర్ రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అన్ని అనుమతుల తర్వాతే పారదర్శకంగా కొత్త వేలం నిర్వహించాలని సూచించారు. గనుల శాఖ చేపట్టిన ఈ వేలం ప్రక్రియ పారదర్శకతకు విరుద్ధంగా సాగిందని ఆయన విమర్శించారు.

టెండర్ నోటీసు జారీకి ముందే మినరల్ బ్లాక్‌లను ఖచ్చితంగా గుర్తించి పూర్తి వివరాలు వెల్లడించడం తప్పనిసరి అయినప్పటికీ, ఈ నిబంధనలు పాటించలేదని విమర్శించారు. ఈ అక్రమ టెండర్లపై మరింత ఆందోళన కలిగించే అంశాలను కూడా ఆయన లేఖలో ప్రస్తావించారు. న్యాయపరమైన విచారణలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వేలాన్ని ముందుకు తీసుకెళ్లడం, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సూచనలను పట్టించుకోకపోవడం, చట్టపరమైన, పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించడం వంటి అంశాలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు.

మైన్స్ అండ్ జియోలజీ శాఖ లీగల్ ఆఫీసర్ ఈ బ్లాక్‌ల సమాచారాన్ని గోప్యంగా పేర్కొంటూ ఫిర్యాదుదారునికి ఇవ్వడానికి నిరాకరించడం పారదర్శకతపై అనుమానాలు పెంచుతోందని అన్నారు. ప్రస్తుత వేలం ప్రక్రియకు సంబంధించిన అన్ని చర్యలను తక్షణమే నిలిపివేయాలని, నోటిఫికేషన్ నెం. 2263906/డిఎం అండ్ జిఎంఐ/ఎల్ఎస్టీ/2023 కింద చేపట్టిన టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర, పారదర్శక విచారణను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని, అవసరమైన శాస్త్రీయ సర్వేలు, జియోలాజికల్ డేటా వెల్లడి, అటవీ అనుమతులు పొందిన తర్వాత మాత్రమే చట్టబద్ధంగా కొత్త టెండర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలని కేటీఆర్ కోరారు. ఈ లేఖ ప్రతులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా పంపారు.

## వారం - వర్జ్యం

03-03-2026, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
○పౌర్ణమి సా.5.11, మఖ ఉ.7.32
వర్జ్యం : మ.3.34-సా.5.11
దు.ఉ.8.47-9.34, రా.11.00-11.47
శుభసమయం:ఉ.6.30-7.30, సా.6.30-7.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** ఉద్యోగంలో నూతన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పై అధికారుల ప్రశంసలు పొందుతారు. ధన లాభం.

**వృషభం:** సంతానం విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తారు. నూతన వరిశ్రమలను ప్రారంభిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**మిథునం:** విధుల నిర్వహణలో వ్యాపార రంగాలలో అభివృద్ధి కనిపిస్తుంది. విదేశీ యానాలు చేయాలనే ఆలోచనలు బలపడతాయి.

**కర్కాటకం :** బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం:** అనుకోని అతిథుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. వస్త్రలాభం.

**కన్య:** ఉద్యోగాలలో మంచి మార్పులు వుంటాయి. శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుంది. భూముల కొనుగోలు చేస్తారు.

**తుల :** సన్నిహితుల నుండి ఆశ్చర్యకరమైన వార్తలు అందుకుంటారు. చాకచక్యంగా వ్యవహరించి ముందుకు సాగుతారు.

**వృశ్చికం:** నూతన ఉద్యోగానికై చేసే దరఖాస్తులు, సంప్రదింపులు, పర్యటనలు లాభిస్తాయి. క్రయవిక్రయాలలో లాభాలు.

**ధనుస్సు:** ఆస్తి తాలూకా వివాదాలను సాధ్యమైనంత తొందరగా పరిష్కారం చేసుకోవడమే మంచిదని భావిస్తారు.

**మకరం:** ఋణ యత్నం ఫలిస్తుంది. ఆరోగ్యం సాధారణంగా వుంటుంది. పనులు నెమ్మదిగా పూర్తిచేస్తారు.

**కుంభం:** పెట్టుబడులకు తొందరపాటు వద్దు. భూముల విషయంలో నెలకొన్న వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**మీనం :** నూతన ఒప్పందాలలో జాగ్రత్తలు పాటించండి. కుటుంబ సమస్యలు ఎదురైన అధిగమిస్తారు. ప్రయాణాలు లభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జోరుగా వార్

>> ఇజ్రాయెల్, అమెరికాలు దాడులు చేసాయి. ఇరాన్‌లోని నాటాంజ్ అణు స్థావరంపై ఇజ్రాయెల్ అమెరికా దాడులు చేసాయని ఇరాన్ ప్రతినిధి అంతర్జాతీయ అణుధార్మిక ఏజెన్సీకి ఫిర్యాదులుచేసారు. ఒక్కదెబ్బకే 48 మందిని ఖతంచేసామని ప్రకటించిన అమెరికా దాడులు మరోనాలుగు వారాలు కొనసాగుతాయని స్పష్టంచేసింది. ట్రంప్‌సైతం ఇదే నిర్ణయం ప్రకటించారు. దాడుల క్రమంలో ఇకపై అమెరికాతో చర్చలు లేవని ఇరాన్‌ప్రకటిం చింది. ఇజ్రాయెల్‌ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నివాసంపై దాడులుచేసామని ఇరాన్‌ప్రకటించినా ఇజ్రాయెల్ కొట్టివేసింది. అమెరికాకు చెందిన మూడు యుద్ధవిమానాలు కువైట్‌లో కుప్పకూలాయి. అమెరికా మాత్రం ఇవి ఫ్రెండ్లీఫైర్‌లో కూలిపోయాయని సమర్ధించింది. ఇజ్రాయెల్ మిలిటరీ కూడా ఈజిప్టుపై దాడులు ముమ్మరంచేసింది. ఉత్తర, తూర్పు లెబనాన్‌లో జరిపిన వైమానిక దాడుల్లో హెజ్‌బొల్లా ఇంటెలిజెన్స్ కమాండర్ మహ్మద్‌రాడ్‌ను ఖతంచేసామని ఇజ్రాయెల్‌ప్రకటించింది. ఇదిలా ఉంటే శనివారం ఖమైనీ నివాసంపై జరిపిన దాడుల్లో తీవ్రంగా గాయపడిన ఖమైనీ సతీమణి మన్సూ రేఖోజాస్తే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. 78 ఏళ్ల ఆమె అమరవీరుల హోదా పొందారని ఇరాన్ అధికారికంగాప్రకటించింది. ఇదిలా ఉంటే ఇరాన్ తాత్కాలిక సుప్రీం కమాండర్ అలీరెజాను కూడా అంతంచేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించినా ఇరాన్ మాత్రం ఈ వార్తను ధృవీకరించలేదు. ఇదిలా ఉంటే సౌదీలోని అతిపెద్ద చమురు రిఫైనరీ కేంద్రాలపై ఇరాన్ క్షిపణి దాడులుచేయడంతో రెండింటినీ మూసివేసారు. దీనితోప్రపంచ దేశాలకు చమురుసరఫరాలో తీవ్ర ఆటంకాలు ఎదురయ్యాయి. దీనికితోడు చమురురవాణాకు అత్యంత కీలకమైన హర్మొజ్ జలసందిని ఇరాన్ మూసివేయడంతో చమురురవాణా మొత్తం స్తంభించిపోయింది.

**ఇరాన్ భీకర ప్రతిదాడులు**

తమ దేశంపై వైమానిక దాడులతో తమ సుప్రీం నేతను హతమార్చిన అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించిన ఇరాన్ తన దాడుల



ఇజ్రాయెల్- అమెరికా బాంబు దాడులతో టెహ్రాన్‌లోని ఇళ్ల మధ్య ఏర్పడిన గొయ్యి

వ్యూహం కూడా మార్చింది. సుమారు పది గల్ఫ్‌దేశాల్లో ఏర్పాటుచేసిన అమెరికా స్థావరాలపై దాడులుచేసిన ఇరాన్ తాజాగా తన వ్యూహం మార్చి పౌరనివాసాలు, ఆకాశహర్మ్యాలను టార్గెట్‌చేసింది. పదిదేశాల్లోని ఎయిర్‌పోర్టులు కూడా ఈ దాడులతో మూసివేసారు. అత్యంత రద్దీ ఎయిర్‌పోర్టులు అయిన అబూదాబి, దుబాయి, దోహా ఎయిర్‌పోర్టుల్లో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. సుమారు 3400కిపైగా విమానాలు ఎక్కడికక్కడ నిలిచిపోయినట్లు గల్ఫ్‌దేశాలుప్రకటించాయి. గల్ఫ్‌దేశాల్లో అమెరికా స్థావరాలకు అనుమతించడంవల్లనే ఇరాన్‌పై దాడులుచేస్తోందని ఆరోపిస్తున్న ఇరాన్ దుబాయిలోని బుర్జ్‌ఖలీఫా సమీపంలో దాడులుచేయడంతో అత్యంత ఎత్తయిన ఈ ఖలీఫాను ఖాళీచేయిస్తున్నారు. అలాగే దుబాయి అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుపైనా టార్గెట్‌గా దాడులుచేయడంతో సౌదీ ప్రభుత్వం తక్షణ చర్యలుచేపట్టింది. బహ్రెయిన్, ఖతార్, యుఎఇ, ఒమన్ వంటి దేశాలో ఉన్న వైమానిక స్థావరాలను కూడా ఇరాన్ టార్గెట్‌చేయడంతో ఆదేశాల్లో వణుకు బయలుదేరింది. కువైట్‌లోని అమెరికా ఎంబసీపైనా ఇరాన్ వైమానిక దాడులుచేసింది. అలాగే కువైట్‌లోనే మూడు అమెరికా యుద్ధవిమానాలను కూల్చివేసినట్లు ఐఆర్జీసీ ప్రకటిస్తే ఇది ఫ్రెండ్లీ ఫైర్‌లోనే కూలిపోయాయని అమెరికా సర్దుబాటుచేసుకుంది.

**మూడురోజుల్లో 555మంది ఇరానీయులు మృతి**

సోమవారం కూడా మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు అలాగే కొనసాగాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాలు సంయుక్తదాడులు కొనసాగుతుంటే అమెరికా రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్ యుద్ధం తాముప్రారంభించిందికాదని, కానీ ముగింపు మేమే ఇస్తామని ప్రకటించడం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ సైతం నాలుగు వారాల్లోనేయుద్ధం ముగించేస్తామనిప్రకటించడం చూస్తుంటే రానున్న రోజుల్లో మరింత భీకర దాడులుచేయవచ్చన్న అంచనాలు పెరిగాయి. మరోపక్క హెజబొల్లా ఇరాన్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పై దాడులుచేస్తున్నదన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఇజ్రాయెల్ బీరూట్, లెబనాన్‌లోని తూర్పు ఇతర ప్రాంతాలపై భీకర దాడులు జరిపింది. లెబనాన్‌లోని ఖుడ్స్ బ్రిగేడ్ టాప్‌కమాండర్‌ను అంతంచేసినట్లు ఇజ్రాయెల్‌ప్రకటించింది.

అథమ్ అద్నన్ అల్‌ఓథ్‌మాన్ తమ దాడుల్లో హతమయ్యారని ప్రకటించింది. లెబనాన్‌లోని 70 హెజ్‌బొల్లా కేంద్రాలను టార్గెట్‌గా ఇజ్రాయెల్ దాడులుచేసింది. కాగా అబూదాబి, బహ్రెయిన్, ఖతార్ దేశాలు తాము ఇరాన్‌డ్రోన్లను అడ్డుకున్నామని, కొన్నింటినికూల్చివేసినట్లుప్రకటించినా ఇరాన్‌ప్రతీకార దాడులు మాత్రం భీకరంగానే ఉన్నాయి.

## ప్రజా సేవలో శ్రీపాదరావు ఆదర్శం

### - కర్ణాటక స్పీకర్ ఖాదర్ ఫరీద్

### మాదాపూర్‌లో ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు

**సైబరాబాద్ ప్రతినిధి, మార్చి 2 ప్రభాతవార్త:** ప్రజాసేవలో ఆదర్శంగా నిలువడంతో పాటు రాజకీయ జీవితంలో మచ్చలేని మనిషిగా వెలుగొందిన ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్, దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలు ఎనలేనివని కర్ణాటక రాష్ట్ర శాసనసభ స్పీకర్ యుటి. ఖాదర్ ఫరీద్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ స్పీకర్, దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలను సోమవారం మాదాపూర్ శిల్పకళావేదికలో ఘనంగా నిర్వహించారు. శ్రీపాదరావు కుమారుడు, తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి ఖాదర్ ఫరీద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖాదర్ ఫరీద్ మాట్లాడుతూ దుద్దిళ్ల శ్రీపాదరావుతో కలిసి పనిచేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. సమాజం కోసం జీవితాంతం కృషి చేసిన శ్రీపాదరావు సేవలను గుర్తు చేసుకోవడం అభినందనీయని అన్నారు. సమాజానికి సేవ చేసిన వారిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జీవితంలో మంచిగా ఎదగాలంటే మన ముందు తరాల వ్యక్తులు చేసిన మంచి పనులను గుర్తు చేసుకోవాలన్నారు. ఆస్తులు సంపాదించడం ముఖ్యం కాదని, మన తల్లిదండ్రుల మంచి పేరును కాపాడడం ముఖ్యమని, తెలంగాణ ఐటి శాఖమంత్రి శ్రీధర్‌బాబు తన తండ్రి



శ్రీపాద రావు జయంతి వేడుకల్లో ఆయన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, కర్ణాటక స్పీకర్ ఖాదర్ తదితరులు

ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవలో ఎంతో చురుకుగా ఉండే శ్రీపాదరావు అకాల మరణం తనను ఎంతో కలిచివేసిందన్నారు. రాజకీయాల్లో శ్రీపాదరావు అజాతశత్రువు అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలన్నారు. తాను శాసనమండలి చైర్మన్‌గా శ్రీపాదరావు స్ఫూర్తితో పనిచేస్తున్నట్లు తెలిపారు. మనం ఏ స్థాయిలో ఉన్నా మనకంటే ముందు సేవ చేసిన పెద్దల వ్యక్తిత్వాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగితే రాజకీయాల్లో ఉత్తమంగా రాణించవచ్చని, ప్రజల ఆధరాభిమానాలు ఎల్లవేళలా దక్కుతాయని అన్నారు. శ్రీపాదరావు అడుగుజాడల్లో నడుస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా మంత్రి శ్రీధర్‌బాబు ప్రజా సేవలో ముందుకు సాగుతున్నారని కొనియాడారు.

ఈ సందర్భంగా డిఆర్‌డిఓ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి, పద్మశ్రీ శోభారాజ్, టిసిఎస్ ఉపాధ్యక్షుడు వి.రాజన్నలకు జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. దీంతో పాటు శ్రీపాదరావు పేరు మీద వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి స్ఫూర్తి అవార్డులను సైతం అందజేశారు.

ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అజారుద్దీన్, రైతు కమీషన్ చైర్మన్ కోదండరెడ్డి, మాజీ పార్లమెంటు సభ్యుడు వి.హనుమంతరావు, ఎమ్మెల్యేలు ఆరెకపూడి గాంధీ, రాజ్‌ఠాకూర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, రాకేశ్‌రెడ్డి, లక్ష్మికాంతరావు, గండ్ర సత్యనారాయణ, మక్కన్‌సింగ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీలు దయానంద్, విజయరమణరావు, వాణీదేవి, బల్మూరి వెంకట్, దయాకర్, సినీ నటులు తనికెళ్ల భరణి తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌కు కెనడా యురేనియం

>> యురేనియం సరఫరాలపై కీలక ఒప్పందానికి చేరుకున్నాం. చిన్న మాడ్యులర్ రియాక్టర్లు, కొత్త అణు సాంకేతికతలపై కలిసి పనిచేస్తాం" అని తెలిపారు. ఈ ఒప్పందాన్ని రెండు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యంలో పెద్ద ముందడుగుగా కార్నీ అభివర్ణించారు. ఈ సమావేశంలో ముఖ్యమైన ఖనిజాలు, పునరుత్పాదక శక్తి, సాంస్కృతిక మార్పిడి రంగాల్లో అనేక అవగాహన ఒప్పందాలపై కూడా సంతకాలు జరిగాయి. విదేశాంగ మంత్రి జయశంకర్, కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ సమక్షంలో పత్రాలు మార్పిడి చేశారు.

2030 నాటికి ద్వైపాకిక వాణిజ్యాన్ని 50 బిలియన్ డాలర్లకు పెంచాలని రెండు దేశాలు లక్యంగా పెట్టుకున్నాయి. పునరుత్పాదక ఇంధనం, ఎఐ, క్వాంటం టెక్నాలజీ, సెమీకండక్టర్లు, సూపర్‌కంప్యూటింగ్ వంటి రంగాల్లో సహకారాన్ని పెంచాలని మోడీ నొక్కిచెప్పారు.

విద్యా రంగంలో కూడా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎఐ, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం వంటి రంగాల్లో కొత్త విశ్వవిద్యాలయ భాగస్వామ్యాలు ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. కెనడియన్ విశ్వవిద్యాలయాలు భారత్‌లో క్యాంపస్‌లు ప్రారంభించేందుకు కూడా అంగీకారం కుదిరింది. కాగా, విద్యుత్, టెక్నాలజీ రంగాల్లో సహకరించుకోవాలని ఇరుదేశాలు నిర్ణయించాయి. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, అడ్వాన్స్‌డ్ రియాక్టర్ల తయారీలోనూ ఇరు దేశాలు కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. అంతర్జాతీయ సౌరశక్తి కూటమిలో చేరాలని కెనడా నిర్ణయించింది. గ్లోబల్ బయోఫ్యూయల్ కూటమిలో చేరాలని కెనడా నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. కెనడా నిర్ణయాన్ని ప్రధాని మోడీ స్వాగతించారు.

## పాఠశాలలకు నేడే హోలీ పండుగ సెలవు

### 4కి బదులుగా 3నే సెలవుగా అమలు చేయాలి: విద్యా శాఖ డైరెక్టర్ ఆదేశాలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 02:** తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాలలు నేడు(మంగళవారం) హోలీ పండుగ సెలవు దినంగా పాటించాలని పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ జిల్లా విద్యాశాఖాధికారుల(డీఈవో)ను ఆదేశించారు. పాఠశాల విద్య శాఖ ప్రచురించిన వాల్ అకడమిక్ క్యాలెండర్ 2025-26లో మార్చి 4న హోలీ పండుగ సెలవుగా ప్రకటించామని.. అయితే తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన వార్షిక సెలవుల ప్రకారం జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్(జీఏడీ) హోలీ పండుగకి మార్చి 3న సెలవుదినంగా ప్రకటించిందని.. ఈ నేపథ్యంలో వాల్ అకడమిక్ క్యాలెండర్‌లో ప్రకటించినట్టుగా మార్చి 4(బుధవారం)న కాకుండా మార్చి3(మంగళవారం)న హోలీ పండుగ సెలవును కొనసాగించాలని పేర్కొంటూ పాఠశాల విద్య డైరెక్టర్ సోమవారం డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు.

## మోడీ నిర్ణయాలు దేశానికి ప్రమాదకరం

### -రాహుల్ గాంధీ ఆరోపణ

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 2, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోడీ తీసుకుంటున్న పలు నిర్ణయాలు దేశానికి ప్రమాదకరమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇండో-అమెరికన్ వాణిజ్య ఒప్పందాలు వివాదాస్పదంగా ఉన్నాయని, దానివల్ల ఇక్కడ యుద్ధ పరిస్థితులు దాపురించవచ్చని వ్యాఖ్యానించారు. సోమవారం వికారాబాద్‌లో డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఢిల్లీ నుంచి వచ్చిన రాహుల్ ముందుగా పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో సాగిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పలువురు సీనియర్ నేతలు అనేక అంశాలను రాహుల్ దృష్టికి తెచ్చినట్లు పార్టీవర్గాలు వెల్లడించాయి. తెలంగాణలో ప్రభుత్వం, పీసీసీ సమన్వయంతో పనిచేస్తున్నాయని రాహుల్ కితాబు ఇచ్చారు. ఏపీలో కూడా పార్టీ మరింత పటిష్టమంతంగా తీర్చి దిద్దాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుకోసం పార్లమెంటు సమావేశాల్లో ప్రైవేటు బిల్లు ప్రవేశ పెట్టాలని సీనియర్ నేతలు వి.హనుమంతరావు తదితరులు రాహుల్ దృష్టికి తెచ్చారు. బీసీలకు స్థానిక సంస్థల్లోనే కాకుండా చట్ట సభల్లోనూ సముచిత స్థానం కల్పించేందుకు ఒత్తిడి పెంచాలన్నారు. ప్రైవేటు బిల్లు వల్ల మోడీ సర్కార్ అనుసరించే విధానం ప్రజలకు తెలుస్తుందని నేతలు గుర్తు చేశారు. ప్రతినెలా రాహుల్ తెలంగాణ పర్యటనకు రావాలని కోరారు. పార్టీ పదవుల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలని పీఏసీ మీటింగ్‌లో చర్చించారు. ఏపీలో పార్టీ బలోపేతం కోసం నాయకత్వానికి అధిష్టానం బాసటగా నిలవాలని ఆ రాష్ట్ర నేతలు కోరారు. నేతల సూచనల పట్ల రాహుల్ సానుకూలంగా స్పందించారు. ఖాళీ ఏర్పడనున్న రాజ్యసభ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కూడా చర్చ జరిగింది. ఇలా ఉండగా డీసీసీ అధ్యక్షుల మీటింగ్‌కు మంత్రులకు ఆహ్వానం లేదంటూ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ సూచించారు. దాంతో వికారాబాద్‌కు వచ్చిన మంత్రులు హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.

**ఎమ్మెల్యేగా ఆహ్వానించా : స్పీకర్**

పార్లమెంట్‌లో తమ పార్టీ వాయిస్ వినిపించే నేత రాహుల్ గాంధీకి స్వాగతం పలికేందుకు వికారాబాద్ ఎమ్మెల్యేగా వచ్చానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యానించారు. తన సొంత నియోజకవర్గంలో రాహుల్ పర్యటన వల్ల ప్రొటోకాల్ ప్రకారం హాజరై స్వాగతం పలికానని చెప్పారు. తాను స్పీకర్ హోదాలో రాలేదన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై మీడియాఅడిగిన ప్రశ్నలకు నోకామెంట్ అంటూ వెళ్లిపోయారు.

## శబరిమలై ఆలయంలోకి మహిళల ప్రవేశంపై నిషేధం

### పాత విధానమే కొనసాగించాలని దేవస్వామ్ బోర్డు ప్రతిపాదన

**పతనంతిట్ట, మార్చి 2:** శబరిమల ఆలయంలోకి మహిళలందరికీ ప్రవేశం కల్పిస్తూ 2018లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పును ట్రావెన్ కోర్ దేవస్వమ్ బోర్డు మొదటి నుంచి వ్యతిరేకిస్తోంది. ఈ తీర్పును సమీక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టిన నేపథ్యంలో అఫిడవిట్ దాఖలు చేయాలని ట్రావెన్ కోర్ దేవస్వమ్ బోర్డు నిర్ణయించింది. శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆచారాలను, సంప్రదాయాలను కాపాడేందుకు ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు ఈ కీలక నిర్ణయం తీసుకున్నది. ఆలయంలో దశాబ్దాలుగా కొనసాగుతోన్న సంప్రదాయాన్ని తాము సమర్థిస్తున్నామని, మహిళల ప్రవేశంపై అదే ఆచారం కొనసాగాలని బోర్డు తెలిపింది. మార్చి 14వ తేదీ లోగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని బోర్డు సమావేశంలో నిర్ణయించారు. మహిళల ప్రవేశానికి సంబంధించి పాత సంప్రదాయాన్నే కొనసాగించాలనే విషయంలో బోర్డులో ఎవరికీ భిన్నాభిప్రాయాలు లేవని బోర్డు సభ్యులు తెలిపారు. దేవాలయం పవిత్రతను, పురాతన సంప్రదాయాలను కాపాడటమే బోర్డు ప్రాథమిక బాధ్యత అన్నారు.

# రాహుల్‌గాంధీ కార్యక్రమంలో మంత్రులకు దక్కని ప్రవేశం

### హైదరబాద్‌కు తిరిగొచ్చిన వైనం!

### శిక్షణలో సరిగా పాల్గొనని డిసిసిలకు సర్టిఫికెట్ ప్రదానం చేయకుండా నిరాకరణ

**హైదరాబాద్,మార్చి 2,ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డిసిసి అధ్యక్షుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం లో పాల్గొనేందుకు వికరాబాద్‌కు వచ్చిన రాహుల్‌గాంధీ కార్యక్రమంలో మంత్రులకు ప్రవేశం నిరాకరించడంతో తిరిగి హైదరాబాద్‌కు చేరుకొని సచివాలయంలో వారివారి శాఖల పనుల్లో నిమగ్నమయ్యారు. సోమవారం వికారాబాద్ జిల్లా అనంతగిరిలో కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో ఎఐసిసి అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ముఖ్యమంత్రి రేవంత్, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, టిపిసిసి మహేష్ గౌడ్ అధ్యక్షతన పిఎసి సమావేశం కొనసాగింది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జిల్లా అధ్యక్షుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాహుల్‌గాంధీ టిపిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ పరిస్థితిపై పార్టీ నేతలతో చర్చించారు.

మంత్రులపై ఫీడ్ బ్యాక్ తీసుకోవాలనే ఉద్దేశ్యంతో మంత్రులను వెనక్కి పంపినట్లు కాంగ్రెస్ వర్గాలు చర్చించుకొంటున్నాయి. పిఎసి సమావేశం అనంతరం డిసిసి అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి అవసరమైన కార్యచరణను వారితో చర్చించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన మార్పులతో చేసుకోవాలని వివరించారు. డిసిసి శిక్షణా తరగతులకు మంత్రులకు రావద్దని పిసిసి చీఫ్ మహేష్ చెప్పిన ప్పటికీ మంత్రులు రావడంతో వారిని మొత్తానికి వెనక్కి పంపారు. డిసిసిసి శిక్షణా తరగతులు పదిరోజుల పాటు అత్యంత కఠినంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో జరిగాయి. డిసిసిలు తినే కంచం, తాగే టీ గ్లాస్‌లను ఎవరివి వారే శుభ్రం చేసుకోవడంతో పాటు పరిసరాలను శుభ్రం చేయడం వంటి పనులు కూడా చేయించారు. శిక్షణా తరగతులలో సాత్వికభోజనం మాత్రమే ఉండటంతో శిక్షణలో పాల్గొన్న వారు మొదటి రెండు రోజులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కొంత మంది డిసిసి అధ్యక్షులు,ముఖ్యంగా ఎమ్మెల్యే పదవితో పాటు జోడు పదవులు నిర్వహించేవారు శిక్షణకు ఒక్కరోజు డుమ్మాకొట్టినా వారికి సర్టిఫికెట్ ఇవ్వ కుండా నిరాకరించారు. రాహుల్‌గాంధీ చేతుల మీదుగా డిసిసి శిక్షణా తరగతుల సర్టిఫికెట్ అందుకోలేకపోతున్నామని అసంతృప్తి చెందారు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఎంపి ఈటల రాజేందర్

## విద్యుత్ సంస్థ కార్మికులకు జిఒ నం. 11ను తక్షణమే అమలుచేయాలి

### ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మార్చి 2, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థలో గత 25 సంవత్సరాల నుంచి పీస్ రేటు పద్ధతిలో పనిచేస్తుననన కార్మికులకు జీవో నెంబర్ 11ను తక్షణమే అమలుచేయాలని ఎంపి ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై ఈటెల రాజేందర్ మాట్లాడుతూ టీజీఎస్‌పిడిసిఎల్ లో పనిచేస్తున్న 1600 మంది మీటర్ రీడర్స్ కార్మికుల న్యాయమైన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, కనీస వేతనాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ద్వారా ఈఎస్ఐ, ఈపీఎఫ్ చెల్లించాలని, వారి విద్యార్హతను బట్టి సబ్‌స్టేషన్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, మిగిలిన మీటర్ రీడర్స్‌ను కొత్త డిస్కంలో ఆర్టిజన్‌గా గుర్తించాలని డిమాండ్ చేశారు. మీటర్ రీడర్స్ చేసే పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ నాయకులు కొమంచిలి బాబ్జీ, వడ్ల బ్రహ్మం, చిరంజీవి, ప్రశాంత్, విజయభాస్కర్, అమృత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దుబాయ్‌లో చిక్కుకుపోయిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్యన నెలకొన్న యుద్ధం కారణంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులు దుబాయిలో చిక్కుకుపోయారు. వీరిలో తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయన కుటుంబ సభ్యులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో కలిసి అయిదు రోజుల క్రితం దుబాయికి వెళ్లారు. తన అల్లుడు అకస్మా త్తుగా అనారోగ్యానికి గురవడంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఆయన దుబాయికు వెళ్లినట్లు సమాచారం. చికిత్స అనంతరం తుమ్మల, ఆయన కటుంబసభ్యులు తిరిగి రావాలని భావిస్తున్న తరుణంలో పశ్చిమా సియాలో యుద్ధం తీవ్రరూపం దాల్చడంతో ఆ ప్రభావం దుబాయిపై పడింది.

**దుబాయ్‌లోని పలు ప్రాంతాల్లో..**

ఇరాన్ దాడులకు పాల్పడింది. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టుపై కూడా దాడులు జరిగాయి. దీంతో విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసి వేశారు. విమాన రాకపోకలు నిలిచిపోయాయి. ఎమిరేట్స్ సహా భారతీయ విమాన సంస్థలైన ఎయిర్ ఇండియా, ఇండిగో కూడా తమ సర్వీసులను రద్దు చేశాయి. దీంతో తుమ్మల, ఆయన కుటుంబ సభ్యులు దుబాయిలో చిక్కుకుపోయారు. ఎయిర్‌పోర్టు క్లియరెన్స్ వచ్చే వరకూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇండియాకు తిరిగిరాలేని పరిస్థితి నెలకొంది. అయితే ప్రస్తుతం దుబాయ్‌లో మంత్రి తుమ్మల, ఆయన కుటుంబ సభ్యులు సురక్షితంగానే ఉన్నారు. రెండు రోజుల్లో విమాన సర్వీస్సులు ప్రారంభంకాగానే ఆయన హైదరాబాద్ తిరిగిరానున్నారు. అయితే, ఇరాన్ బాంబుల వర్షం కురిపిస్తున్న వేళ తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోవడంతో ఆయన అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు.



బహ్రెయిన్‌లో చిక్కుకున్న గాంధీనగర్ ప్రాంతానికి చెందిన తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనే సాల్మన్‌రాజ్ తదితరులు

## బహ్రెయిన్‌లో చిక్కుకున్న గాంధీనగర్ తెలుగు పర్యాటకులు

### వైమానిక దాడుల నేపథ్యంలో స్వదేశానికి చేరలేక ఇబ్బందులు.. ఆశ్రయం కల్పించిన తెలుగువారు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మార్చి 2, ప్రభాతవార్త:** బహ్రెయిన్‌లోని అమెరికా నౌకాదళ స్థావరమే లక్ష్యంగా జరిగిన వైమానిక దాడుల నేపథ్యంలో నగరంలోని గాధీనగర్ ప్రాంతానికి చెందిన తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనే సాల్మన్ రాజ్ , సభ్యులు విజయ్ భాస్కర్ దేవరకొండ, పాల్ రాజు కలిగితి, కనపాల విన్నయ్య, బెంజిమన్ శామ్యూల్ మార్పు, ప్రేమ్ కుమార్ జొన్నకుటి నాలుగు రోజుల కింద బహ్రెయిన్ వెళ్లారు. సోమవారం బహ్రెయిన్‌లో తాను క్షేమంగా ఉన్నట్లు చిత్రాలను ప్రభాతవార్త కు పంపించారు. అకస్మాత్తుగా దాడులు మొదలు కావడంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 100 మంది పర్యాటకులు మనామా విమానాశ్రయంలో చిక్కుకుపోయారు. ఫిబ్రవరి 24న గల్ఫ్ ఎయిర్ ద్వారా పర్యాటకులుగా బహ్రెయిన్ చేరుకున్న వీరు, షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 28న మధ్యాహ్నం 2:30 గంటలకు తిరుగు ప్రయాణం కావాల్సి ఉంది. అయితే, విమానాశ్రయంలో చెక్‌ఇన్ ప్రక్రియ పూర్తి చేసుకునే తరుణంలో ఒక్కసారిగా యుద్ధ వాతావరణం నెలకొనడం, విమాన సర్వీసులు నిలిచిపోవడంతో వీరంతా అక్కడే ఉండిపోయారు. విమానాశ్రయంలో సుమారు 100 మందికి పైగా తెలుగు మాట్లాడే వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనే సోలోమన్ రాజ్ , సభ్యులు విజయ్ భాస్కర్ దేవరకొండ, పాల్ రాజు కలిగితి, కనపాల విన్నయ్య, బెంజిమన్ శామ్యూల్ మార్పు, ప్రేమ్ కుమార్ జొన్నకుటి అనే ఆరుగురు వ్యక్తులతో పాటు మరికొందరు మనామాలోని అద్లియా అవెన్యూలో గల 'ది ఇన్ఫినిటీ సూట్స్' హోటల్‌లో ఆశ్రయం పొందుతు న్నారు. వీరందరికి శ్రీనివాస్ తో పాటు మరికొందరు తెలుగువారు ఆశ్రయం కల్పించి వారికి భోజన, వసతి సదుపాయాలు కల్పించారు. భారత రాయబారకార్యాలయం నుంచి కానీ, గల్ఫ్ ఎయిర్‌వేస్ యాజమాన్యం నుంచి కానీ మాకు ఎటువంటి స్పష్టమైన సమాచారం అందడం లేదు.

## ఖమేనీ కుటుంబంలో తీవ్రవిషాదం

### అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో సుప్రీం లీడర్ భార్యకు తీవ్రగాయాలు



### ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

**టెహ్రాన్, మార్చి 2:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఖమేనీ భార్య మన్సూరేహ్ ఖోజస్తే బాగెర్‌జాదే అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా జరిపిన దాడుల్లో తీవ్రంగా గాయపడి మరణించారు. శనివారం ఇరాన్‌పై జరిగిన వైమానిక దాడుల్లో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయని, ఆ తర్వాత కోమాలోకి వెళ్లి సోమవారం తుదిశ్వాస విడిచారని ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఆమె మరణంతో షహీద్ (అమరవీరుల) స్థాయికి చేరుకున్నారని ఆదేశ ప్రసారసంస్థ ఇర్నా ప్రకటించింది. ఇదే దాడుల్లో అయతొల్లా ఖమేనీ కూడా మరణించినట్లు ఇరాన్ మీడియా ఇదివరకే ప్రకటించింది. కేవలం ఖమేనీ దంపతులే కాకుండా.. వారి కుమార్తె, మనవరాలు, కోడలు, అల్లుడు కూడా ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఇరాన్ అత్యున్నత నాయకుడి కుటుంబం మొత్తం తీవ్ర ప్రభావానికి లోనైంది. 1947లో మష్హద్‌లోని ఓ వ్యాపారి కుటుంబంలో జన్మించిన మన్సూరేహ్, 1964లో ఖమేనీని వివాహం చేసుకున్నారు. వీరికి ఆరుగురు సంతానం కాగా, ఆమె జీవితాంతం బయటి ప్రపంచానికి దూరంగా, అంతర్ముఖంగానే ఉన్నారు. తాజా పరిణామాలతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఈ దాడులకు ప్రతీకారంగా దీర్ఘకాలిక యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధికారులు ప్రకటించడంతో అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# సబ్సిడీపై వ్యవసాయ డ్రోన్ల పంపిణీ

### వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా అమలు

### తొలి విడతలో జిల్లాకు 10 చొప్పన పంపిణీ

### రైతుల సాగు వ్యయం తగ్గించి, ఆదాయం పెంచడమే లక్ష్యం

### వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు



**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** రైతులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుభవార్త చెప్పారు. వ్యవసాయ యాంత్రీకీకరణ పథకంలో భాగంగా సబ్సీడీపై వ్యవసాయ డ్రోన్లను పంపిణీ చేయనున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రికరణను వేగవంతం చేయడం కోసం ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్ (ఎస్‌ఎంఎఎం) పథకం కింద పలు వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందజేస్తోందని తెలిపారు. ఇప్పటికే చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు ప్రాధాన్యంతో యంత్రాలను అందజేస్తున్న ప్రభుత్వం, రైతుల కోరిక మేరకు ఆధునిక సాంకేతిక వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా వ్యవసాయ డ్రోన్లను కూడా సబ్సిడీపై అందజేయాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయం మేరకు తొలి విడతలో ప్రతి జిల్లాకు 10 చొప్పున వ్యవసాయ డ్రోన్లను 40శాతం సబ్సిడితో గరిష్టంగా రూ.4లక్షల వరకు వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పివో), ప్రాథమిక సహకార సంఘాలకు అందజేయ నున్నట్లు తెలిపారు. డ్రోన్ల వినియోగంతో పిచికారి సమయం 70-80శాతం వరకు తగ్గడంతోపాటు ఎరువులు, సూక్ష్మ పోషకాలు సమానంగా పంటపై పిచికారి చేయడం సాధ్యమవుతుందన్నారు. కూలీల ఖర్చు తగ్గి రైతులకు లాభం పెరుగుతుందని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల తెలిపారు. డ్రోన్లను సబ్సిడిపై అందజేయడం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన డ్రోన్లను అందుబాటులోకి తీసుకు వచ్చి వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రభుత్వం ఒకవైపు ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూనే, ఉద్యానవన పంటల అభివృద్ధి కోసం పసుపు ఉడకపెట్టే యంత్రాలు, పసుపు పాలిషింగ్ యంత్రాలు, ఆయిల్ పామ్ కోతకు టెలిస్కోపిక్ హార్వెస్టింగ్ పోల, ఇతర ఉద్యానవన పంటల కోత పరికరాలను కూడా సబ్సిడీ పథకంలో చేర్చిందని మంత్రి తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన అర్హతలు, సబ్సిడీ శాతం, దరఖాస్తు విధానం వంటి వివరాలు జిల్లా వ్యవసాయ కార్యాలయాలలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. 2025-26 సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 9936 వ్యవసాయ యంత్రాలను రూ.28.74 కోట్ల సబ్సిడీపై రైతులకు అందచేయడం జరిగిందని, రానున్న 1015 రోజుల్లో మిగతావన్నీ రైతులకు అందచేయడానికి ఏర్పాట్లు చేయడం పూర్తి చేశామని తెలిపారు.

# సాధారణస్థాయి మించి ఉష్ణోగ్రతలు నమోదు

### 36 డిగ్రీల చేరువకు..

### 16 జిల్లాలకు ఎల్లో అలెర్ట్

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అప్పుడే వేసవి తీవ్రత ప్రారంభమైంది. ప్రస్తుతం వివిధ జిల్లాల్లో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదు కావాల్సి ఉండగా, దాని కంటే మించి 2 డిగ్రీలు పైబడి అధికంగా నమోదవుతోంది. దీంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 36 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరుకోవడంతో 16 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ అయ్యాయి. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోని మంచిర్యాల, వనపర్తి జిల్లాల్లో 35.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

ఎల్లో అలెర్ట్ జారీ చేసిన నల్లగొండ, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 35.1 డిగ్రీలు, నిజామాబాద్ 35, గద్వాల్ 35.5, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి 35.2 డిగ్రీలు, ములుగు, నిర్మల్ 35.1, హన్మకొండ, వికారాబాద్, భువనగిరిలో 35.0, ఆసిఫాబాద్ జిల్లాలో 35.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయింది. ఇక రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రలు నమోదు కానున్నాయి.

అదేవిధంగా నల్లగొండ, భూపాలపల్లి, సూర్యాపేట్ జిల్లాల్లో వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని అంచనా. కాగా ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు ఫిబ్రవరి రెండో వారం నుంచే ప్రారంభమయ్యాయి. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో సాధరణం, అంతకంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో మాత్రం సాధారణం కంటే అధికంగా రికార్డయ్యాయి. ఇది క్రమేపీ పెరుగుతూ ఈ సీజన్‌లో గరిష్టంగా 44 నుండి 46 డిగ్రీల మధ్యలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడిస్తోంది.

## ఆన్‌లైన్ గేమింగ్ గోల్‌మాల్..

## ఫినో పేమెంట్స్ బ్యాంక్ ఎండి, సిఇఒ రిషిగుప్తా అరెస్టు



రిషి గుప్తా

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** ఆన్‌లైన్ గేమింగ్ వ్యవహారంలో జిఎస్‌టి ఎగవేతకు సంబంధించి జరిగిన భారీ గోల్‌మాల్‌లో ఫినో పేమెంట్స్ బ్యాంక్ మేనేజింగ్ డైరక్టర్, సీఈఓ రిషి గుప్తాను డైరక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్ (డిజిజిఐ) అధికారులు అరెస్టు చేశారు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన సోమవారం వెలుగు చూసింది. రిషి గుప్తా అరెస్టు ప్రైవేటు బ్యాంకింగ్. ఫైనాన్స్ రంగాలలో తీవ్ర సంచలనం రేపింది. ఆ న్‌లైన్ గేమింగ్ సిండికేట్‌కు సంబంధించిన పన్నుల ఎగవేత కేసులో రిషి గుప్తాను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. వివరాలు ఇలావున్నాయి. ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్ ఫారంల ద్వారా జరుగుతున్న అక్రమ లావాదేవీలపై డిజిజిఐ దేశ వ్యాప్తంగా కొంత కాలంగా నిఘా వుంచగా పలు ప్రైవేటు బ్యాంకులకు చెందిన ఉన్నతస్థాయి వ్యక్తులు అక్రమాలకు పాల్పడినట్లు వెలుగు చూశాయి. హైదరాబాద్‌తో పాటు దేశంలోని పలు నగరాలలో సేవలం దిస్తున్న ఫినో పేమెంట్స్ బ్యాంక్ ఎండి, సీఈఓగా వున్న రిషి గుప్తా ఈ తరహా నేరానికి పాల్పడినట్లు డిజిజిఐ పక్కా ఆధారాలు సేకరిం చింది. 13 కోట్ల రూపాయలకు పైగా ఆయన ఆన్‌లైన్ గేమింగ్ సిండికేట్ కార్యకలాపాలకు సంబంధించి అక్రమాలకు పాల్పడినట్లు డిజిజిఐ అధికారులు గుర్తించా రు. ఈ సిండికేట్ నిర్వహణలో భారీగా జిఎస్‌టి ఎగవేతకు పాల్పడినట్లు డిజిజిఐ తేల్చింది. ఈ అక్రమ లావాదేవీలన్నీ ఫినో బ్యాంకు ఖాతాల ద్వా రానే జరిగినట్లు తేలింది.

ఈ గోల్‌మాల్‌లో ఫినో బ్యాంక్ సుమారు 840 కోట్ల రూపాయల జిఎస్‌టి ఎగ్గొట్టినట్లు డిజిజిఐ నిర్ధారించింది. గేమింగ్ కంపెనీలతో కుమ్మక్కై, నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక లావాదేవీలకు బ్యాంకు సహకరించిందని డిజిజిఐ తేల్చింది. కాగా జిఎస్‌టి ఎగవేతలో కొత్త తరహా మార్గాలను రిషి గుప్తా ఎంచుకున్నట్లు డిజిజిఐ నిర్ధారించింది. ఇందుకుగానూ రిషి గుప్తాను డిజిజిఐ బాధ్యుడుగా తేల్చింది. ఈ కేసులో నాం పల్లిలోని ఆర్థిక నేరాల కోర్టులో రిషి గుప్తాను హాజరు పరిచగా దీనిని విచారించిన న్యాయమూర్తి రెండు వారాల రిమాండు విధించారు.

కాగా ఈ కేసులో రిషి గుప్తాతో పాటు ఇంకా ఎవరెవరున్నారనే కోణంలో డిజిజిఐ విచారిస్తోంది. దీంతో పాటు గోల్‌మాల్‌కు సంబంధించిన నిధులు ఎక్కడి వెళ్లాయనే కోణంలో విచారణ సాగుతోంది. దేశంలో ఒక ప్రముఖ పేమెంట్స్ బ్యాంక్ సీఈఓ ఇలాంటి కేసులో అరెస్టవడం ఇన్వెస్టర్లతో పాటు ఖాతా దారుల్లో ఆందోళన రేకెత్తించింది.

# ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు విచారణ

### వాడివేడిగా ఇరుపక్షాల వాదనలు

### విచారణ నేటికి వాయిదా

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు సంబంధించి జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై హైకోర్టులో విచారణ జరిగింది. నివేదికను రద్దు చేయాలంటూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎస్కే జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వి, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తరఫున నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ రిపోర్ట్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేసీఆర్ తరుపున లాయర్లు వాదనలు వినిపించారు. సాక్షులు ఎవరైనా పిటిషనర్‌కు వ్యతిరేకంగా స్టేట్మెంట్ ఇస్తే అప్పుడు నోటీస్ జారీ చేసి వారి వాదన వినాలని చట్టం చెబుతుందని కేసీఆర్ తరఫు న్యాయవాది వెల్లడించారు. నివేదికలో తీవ్ర ఆరోపణలు చేయడం , పిటిషనర్ పరువు, కీర్తికి నష్టం కలిగేలా చేయడం సరైంది కాదని హైకోర్టుకు తెలిపారు.

అదే సమయంలో ప్రభుత్వ తరఫు న్యాయవాదులు కూడా పలు కీలక అంశాలను ధర్మాసనం ముందుంచారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఏం జరిగిందో తెలుసుకునే హక్కు ప్రభుత్వానికి ఉందని, కేసీఆర్, హరీష్‌రావుకు విచారణ కమిషన్ తగిన అవకాశం ఇచ్చిందన్నారు. తన విధులు నిర్వహించడం లో స్మితా సబర్వాల్ విఫలమయ్యారని నివేదికలో ఉందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను మంగళవారం మధ్యాహ్నం 2.15కు వాయిదా వేసింది. కాగా.. ఎలాంటి ఆధారాలు లేకుండా కేసీఆర్ నేతృత్వంలోని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసి రాజకీయ వ్యూహంలో భాగంగా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గతంలో కేసీఆర్, హరీశ్‌రావులు ఇచ్చిన పిటిషన్‌లో పేర్కొన్నారు. నివేదిక కాపీని అందజేయకుండా ప్రభుత్వం మీడియా ప్రచురణలకు ఇవ్వడంలో దురు ద్దేశపూరితం, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని ఆరోపించారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైనటువంటి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో డిజైనింగ్ లోపాలు, ప్రణాళిక సహా అన్నింటికీ సీఎంగా తానే బాధ్యుడినంటూ జస్టిస్ ఘోష్ కమిషన్ ఏవిధంగా నిర్ణయించిందో చెప్పాల్సినటువంటి అవసరం ఉందంటూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల హైకోర్టుకు నివేదించారు. ప్రభుత్వం అందించిన రికార్డుల ఆధారంగా నిర్ణయించడం సరికాదని ఆయన అన్నారు. అందుకు సంబంధించిన అన్ని ఆధారాలను సమర్పించి వివరణ తీసుకున్నాక మాత్రమే ఓ నిర్ధారణకు రావాల్సి ఉంటుందన్నారు. అయితే కమిషన్ ఇందుకు విరుద్ధంగా వ్యవహరించిందని హైకోర్టుకు నివేదించారు. సాక్షి గా పిలిచి దోషిగా అభియోగాలు మోపారని కేసీఆర్ తన పిటిషన్‌లో తెలిపారు. తన ప్రతిష్ఠ దెబ్బతీసేలా నిర్ధరణ ఉన్నప్పుడు, అందుకు గల ప్రాతిపదికను సెక్షన్ 8 బీ, సీ ప్రకారం నోటీసు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. పిటిషనర్‌కు వ్యతిరేకంగా అభియోగాలు మోపిన వారి వివరాలు చెప్పలేదన్న కేసీఆర్, వాంగ్మూలం ఇచ్చిన వారిని ప్రశ్నించే అవకాశం ఇవ్వలేదన్నారు.

## రసాయన రంగులతో హోలీ వద్దు

### సహజసిద్ధమైన వాటితోనే జరుపుకోండి

### పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

### అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపు

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** రసాయన (కెమికల్) రంగులతో కాకుండా పూలు, ఔషధ మొక్కలు, ప్రకృతి వనరులతో తయారైన సహజ రంగులతో హోలి పండగను జరుపుకోవాలని రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. పర్యావరణానికి, మనుషులకు హాని కలిగించే రసాయనిక రంగులతో హోలి జరుపుకోవడం పలు అనర్థాలకు దారితీస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పండుగలను కూడా పర్యావరణహితంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు హోలీ పండుగను ప్రజలందరూ ఆనందంగా, సురక్షితంగా జరుపు కోవాలని సోమవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హోలి రంగుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హోలీ పండగను ప్రేమ, ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా మలుచుకోవాలన్నారు.

## ఐటి కారిడార్‌లో 6.30 ఎకరాల భూమిని కాపాడిన హైడ్రా

### రూ. 600 కోట్ల విలువైన స్థలం చుట్టూ కంచె

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** ఐటి కారిడార్‌కు ఆనుకుని గంధంగూడలో 6.30 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ రూ. 600 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం గంధంగూడలో 6.30 ఎకరాల ప్రభుత్వ భూమిని జలమండలికి ప్రభుత్వం కేటాయించింది. అయితే ఈ స్థలంలో రకరకాల పేరిట ఆక్రమణలు చేస్తూ వస్తున్నారు. కొన్ని షెడ్డులు కూడా వేసి కబ్జా చేశారు. జలమండలి నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు మున్సిపల్, రెవెన్యూ అధికారులతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం ప్రభుత్వం కేటాయించినదిగా గుర్తించారు. ఆ భూమిని ఆక్రమించి కొంతమంది వేసిన షెడ్డులను తొలగించింది. మొత్తం 6.30 ఎకరాల జలమండలికి కేటాయించిన భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసి ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

## అసిస్టెంట్ ప్రొఫెసర్ల సరెండర్‌పై ఎపి మోడల్‌కు తీవ్రవ్యతిరేకం

### రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం కోసం పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ (డిపిహెచ్) తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి) నుండి అర్హత కలిగిన అభ్యర్థులను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎద్యు కేషన్ (డిఎంఈ)కి సరెండర్ చేసే విషయంలో ఏపీ మోడల్ ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టిజిజిడిఏ) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించింది. ఏపీ మోడల్ తెలంగాణ సర్వీస్ నియమాలు, నియామక విధానాలకు విరుద్ధమని సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బి నరహరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ లాలూ ప్రసాద్ రాథోడ్, ట్రెజరర్ డాక్టర్ ఎంఎకె రావూఫ్ అన్నారు. సరెండర్ చేయడానికి సరైన సీనియారిటీ నిబంధనలు, అర్హత ప్రమాణాలు, ఎంపిక ప్రక్రియను పాటించకుండా సరెండర్‌ను అమలు చేయడం సరైంది కాదన్నారు. ఇలా చేయడమంటే నియమాలను ఉల్లంఘించడం, చట్టపరమైన సమస్యలను సృష్టించడమే నన్నారు. ఇది సీనియారిటీ వివాదాలకు దారితీస్తుందని, సర్వీస్‌లోని వైద్యులను నిరాశపరచడంతో పరిపాలనా అస్థిరతకు కారణమయ్యే ప్రమాదం ఉందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థుల సరెండర్‌ను తెలంగాణ సర్వీస్ నిబంధనల ప్రకారం ఖచ్చితంగా చేయాలని, సీనియారిటీ ప్రకారం అర్హతలున్న వారిని ఎంపిక చేసి పారదర్శకతను పాటించాలన్నారు.


**REGISTRATION OF VENDORS MILITARY HOSPITAL SECUNDERABAD**

1. Commandant, MH Secunderabad invites application from authorized vendors for supply of drugs, consumable, medical gases and repair of medical equipments to this hospital for a period of one year wef Apr 2026 to Mar 2027
2. Application forms may be collected from Medical Stores, Military Hospital, Trimulgherry, Secunderabad-500015, on payment of Rs 500/- through DD payable in favour of Commandant, MH Secunderabad, from **0900 Hrs to 1400 Hrs on all working days from 03 Mar 2026 to 14 Mar 2026.**
3. Last date of submission of form duly completed in all respects is **18 Mar 2026 till 1400 Hrs.**

Sd/-. Commandant MH, Secunderabad.

తెలంగాణ ప్రభుత్వము, దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవస్థానము
మైసిగండి గ్రా. కడ్తాల మం, రంగారెడ్డి జిల్లా
తేది : 02.03.2026

**బహిరంగ వేలము ప్రకటన -5వ సారి**

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియచేయునది ఏమనగా శ్రీ మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవస్థానము నందు 2025-2026 సంవత్సరమునకు అనగా తేది: 25.03.2026 నుండి 30-03-2026) వరకు ఈ దిగువ కనబర్చిన హక్కుకు లైసెన్సు బహిరంగ వేలము ద్వారా (శ్రీ రామనవమి బ్రహ్మోత్సవాల సందర్భముగా) ఇచ్చుటకు తేది: 13.03.2026 శుక్రవారము ఉ.11.00గం.లకు శ్రీ మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవస్థానము మైసిగండి నందు వేలం పాట నిర్వహించబడును. లైసెన్సు హక్కు కాలపరిమితి తేది: 25.03.2026 నుండి 30.03.2026 వరకు. క్ర.సం. వేలము వివరములు. డిపాజిట్: 1. నలువ పందిర్లు 2,000. 2. విద్యుత్ దీపాలంకరణ 2,000. పైన చూపబడిన వేలము పాటలకు సంబంధించి ఇతర నియమ నిబంధనలను దేవాలయ కార్యాలయములో తెలుసుకొనగలరు. టెండరు పత్రములో ఉన్న షరతులు వర్తించబడును. సెల్: 9989174398. ఇతర షరతులు, వివరములకు దేవస్థాన కార్యాలయములో సంప్రదించగలరు.

సం/-. శ్రీమతి ఆర్.లక్ష్మీ శిరోళి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్

సం/-. శ్రీమతి స్నేహలత, కార్యనిర్వహణాధికారి.

DIPR.NO. 16257-PP/CL/ADVT/1/2025-26 తేది: 02.03.2026

వార్త

మనం తలపెట్టిన కార్యం మంచిదనే నమ్మకం మనకున్నప్పుడు, అవాంతరాలెన్ని ఎదురైనప్పటికీ పట్టించుకోరాదు.

-ఫిలిప్‌మాసింగర్

# మింటికెగసిన యుద్ధజ్వాలు!

పశ్చిమాసియాలో యుద్ధం అత్యంత భీకర స్థాయికి చేరుకుంది. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా ఇరాన్‌పై జరిపిన భారీ వైమానిక దాడుల్లో ఆ దేశ సుప్రీం లీడర్‌అయతొల్లా అలీ ఖమేనీ మరణించారు. ఆ విషయం తెలిసి అనేక దేశాల్లో జనం ప్రతీకార దాడులకు తెగబడ్డారు.నిరసనలకు దిగారు. సామ్రాజ్యవాదానికి అమెరికా మరోపేరన్నది చరిత్ర చెబుతోంది.కానీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీ పగ్గాలు చేపట్టాక అనేక సందర్భాల్లో ఆయన తెంపరితనాన్ని చూపించారు. తాజాగా ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తోందన్న మిషపై ఇజ్రాయిల్ తరఫున ఇరాన్‌పై యుద్ధం ప్రకటించింది. అంటే ఇజ్రాయెల్ అపనమ్మకం ఇరాన్ కొంప ముంచింది. ఇరాన్ బలపడితే చమురు వాణిజ్యానికి అడ్డంకులు ఏర్పడతాయన్న ఇజ్రాయెల్ ఆందోళన వల్లే అమెరికా తక్షణమే ఇరాన్ పై యుద్ధజ్వాలను రగిల్చింది. ఇజ్రాయెల్ అమెరికాకు నమ్మిన బంటు. అత్యంత ఆప్తమిత్రత్వం ఉంది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యహు చెప్పాడంటే ట్రంప్ 'ఊ' కొట్టాల్సిందే. ట్రంప్ ఆదేశిస్తే నెతన్యాహు జీ హుజూర్ అనాల్సిందే. అదే స్నేహం ఇప్పుడు ఇరాన్ పైకి పురికొల్పడానికి కారణమైంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోఇరాన్ సుప్రీమ్ లీడర్ ఖమేని 48 మంది సైనికాధికారులతో ఉండగా ముమ్మర దాడులు చేసిమట్టుబెట్టారు. అమెరికా, ఇజ్రాయిల్‌లకు ఇరాన్ వార్నింగ్ ఇవ్వగానే ఇరాన్ నుంచి ప్రతీకార దాడులను సహించబోమని అమెరికా సైన్యం,క్షిపణులు, డ్రోన్‌లతో తీవ్ర దాడులు మొదలెట్టింది. పైగా ఇరాన్ ప్రజల స్వేచ్ఛ కోసం తాను ఏమైనా చేస్తానని ట్రంప్ ఇరాన్ ప్రజలకు సందేశమిచ్చారు. ఇరాన్‌లో ఉగ్రవాదాన్ని వ్యాపింప చేసిన ఖమేని లేని ఈతరుణంలో తమ భవిష్యత్‌ను ఉజ్వలం చేసుకోవాలని ఇజ్రాయెల్ దేశాధ్యక్షుడు నెతన్యాహు ఇరాన్ ప్రజలను కోరారు. ఖమేని హయాంలో దాదాపు 12 వేల మంది ఇరానీయలను ఊచకోతకోశారని అంతర్జాతీయ సంస్థల అంచనా.ఆయన మరణాన్ని జీర్ణించుకోలేని హమాస్, హౌతీలు, హెజ్బొల్లాలు పలు దేశాల్లో నిరసన దాడులకు దిగాయి.ఇజ్రాయెల్ తో పాటు అనేక గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ప్రతీకారదాడులతో పేలుళ్లతో ఆయా దేశాల్లోని ముఖ్యమైన ప్రాంతాల్లో మంటలు మిన్నంటాయి. అమెరికా ఆస్తులు కలిగివున్న అన్ని అరబ్ దేశాల్లోనూ ఇరాన్ ఆర్మీ క్షిపణుల్తో దాడిచేస్తోంది. బ్రిటిష్ మిలిటరీ స్థావరాలను కూడా వదిలిపెట్ట లేదు.ఇక్కడ విశేషంగా చెప్పుకోదగినవి ఏమిటంటే ఇరాన్ పైవ్యూహాత్మక దాడులకు అమెరికా ఆంత్రోపిక్ కృత్రిమ మేధను వినియోగించుకోవడం. అమెరికా దాడులు జరిపే తేదీని ఏఐ చాట్ 'గ్రోక్' ముందుగానే పసికట్టిన తేదీనే ఈ దాడులు జరగడం.నిత్యం బాంబుల మోతలతో దద్దరిల్లుతున్న ఆయా దేశాలలోభారతీయులతో సహా ఇతర దేశాల వారు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇరాన్లో రాజకీయ అనిశ్చితి తొలగించడం కోసం తాత్కాలిక సుప్రీమ్ లీడర్‌గా ఆలీ రెజా అరాఫీని నియమించుకొన్నారు.ఆయన మతాధికార వ్యవస్థలో అత్యంత సీనియర్. కొత్త పాలక వర్గంతో 'రాజీ' చర్చలకు తాను సిద్ధంగా ఉన్నట్లు ట్రంప్ ప్రకటించారు. అయితే అందుకు ఇరాన్ నేతల ప్రతిస్పందన అవసరం.ఇరాన్‌పై ఈ దాడులు శాంతిస్థాపన కోసమేనని, అవసరమైనంత కాలం ఈ బాంబు దాడులు కొనసాగుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.కాగా తాము తమ సుప్రీమ్ లీడర్ ఖమైనీను చంపినందుకు నిరసనగా ప్రతీకార దాడులు చేపట్టామని ఇరాన్ నేతలు చెబుతున్నారు.ఈ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై వందలాది క్షిపణులను ప్రయోగించింది. బహ్రెయిన్, కతార్ వంటి దేశాల్లోని అమెరికా సైనికస్థావరాలను కూడాఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. ఈపరిణామాలపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసరంగా సమావేశమైంది. దాడులను వెంటనే ఆపి, వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సమితి ప్రధాన కార్యదర్శి దేశాలకు విజ్ఞప్తి చేశారు.రష్యా, చైనాదేశాలు అమెరికా ప్రవాస భారతీయుల భద్రత కోసం భారత్‌లోని అన్ని ప్రభుత్వాలు కేంద్రం ఆయా ప్రాంతాల ప్రభుత్వాలను సమాయత్తపరిచింది. కుట్రపూరిత విధానాలను అవలంబిస్తోందని వ్యాఖ్యానించాయి. యుద్ధం కారణంగా పశ్చిమాసియా దేశాల్లో గగనతలం పూర్తి స్థాయిలోమూసివేసారు.విమాన సర్వీసులన్నీ నిలిచిపోవడంతో భారతీయులతోసహా వేలాదిమందిప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. దాదాపు లక్షల మంది ట్యాన్సిట్ వీసామీద వెళ్లిన వారు విమానాశ్రయాల్లో చిక్కుపోయారు. ప్రస్తుతం 8 అరబ్ దేశాల మీద ఇరాన్ ప్రతీకార దాడులను ముమ్మరం చేసింది. అక్కడే కనీసం కోటిమంది ప్రవాసులు ఉన్నారు. వారి పరిస్థితి ఏమిటో సమాచారంలేక వారి కుటుంబాల వారు ఆందోళనలో ఉన్నారు. కొందరైతే బంకర్‌లలో దాక్కున్నారన్న సమాచారం ఉంది. యుద్ధమేఘాలు తొలగితే తప్ప వారు బయటపడే పరిస్థితి లేదు. ఈ యుద్ధ వాతావరణం నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌లో ఇస్లామిక్ రిపబ్లిక్ శకం ముగిసినం దున తాను అక్కడ అధికార మార్పిడి బాధ్యతలు తీసు కునేందుకు ఇరాన్ మాజీ యువరాజు రెజా పహ్లవీ సిద్ధమోతున్నారు. ఇన్నాళ్ళూ ఇస్లామిక్ నిబంధనల మేరకు జరిగిన మతపరమైన పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిజంగా అక్కడ ప్రజాస్వామ్యం పరిఢవిల్లితే మంచిదే!

నేరస్తులను శిక్షించుటే ప్రధానం కాదు. నేరం చేయడానికి ఏ పరిస్థితులు పురికొల్పుతున్నాయో వాటిని తొలగించడం ముఖ్యం.



ఆల్బర్ట్‌కామూ

ప్రపంచం తాలూకు రహస్యాల్ని అర్థం చేసుకోవాలంటే దీర్ఘకాలం పాటు శిక్షణాభ్యసనం సాగించాలి.



అలివర్ గోల్డ్‌స్మిత్

# ప్రజావాక్కు



### మందుల ధరలు తగ్గించాలి

రోగం మనిషిని శారీరకంగా మాత్రమే కాకుండా ఆర్థికంగా కూడా దెబ్బతీస్తుంది. ఆ బలహీనతనే లాభంగా మార్చుకునే వ్యవస్థలు ఉన్నంతకాలంఆరోగ్యంఅనే భావన మాటలకే పరిమితం అవుతుంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఔషధ వ్యాపారంలో అక్రమ లాభాల వ్యవహారం కొన్ని మందులపై వెయ్యి ఎనిమిదివందల శాతం వరకు లాభం వసూలు చేస్తున్నారన్న వాస్తవం మన ఆరోగ్య వ్యవస్థలోని దోపిడీని బయటపెట్టింది.ఔషధ ధరల నియంత్రణకు చట్టాలు ఉన్నప్పటికీ అవి ప్రజల రక్షణకు సరిపడేలా అమలవడం లేదు. ధరలనియంత్రణ, లాభాల పరిమితి, పంపిణీ పర్యవేక్షణ అన్నీకాగితాలకే పరిమితమయ్యాయి. తయారీదారుడి నుంచి చిల్లర విక్రేత వరకు ప్రతి దశలో లాభాలు పెంచుకుంటూ చివరికి రోగి జేబుపై భారాన్ని మోపుతున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### లిక్కర్ కేస్ ఉదంతం

దేశంలో ప్రబల విపక్షాలుగా ఉన్నవి మూడు పార్టీలు. ఒకటిఆమ్ ఆద్మీపార్టీ రెండు భారత రాష్ట్ర సమితి మూడు ద్రావిడ మున్నేట కజగం.అయితే తమిళనాడును గవర్నర్ వ్యవస్థ ద్వారా అధిమి పట్టాలి అని ఢిల్లీ లో కేజ్రీవాల్‌ను లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కావొచ్చు లేక ఢిల్లీ మద్యం పాలసీ ద్వారాకావొచ్చు. అలాగే చంద్రశేఖర్ రావు బిడ్డను అరెస్ట్ చేయడం ద్వారామానసిక అశాంతిని కలుగజేయాలి అని చూసి చివరికి కోర్ట్ ఇది కక్ష పూరితమైన కేసు అని చెప్పి సిబీఐ స్వాతంత్రతను దెబ్బ తీసేలా వ్యవహారిస్తూ ఉన్నది అని కోర్ట్‌జడ్జి జీతేంద్ర అనేదాకా వెళ్లిందంటే స్వతంత్ర సంస్థలను ప్రభుత్వం ఏవిధంగా వాడుకున్నదో అర్థం అవుతున్నది.

-భారత అవినాష్, జనగామా

### ఆయుర్వేద వైద్యంపై దృష్టి

మనదేశంలో 95శాతం వ్యక్తులు అల్లోపతి వైద్యంపైనే ఆధారపడ్డారు. ఈ వైద్య విస్తృత పరిశోధన పరిస్థితులకు కారణంగా మారింది.ఇటీవల జాతీయ స్థాయిలో సంప్రదాయ వైద్యం కూడా అందుబాటులోకి వచ్చి ప్రత్యామ్నాయ ఎంపికకు వైద్యశాలలు,మందులు వగైరాఏర్పాటు నిమిత్తం దృష్టిసారించారు. మన ప్రాచీన ఆయుర్వేద వైద్యం తక్కువ ఖర్చుతో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

- బి. రమేష్‌బాబు, నల్గొండ

### భవిష్యత్తుకు ప్రమాదం

భారత ఐటీ రంగం ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నా, వీసాలపై అధిక ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రపంచవలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈపరిస్థితుల్లో,స్థిరమైన వ్యూహాలను అవలంబించడం అనివార్యం. భారతీయ యువత, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులు, తమ ప్రతిభను ప్రదర్శించి స్థానిక స్థాయిలో స్టార్ట్ అప్స్ ను స్థాపిస్తే, దేశీయ ఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు, గ్లోబల్ టెక్ రంగంలో మనస్థానం మరింత బలపడుతుంది. ఇది నిజమైన డిజిటల్ స్వావలంబనకు దారి తీస్తుంది. భారతదేశంలో శాస్త్రం, సాంకేతికం, ఇంజినీరింగ్, గణితశాస్త్రం రంగాలలో విస్తారమైన ప్రతిభ ఉంది. ఈ ప్రతిభను సరైన మార్గంలో వినియోగిస్తే, మన దేశం సేవల కేంద్రం నుండి ఆవిష్కరణల కేంద్రంగా మారగలదు.

- ఎన్. నారాయణ, నల్గొండ

### సమ్మర్ క్యాంపుల నిర్వహణ చేపట్టాలి

గురుకుల సంస్థ గత సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయినా విద్యార్థులకు జిల్లా కేంద్రాలలో స్పెషల్ క్యాంపులు నిర్వహించడం జరిగింది. ఈ సంవత్సరం కూడా నిర్వహించడం అవసరం. గత సంవత్సరం పని చేసిన లెక్చరర్‌లకు ఈ సంవత్సరం కూడా అవకాశం ఇవ్వాలి. ఈ సారి క్యాంపుకు లెక్చరర్‌ల గత వివరాలు సెకరించాలి. ఆ లిస్ట్‌లో పేర్లు ఉన్న వారిని రెన్యువల్ చేయాలి. అన్ని సబ్జెక్ట్స్ వారికీ అవకాశం ఇవ్వాలి.రెగ్యులర్ వికలాంగుల లెక్చరర్‌లకు అదనంగా ఈఎల్ ఎర్నడ్ లీవ్స్ ఇవ్వాలి. అమౌంట్ కూడా ఈ సారి పెంచాలి. ఈ సారి ఒక్కొక క్యాంపులో ఒక్కొక్క సబ్జెక్టు క్యాంపు పెట్టాలి. సమ్మర్ స్పెషల్ క్యాంపు కోసం ప్రణాళిక రూపొందాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం చాలా గొప్పపరిణామం. గతంలో ఉన్న ప్రభుత్వం ఓట్ బ్యాంకు రాజకీయం కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది.వారికి ఓట్లు పడలేదు. వారి కంటే ఒక అడుగు ముందుకు వేసి వారి కంటే ఎక్కువే ప్రజాధనాన్ని ఉచిత పథకాలకు ఈనాటి ప్రభుత్వం అందిస్తూ ఉన్నది. ఏపీఎస్ఆర్టీసీల్లో మహిళలకుఉచిత ప్రయాణంతోపాటు మార్చిఫస్ట్‌నుండి దివ్యాంగులకు కూడా రాయితీలతో ఉచిత ప్రయాణ సౌకర్యంకల్పించినది

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సుస్థిర ఆర్థిక వృద్ధితో సత్వర ప్రగతి

**యువతకు సమానమైన వేతనం, గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడానికి ఆర్థిక వ్యవస్థ సంస్కరణలు అవసరం. సుస్థిర, సమ్మిళిత ఆర్థిక వృద్ధి పురోగతి సాధిస్తేనే అందరికీ మంచి ఉద్యోగాలు, జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అత్యున్నత నాణ్యతతో విద్య, శిక్షణకు పెట్టుబడి పెట్టాలి. కార్మిక మార్కెట్ డిమాండ్లకు సరిపోయే నైపుణ్యాలను యువతకు అందించాలి, ఒప్పంద విధానంతో సంబంధం లేకుండా సామాజిక రక్షణ, ప్రాథమిక సేవలను పొందడం, అలాగే ఆశావహులైన యువతఅందరూ వారి ఆదాయ స్థాయి,సామాజిక ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా ఉత్పాదక ఉపాధిని పొందగలిగేలా పరిస్థితులను కల్పించాలి.**



డా. సునీల్ కుమార్ పోతన

దేశం అభివృద్ధి సాధించాలంటే అందరూ పురోగతిలో భాగస్వామ్యం కావాలి. ప్రతి ఒక్కరికీ ఉత్పాదకత కలిగిన, న్యాయమైన ఆదాయాన్ని అందించే పనిని పొందే అవకాశాలు, ఉద్యోగ భద్రత, కుటుంబాలకు సామాజిక రక్షణ, వ్యక్తిగత అభివృద్ధి, సామాజిక సమైక్యతకు మెరుగైన అవకాశాలు అందించడాన్ని గౌరవమైన వృత్తి,సుస్థిర ఆర్థిక వృద్ధిగా పేర్కొనవచ్చు. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి 2030 లక్ష్యాలలో 8వ లక్ష్యం గౌరవమైన వృత్తి, ఆర్థిక వృద్ధి. ఈ లక్ష్యాన్ని సాధించడానికి అప్పులు, ఆర్థిక అనిశ్చితి, వాణిజ్య ఉద్రిక్తతలు సవాళ్లుగా మారుతున్నాయి. నాణ్యమైన ఉద్యోగాల సృష్టి దాదాపు అన్ని ఆర్థిక వ్యవస్థలకు ప్రధాన సవాలుగా మిగిలిపోయింది. వేగంగా విస్తరిస్తున్న ఆర్థిక వ్యవస్థ, అధిక జనాభాతో సుస్థిరఅభివృద్ధి లక్ష్యం8ని సాధించే దిశగా భారతదేశం గణనీయమైన పురోగతిని సాధించింది. సానుకూల వృద్ధి పథం ఉన్నప్పటికీ సుస్థిర ఆర్థిక వృద్ధిని సాధించడంలో భారతదేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటుంది. వివిధ రంగాలలో పురోగతి సాధించినప్పటికీ ముఖ్యంగా ఉపాధి కల్పన, ఉద్యోగభద్రత, ఆదాయ అసమానత, ఉద్యోగ నాణ్యత పరంగా గణనీయమైన సవాళ్లు కొనసాగుతున్నాయి. భారతదేశంలో యువ జనాభా పెరుగుతూనే ఉంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ప్రకారం భారతదేశంలో శ్రామిక వయస్సు జనాభా 2025 నాటికి వంద కోట్లకు చేరుకుందని అంచనా. ఇది ఉపాధిని కీలక ప్రాధాన్యతగా చేస్తుంది. 2025 నాటికి భారతదేశ శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 51శాతం వద్ద ఉంది. ఇది మునుపటి సంవత్సరాలతో పోలిస్తే మితమైన పెరుగుదలను ప్రతిబింబిస్తోంది. ఇది చాలా తక్కువ. ప్రపంచ సగటులతో పోలిస్తే, ముఖ్యంగా మహిళలకు, మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 30శాతం కంటే తక్కువగా ఉంది. వివిధ నైపుణ్య అభివృద్ధి, ఉద్యోగ సృష్టి కార్యక్రమాల ద్వారా నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి, యజమానులను ప్రోత్సహించే లక్ష్యంతో 'ప్రధాన మంత్రి రోజ్గర్ ప్రోత్సాహన్ యోజన' (పిఎంఎంఆర్‌ఫివై)ను ప్రభుత్వం చేపట్టింది. ఉద్యోగాల నాణ్యత ఒక ముఖ్యమైన ఆందోళనగా మిగిలిపోయింది. సామాజికభద్రత, ఉద్యోగ ప్రయోజనాలు, గౌరవ పని పరిస్థితులు లేని అనధికారిక రంగంలో భారతదేశ శ్రామిక శక్తిలో ఎక్కువ భాగం పనిచేస్తున్నారు. 2025 నాటికి 80 శాతం కంటే ఎక్కువ మంది శ్రామిక శక్తి అనధికారిక, ప్రమాదకర ఉద్యోగాలలో పనిచేస్తున్నారని అంచనా. పరిశ్రమలలో కొనసాగుతున్న డిజిటలైజేషన్‌తో ఈ పరిస్థితి మరింత తీవ్రమైంది. ఇది సాంప్రదాయ కార్మికులను స్థానభ్రంశం చేస్తోంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ గత కొన్నిదశాబ్దాలుగా సంస్కరణలు,సాంకేతిక పురోగతులు, విస్తరిస్తున్న సేవల రంగం ద్వారాఅద్భుతమైన వృద్ధిని సాధిస్తోంది. దేశ స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వృద్ధి రేటు, హెచ్చుతగ్గులకు లోనవుతున్నప్పటికీ, ఆర్థికపురోగతికి కీలక సూచికగా ఉంది. 2025లో, భారతదేశ జిడిపి వృద్ధి రేటు 6.5శాతం వద్ద ఉంది. ఇది గత సంవత్సరాల కంటే కొంచెంతక్కువగా ఉన్నప్పటికీ ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యధికంగా ఉంది. భారతదేశ స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు 55 శాతం వాటాతో సేవల రంగం ఇప్పటికీ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ వృద్ధికి ప్రాథమిక చోదకాలుగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి), ఆర్థికం, ఆరోగ్య సంరక్షణ నిలుస్తున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి ఉంది. ఈ రంగం దాదాపు 40శాతం మంది శ్రామికశక్తిని కలిగి ఉంది. కానీ, జిడిపికి 17శాతం మాత్రమే దోహదం చేస్తోందని ఆర్థిక సర్వేలు, నివేదికలు తెలియజేస్తున్నాయి.



ఈ అసమానత మరింత సమతుల్య, వైవిధ్యభరితమైన ఆర్థిక వ్యవస్థ అవసరాన్ని సూచిస్తోంది. సాంప్రదాయకంగా ఉద్యోగ సృష్టి, పారిశ్రామిక వృద్ధికి అవరోధంగా భావించే సంక్లిష్ట కార్మిక చట్టాలను సరళీకృతం చేసే లక్ష్యంతో అనేక కార్మిక సంస్కరణలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వేతనాలు, సామాజిక భద్రత, వృత్తి భద్రత, పారిశ్రామిక సంబంధాలను మెరుగుపరిచేందుకు నాలుగు విస్తృత వర్గాలుగా కేంద్ర కార్మిక చట్టాలను ఏకీకృతం చేసింది.ఈ సంస్కరణలు ఉన్నప్పటికీ, కార్మిక చట్టాల అమలు, కార్మికుల రక్షణపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం, అనధికారిక రంగంలోని కార్మికులలో కేవలం 10శాతం మంది మాత్రమే సామాజిక భద్రతా పథకాల పరిధిలోకి వస్తున్నారు. వ్యవసాయం, నిర్మాణం, ఇంటి పని వంటి రంగాలలోని కార్మికులు దోపిడీ,అసురక్షిత పని పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఈ సవాళ్లను పరిష్కరించడానికి, ప్రభుత్వం ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్, ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) వంటి సామాజిక భద్రతా పథకాలను విస్తరించింది. అసంఘటిత రంగంలోని కార్మికులకు పెన్షన్ ప్రయోజనాలను అందించే ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్ ధన్ యోజన వంటి కార్యక్రమాల ద్వారా అనధికారిక కార్మికులను చేర్చడానికి సామాజిక రక్షణ వలయాన్ని విస్తరించడానికి ప్రభుత్వం కృషిచేస్తోంది. సమ్మిళిత ఆర్థికవృద్ధి అనేది సుస్థిర అభివృద్ధి ముఖ్య లక్ష్యం. ప్రాంతాలు, రంగాలు, సమాజాలలో సమానంగా ఉండాలని నిర్ధారిస్తోంది. భారతదేశంలో ఆదాయం, మౌలిక సదుపాయాలు, విద్యలో ప్రాంతీయ అసమానతలు చాలా కాలంగా సమ్మిళిత వృద్ధికి సవాలుగా ఉన్నాయి. మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్ వంటి రాష్ట్రాలు వేగవంతమైన ఆర్థిక అభివృద్ధిని సాధించగా, బీహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశావంటి ప్రాంతాలు ఆదాయ స్థాయిలు, అక్షరాస్యత రేట్లు, ఉపాధి అవకాశాల పరంగా వెనుకబడి ఉన్నాయి. ఈ అసమానతలను పరిష్కరించడానికి 'భారతమాల పరియోజన', 'సాగర్మాల ప్రాజెక్ట్' మారుమూల ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కనెక్టివిటీని మెరుగుపరచడానికి రూపొందించారు.'ఆత్మనిర్భర్ భారత్' చొరవ స్థానిక తయారీని పెంచడం, చారిత్రాత్మకంగా పారిశ్రామిక అభివృద్ధి లేని ప్రాంతాలలో ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. అదనంగా, వికేంద్రీకరణ వైపు భారతదేశ పురోగతి 'స్టార్టప్ ఇండియా' చొరవ వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ వ్యవస్థాపకత వృద్ధికి దారితీస్తోంది.ఇది వేలాది స్టార్టప్లకు, ముఖ్యంగా ద్వితీయ,తృతీయ శ్రేణి నగరాల్లో నిధులు, మార్గదర్శకత్వాన్ని అందిస్తోంది. అయినప్పటికీ అణగారిన వర్గాలను ఆర్థిక ప్రధాన స్రవంతిలోకి పూర్తిగా విలీనం చేయడం సవాలుగానే మిగిలి ఉంది. కొంత పురోగతి సాధించినప్పటికీ, సమ్మిళిత వృద్ధికి విద్య, ఆరోగ్య సంరక్షణ, వెనుకబడిన వర్గాలకు మూలధనానికి మెరుగైన ప్రాప్యతతో సహా మరింత లక్ష్య జోక్యాలు అవసరం. ఆర్థిక వృద్ధి సవాళ్లని పరిష్కరించడానికి తయారీ రంగాన్ని విస్తృతించడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా 'మేక్ ఇన్ ఇండియా' ప్రచారం వంటి కార్యక్రమాల ద్వారా పారిశ్రామికీకరణ, ఆవిష్కరణలను ప్రోత్సహించడంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మరింత దృష్టి సారించాలి. రహదారులు, ఓడరేవులు, విద్యుత్‌తోసహా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించి ఉద్యోగాలను సృష్టించాలి. ఉత్పాదకతను పెంచాలి. విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలి. వీటిలో ప్రాంతీయ అసమానతలను పరిష్కరించడం, సమాన వృద్ధిని నిర్ధారించడం, పర్యావరణ ప్రభావాలను తగ్గించడం వంటివి ఉన్నాయి. స్వచ్ఛమైన ఇంధన పెట్టుబడులు, సుస్థిర వ్యవసాయం, పర్యావరణ అనుకూల పారిశ్రామిక విధానాల ద్వారా పర్యావరణహిత వృద్ధిని ప్రోత్సహించడంపై ప్రభుత్వాలు ఎక్కువగా దృష్టి సారించాలి. యువతకు సమానమైన వేతనం, గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడానికి ఆర్థిక వ్యవస్థ సంస్కరణలు అవసరం. సుస్థిర, సమ్మిళిత ఆర్థిక వృద్ధి పురోగతి సాధిస్తేనే అందరికీ మంచి ఉద్యోగాలు, జీవన ప్రమాణాలు మెరుగవుతాయి.అత్యున్నత నాణ్యతతో విద్య, శిక్షణకు పెట్టుబడి పెట్టాలి. కార్మిక మార్కెట్ డిమాండ్లకు సరిపోయే నైపుణ్యాలను యువతకు అందించాలి, ఒప్పంద విధానంతో సంబంధం లేకుండా సామాజిక రక్షణ, ప్రాథమిక సేవలను పొందడం, అలాగే ఆశావహులైన యువతందరూ వారి ఆదాయ స్థాయి,సామాజిక ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా ఉత్పాదక ఉపాధిని పొందగలిగేలా పరిస్థితులను కల్పించాలి. సుస్థిర, వినూత్నమైన, ప్రజలపై కేంద్రీకృత ఆర్థికవ్యవస్థలను నిర్మించడానికి, ముఖ్యంగా యువత ఉపాధి, మహిళల ఆర్థిక సాధికారతను ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. ఆరోగ్య, భద్రతా చర్యలను అమలు చేయాలి. ●

# సాంకేతికత జోడిస్తేనే రైతుకు మేలు..

ఈ. శ్రీనివాస్ రావు

తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం గత దశాబ్దంలో గణనీయంగా పెరిగింది. 2014-15లో సుమారు 22.7 లక్షల ఎకరాలుగా ఉన్న వరి సాగు, 2023-24 నాటికి దాదాపు 66 లక్షల ఎకరాలకు చేరింది. ఇది ఆహార భద్రత దృష్ట్యా ఒక విజయగాథలా కనిపించినప్పటికీ, దీని వెనుక ఒక తీవ్రమైన పర్యావరణ, ఆర్థిక సంక్షోభం దాగి ఉంది. నిరంతర ఏకపంట సాగు, అధిక రసాయన ఎరువుల వినియోగం, అధిక నీటిపారుదల కారణంగా నేల సేంద్రీయ కార్బన్ తగ్గుదల,సూక్ష్మజీవుల వైవిధ్య క్షీణత, నేలఆమ్లత్వం పెరుగుదల వంటి సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. తెలంగాణ జనాభాలో సుమారు 61 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తూ వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారు. అయితే పెరుగుతున్న సాగు ఖర్చులు, రసాయనాలపై అధిక ఆధారపడటం, దిగుబడుల్లో స్థిరత్వం లేకపోవడం రైతులను అప్పుల బారిన పడేలా చేస్తోంది. భూగర్భ జలాలపై అధిక ఒత్తిడి వల్ల వరిసాగు మరింత వాతావరణ మార్పులకు లోనవుతోంది. ఈ పరిస్థితుల్లో వ్యవసాయం లాభదాయక వృత్తిగా కనిపించక యువత దూరమవుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం (టీడీఎఫ్) ఖరీఫ్ 2025లో అమలు చేసిన పునరుత్పాదక వరి సాగు పైలట్ ప్రాజెక్ట్ ఒక మార్గదర్శక ప్రయోగంగా నిలిచింది. సిద్ధిపేట జిల్లా పెద్ద మాసంపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామాలు రాజన్న-సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ ప్రాంతాల్లో 10 మంది రైతులతో 10ఎకరాల్లో అమలు చేసిన ఈప్రాజెక్ట్, నేల పునరుద్ధరణ-ఖర్చు తగ్గింపు-నీటి సంరక్షణ అనే మూడు ముఖ్య లక్ష్యాలపై దృష్టి పెట్టింది. 19 రకాల పచ్చ,ఎరువు, పంటలతో రూపొందించిన బహుళ పంట వ్యవస్థ ఈ మోడల్‌లో కీలక భాగం. ధాన్యాలు, పప్పులు, చిరుధాన్యాలు, నూనె గింజలు, ఆకుకూరలు, ధైన్చా, సన్‌హెంప్ వంటి పంటలను 45-60 రోజులు పెంచి పుష్ప దశలో నేలలో కలపడం ద్వారా ఎకరాకు సుమారు 2.3 టన్నుల బయోమాస్ ఉత్పత్తి అవుతుంది. దీనివల్ల నేలలో రంధ్రాల నిర్మాణం మెరుగుపడి తేమ నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. ముఖ్యంగా రైజోస్ఫియర్ ప్రాంతంలో సూక్ష్మజీవుల పెరుగుదల 2-3 రెట్లు పెరిగినట్టు ప్రయోగశాల పరీక్షలు వెల్లడించాయి.రసాయన ఎరువులు, పురుగుమందులను పూర్తిగా మానేసి, స్థానికంగా తయారు చేసిన జీవ ద్రావణాలతో సాగు చేయడం వల్ల సాగు ఖర్చుగణనీయంగా తగ్గుతుంది.ఎకరాకు రూ.4,000- రూ.8,000 వరకు మొత్తం ఖర్చు తగ్గగా, రైతుల నికర ఆదాయం రూ.6,000- రూ.12,000 వరకు పెరిగినట్టు నమోదు అయింది. నీటిపారుదల చక్రాలు 28-30 సార్ల నుంచి 22సార్లకుతగ్గి 20-25శాతం నీటిఆదా సాధ్యమైంది. ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత డిజిటల్ సాంకేతికతల వినియోగంలో ఉంది. ఉపగ్రహ ఆధారిత పంట ఆరోగ్య పర్యవేక్షణ, 3.3 మీటర్ల స్థాయిలో ఫీల్డ్ విశ్లేషణ,ఏఐ ఆధారిత వ్యాధి ముందస్తు హెచ్చరికలు రైతులకు అందించబడ్డాయి. దీనివల్ల7-10 రోజుల ముందే పంటఒత్తిడి, వ్యాధులను గుర్తించి నివారణ చర్యలు తీసుకునే అవకాశం లభించింది. ఖచ్చిత నీటి పారుదల సలహాల వల్ల నీటివినియోగం మరింత సమర్థవంతమైంది. ఈ పైలట్ ఫలితాలు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి.నేలఆరోగ్యం పునరుద్ధరణ లేకుండా వ్యవసాయ సుస్థిరత సాధ్యంకాదు. పునరుత్పాదక వ్యవసాయం కేవలం రసాయనరహిత సాగు మాత్రమేకాదు,అది నేల జీవ వైవిధ్యాన్నిపెంచే, నీటి వినియోగాన్ని తగ్గించే,రైతు ఆదాయాన్ని స్థిరపరచే సమగ్రవిధానం. తెలంగాణలో వరి ఉత్పత్తి పెరుగుదలతో పాటు పర్యావరణ సమతౌల్యం కాపాడాలంటే ఈతరహా మోడళ్లను క్లస్టర్ స్థాయిలో విస్తరించడంఅవసరం. సిఎస్ఆర్ భాగస్వామ్యాలు,ప్రభుత్వమద్దతు,వ్యవ సాయశాఖ సాంకేతిక సహకారం ఉంటే ఈ మోడల్ రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యే అవకాశంఉంది.అధిక ఉత్పత్తి లక్ష్యాల నుంచి సుస్థిర ఉత్పత్తి లక్ష్యాలవైపు అడుగులు వేయాల్సినసమయం వచ్చింది.నేలను కాపాడితేనే రైతు బతుకుతాడు, రైతుబతికితేనే గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలపడుతుంది. తెలంగాణ వరి సాగుభవిష్యత్తు పునరుత్పాదక మార్గంలోనే సురక్షితం. ●

# వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం, ప్రతి సంవత్సరం మార్చి 3న నిర్వహించ బడుతోంది. అంతరించిపోతున్న అడవి జాతుల సంరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ దినోత్సవం జరుపుకుంటారు. 2013, మార్చి 3 నుండి 14 వరకు బ్యాంకాక్‌లో జరిగిన జనరల్ అసెంబ్లీ16వ సమావేశంలో ప్రపంచ అడవి జంతుజాలం, వృక్షజాలం గురించి వేడుకలు జరుపుకునేందుకు, అవగాహన పెంచడానికి మార్చి 3ను ప్రపంచ వన్యప్రాణి దినోత్సవంగా పేర్కొనడం జరిగింది. అదే సంవత్సరం డిసెంబరు 20న జరిగిన ఐక్యరాజ్య సమితి జనరల్‌అసెంబ్లీ దాని 68వ సెషన్ తీర్మానంలో, మార్చి 3న ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని ప్రకటించింది. వన్యప్రాణులఅంతర్గత విలువను, పర్యావరణ, జన్యు, సామాజిక, ఆర్థిక,శాస్త్రీయ, విద్యా, సాంస్కృతిక, వినోద అభివృద్ధికి, మానవ శ్రేయస్సు కోసం వివిధ కార్యక్రమాలు చేయాలని తీర్మానించింది. వాస్తవానికి మనిషికంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ చెబుతోంది. అయితే భూమి ఆవిర్భవించిన తరవాత పుట్టిన చాలా జంతు జాతులు ఇప్పుడు లేవు. ఈ ఆధునిక యుగంలోనూ మనకు తెలిసిన ఎన్నో జంతుజాతులు కనుమరుగైపోతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకమవుతున్న నేపథ్యంలో వాటి సంరక్షణ ప్రాధాన్యతను గుర్తుచేస్తూ ప్రతీఏటా అన్ని దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపుతున్నాయి.వన్య ప్రాణుల సంరక్షణ కోసం మన ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయితే స్మగ్లర్లు, వేటగాళ్లు, వన్యప్రాణులు, అరణ్యాల పాలిట శాపంలా తయారయ్యారు. వీళ్ల దెబ్బకు కీకరారణ్యాలు సైతం మైదానాలుగా మారుతున్న పరిస్థితి. పరిశ్రమల స్థాపన పేరిట పెద్ద ఎత్తున అటవీ భూముల్లో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటం కూడా వన్యప్రాణుల మనుగడకు ముప్పుగా మారింది. దీంతో గూడు చెదిరిన వన్యప్రాణుల జనారణ్యంలోకి వస్తున్న పరిస్థితి. దేశంలోని జంతు సంపదను పరిరక్షించడానికి మొట్టమొదటిసారిగా 1898లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మొదటి పక్షుల అభయారణ్యాన్ని తమిళనాడులోని వేదాంతం గల్‌లో ఏర్పాటు చేసింది.ఆ తర్వాత 1935లో మొదటి వన్యప్రాణి జాతీయ పార్కు 'హేలీ'ని ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేశారు. ఇదే పార్కును ఇప్పుడు జిమ్ కార్బెట్ పార్కు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మొత్తం జాతీయ పార్కుల



సంఖ్య 102. 1976లో జరిగిన రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 51(ఎ) ప్రకారం వన్యప్రాణి సంరక్షణ పౌరుల ప్రాథమిక విధి. ఆదేశిక సూత్రాల్లో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా వన్యప్రాణులను సంరక్షించాలని పేర్కొన్నారు. భారత దేశంలో వన్యప్రాణి సంరక్షణ కోసం 1972లోచట్టం ఆనాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం వన్య ప్రాణుల వేట నిషేధం. ఈచట్టం అమలులోకివచ్చాక దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 23 టైగర్ ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలో 441వన్య ప్రాణి సంరక్షణ కేంద్రాలుండగా వీటిల్లో 28 టైగర్ జోన్స్ ఉన్నాయి. అంతర్జాతీయంగా పులి చర్మానికి, గోళ్లకు, ఎముకలకు విపరీతమైన డిమాండ్ ఉండటంతోవేటగాళ్ల చేతిలోచిరుతలు బలైపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశవ్యాప్తంగా ఉన్న అడవుల్లో దాదాపు నలభై వేలకు పైగా ఉన్న పులులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ 1972 నాటికే ఆ సంఖ్య మూడు వేలకు పడిపోయిందంటే అప్పటి ప్రభుత్వాలు ఎంతటి నిర్లక్ష్య వైఖరి అవలంభించాయో స్పష్టంగా అర్థమవుతోంది. సాధారణంగా పులుల జనాభాను లెక్కించేందుకు ఇంతకు ముందు పాదముద్రలను గుర్తించడం ఒక్కటే మార్గం. అవి సంచరించే ప్రాంతాల్లో రహస్య కెమెరాలను ఏర్పాటు చేసి, వాటి పాదముద్రలను సేకరించేవారు.అయితే ఇది చాలా కష్టంతో కూడు కున్నపని. కచ్చితమైన లెక్కకు ఆస్కారం కూడా తక్కువే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలార్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) పులుల మలం ద్వారా వాటిని లెక్కించే పద్ధతిని ఆవిష్కరించింది. 20వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు లక్ష పైచిలుకు పులులుండేవి అని అంచనా.2014 లెక్కల ప్రకారం ప్రపంచంలో 3891 పులులు ఉండగా వాటిలో 2226 మన దేశంలోనే ఉన్నాయి. భారత్‌లో 2011లెక్కల ప్రకారం 1706, 2014 ప్రకారం 2226 ఉండగా 2018 పులుల గణన ప్రకారం మన దేశంలో 2967 పులులున్నాయి. ప్రపంచంలో ఉన్న మొత్తం పులుల్లో 70శాతం పైగా మనదేశంలోనే ఉన్నాయి. గడిచిన కొన్నేళ్లలో ఒక్క మధ్యప్రదేశ్‌లోనే 19పులులు మృత్యువాత పడ్డాయి.మహారాష్ట్రలో 9, ఉత్తరాఖండ్‌లో 9 మృత్యువాత పడ్డాయి. 2016లో దేశవ్యాప్తంగా74 పులులు మరణించినట్టు లెక్కలు చెబుతున్నాయి. 2006లో పులులను స్మగ్లర్ల బారి నుండి కాపాడటానికి టైగర్ టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు.విచక్షణారహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను,మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం. అందుకే అడవి జంతువులు గ్రామాలలోకి, పట్టణాల్లోకి వస్తున్నాయి. ఆహారం కోసం మనుషులపై దాడులు చేస్తున్నాయి.ఇలాంటి పరిస్థితినిమార్చడంకూడా ఈజంతు దినోత్సవం లక్ష్యాల్లోఒకటి.జంతువులకు సహజసిద్ధమైన ఆవాసాలను కల్పించడం, జంతుజాతులను రక్షించడం,వాటి సంక్షేమాన్నికాపాడటం ఇవేప్రధానం. ●

# 'దక్షిణ ప్రపంచవాణి'గా భారత్

- వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తితో ముందుకు
- అగ్రరాజ్యాల ఆధిపత్య పోటీ మధ్య భారత్ సరికొత్త దౌత్య విధానం



న్యూఢిల్లీ, మార్చి 2: ఆధునిక ప్రపంచంలో నేడు నెలకొన్న భిన్నధృవాలు, భిన్న ధృక్కోణాల మధ్య అగ్రరాజ్యాల పరస్పర ఆధిపత్య పోటీమధ్య భారత్ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తితో ముందుకు సాగింది. అటు అమెరికా, చైనా, రష్యాలు ఒకదానిపై ఒకటి పైపైకి ఎదగాలని చురుకుగా ముందుకుపోతున్నాయి. మరోపక్క ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా మొత్తం అట్టుడికిపోతోంది. ఈక్రమంలో దేశాలు ఎటువైపు వెళ్లాలనేది నిర్ణయించుకునే స్థాయికి పరిస్థితులు చేరుకున్నాయి. ఈ క్రమంలో భారత్ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తివైపే నడిచింది. అంతర్యుద్ధం శకం నుంచి అలీన వ్యవస్థల వరకూ ఒక క్రమపద్ధతితో కూడిన సానుకూల విధివిధానాలతో అన్నిరంగాలతో సమన్వయం చేసుకునే దిశగా భారత్ ముందుకు నడిచింది. ఇందుకోసం భిన్న వైఖరులున్న భాగస్వాములకు కూడా చేరువ అవుతూ జాతీయ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కూటముల్లోనే చిక్కుకోకుండా భారత్ అత్యంత అప్రత్తంగా వ్యవహరిస్తోంది. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి అంటే భారత్ తన నిర్ణయాలను స్వతంత్రంగా తీసుకునే సత్తాతో ఉంటుంది. కీలక రంగాలైన భద్రత, ఆర్థిక వ్యవస్థ, టెక్నాలజీ, సార్వభౌమత్వంపై మరొకరి జోక్యాన్ని ఎంతమాత్రం సహించే పరిస్థితి ఉండదు. ఉదాహరణకు అమెరికాతో రక్షణరంగం, టెక్నాలజీసంబంధాలు పెంచుకుంది. క్వాడ్ వంటి వాటితో ఐదు దేశాలకు చేరువ అయింది. ఇంధనరంగం, ఆయుధ భాగస్వామ్యాలు రష్యాతోకూడా చేసుకుంది. అదే సమయంలో ఆర్థిక సహకారం చైనా నుంచి రాబట్టుకుంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ చైనాతో ఆర్థిక భాగస్వామ్యం తప్పనిసరి చేసింది. దీన్నిబట్టిచూస్తే పశ్చిమాసియాలో భారత్ సమన్వయంతోకూడిన దౌత్యవిధానం అనుసరించిందనే చెప్పాలి. ఇజ్రాయెల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యంతో ఆశించిన ప్రయోజనాలు దక్కాయి. బారక్-8 వంటి వ్యవస్థలు, వ్యవసాయరంగంలో బిందుసేద్యం వయా 33ప్లస్ ఎక్సెలెన్స్ కేంద్రాలు ఏర్పాటుచేసి రైతు దిగుబడులు పెంచడంవంటి వాటితోపాటు జలవనరుల సంరక్షణ, ఉప్పునీటిని మంచినీరుగా మార్చడం, రీసైక్లింగ్ వంటివి చేపట్టింది. అలాగే కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ సంయుక్తంగా ఆర్అండ్‌డి నిధులు వెచ్చించాలనినిర్ణయించింది. ద్వైపాక్షిక వాణిజ్యం 3.75 బిలియన్ డాలర్లుగా ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీయే) చర్చలు కొలిక్కివస్తే మరింతగా పెరుగుతుంది. హైటెక్, ఎంఎస్ఎంఇలకు మరింత వృద్ధికారక ప్రయోజనాలుంటాయని చెప్పుకోవచ్చు. పశ్చిమాసియాతో దౌత్యబంధం కొనసాగింపులోనే గల్ఫ్‌దేశాలతోకూడా అత్యంత సన్నిహిత మైత్రీ బంధం కొనసాగించిన భారత్ యుఎఇ, సౌదీ అరేబియాలతో ఇంధనం, మౌలికవనరులు, కనెక్టివిటీలపై ఒప్పందాలకు దిగింది. అలాగే పాలస్తీనా సమస్యకు రెండుదేశాల పరిష్కారం అజెండాను కూడా తెచ్చింది. అంతేకాకుండా ప్రస్తుతం యుద్ధమోడుతున్న ఇరాన్‌తో కూడా నిర్మాణాత్మక బంధం కొనసాగించింది. ప్రధానిమోడీ ఇజ్రాయెల్ రెండోసారి పర్యటన ద్వైపాక్షిక బంధాన్ని మరింత పటిష్టం చేసింది. అరబ్ భాగస్వామ్యదేశాలను దూరంచేసుకోకుండానే మానవతాధృక్పథాన్ని కూడా కొనసాగించింది. ఈ బంధాలతోనే ఇపుడు ప్రపంచదేశాలకు భారత్ 'దక్షిణప్రపంచ వాణి'గా మారిందనడంలో సందేహంలేదు. విభిన్న ధృక్కోణాల ప్రస్తుత శకంలో వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి భారత్‌కు అమితంగా కలిసొచ్చే ఆయుధంగా చెప్పుకోవచ్చు. భద్రత, ఆహారం, జలవనరుల సంరక్షణ, సృజనాత్మకతలతో ఉద్యోగాల కల్పన, బహుపాక్షిక వైఖరితో వివిధదేశాల మధ్య కొనసాగుతున్న వివాదాలపై ఆచితూచి వ్యవహరించడం, సంయమనం వంటి వాటితో భారత్ ప్రపంచదేశాల్లో ప్రముఖంగా కొనసాగేస్థాయికి చేరింది. ప్రపంచదేశాలమధ్య విధివిధా నాలలోపాలు మరింతగా పెరుగుతున్న తరుణంలో భారత్ తరహా స్వతంత్ర, దేశశ్రేయస్సు ఆధారిత దౌత్య విధానం అన్నివిధాలా శ్రేయోదాయకం. దీనివల్లనే భిన్నధృవాల ప్రపంచంలో అన్నిరంగాల్లో అభివృద్ధి, శాంతి సుస్థిరత, అందరికీ ప్రయోజనం వంటి వాటికి భారత్ ప్రాధాన్యత నిస్తున్నదని ప్రస్తుతం కొనసాగిస్తున్నదౌత్యవిధానమే తేటతెల్లం చేస్తోంది.

# దౌత్య చర్చల ద్వారానే పరిష్కారం

- ఉగ్రవాదం, తీవ్రవాదం... ప్రపంచ దేశాలకు సవాళ్లు
- కెనడా ప్రధానితో సంయుక్త సమావేశంలో మోడీ వ్యాఖ్య
- రెండు ప్రజాస్వామ్య దేశాలు కలిసిన పనిచేయాలని పిలుపు
- అంతర్జాతీయ సౌరశక్తి కూటమిలో చేరాలని కెనడా నిర్ణయం



న్యూఢిల్లీ, మార్చి 2: పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. దౌత్యం, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్నదే ఇండియా నిశ్చితాభిప్రాయమని అన్నారు. భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని పేర్కొన్నారు. భారత్‌లో పర్యటిస్తున్న కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నేతో కలిసి మీడియా సంయుక్త సమావేశంలో ప్రధాని మాట్లాడారు. "పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం ఆందోళన కలిగిస్తోంది. గల్ఫ్‌లో చిక్కుకున్న భారతీయుల కోసం దేశాలతో సంప్రదింపులు చేస్తున్నాం. మేం ఎల్లప్పుడూ శాంతి, స్థిరత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చాం. రెండు ప్రజాస్వామ్య దేశాలు కలిసి నిలబడినప్పుడు, శాంతి కోసం గొంతుక మరింత బలపడుతుంది. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి మాకు తీవ్ర ఆందోళన కలిగించే విషయం. చర్చలు, దౌత్యం ద్వారా అన్ని వివాదాల పరిష్కారానికి భారత్ మద్దతు ఇస్తుంది. పశ్చిమాసియాలోని భారతీయ పౌరుల భద్రత కోసం మేం అన్ని దేశాలతో కలిసి పనిచేస్తూనే ఉంటాం. భారత్, కెనడా దేశాలు ఉగ్రవాదం, తీవ్రవాదంపై ఒకే రకమైన భావనను కలిగి ఉన్నాయి. ఇవి కేవలం మాకు మాత్రమే కాదు యావత్ ప్రపంచానికి తీవ్ర సమస్యలుగా ఉన్నాయి. ఈ క్రమంలోనే ప్రపంచ శాంతి, స్థిరత్వానికి ఇలాంటి సమస్యల పరిష్కారానికి ఉమ్మడి భాగస్వామ్యం అవసరం". అని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, రాడికలైజేషన్ మనకే కాక ప్రపంచ దేశాలకు సవాళ్లు విసురుతున్నట్టు చెప్పారు. దీనిపై సమష్టిగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి బెదిరింపులను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రపంచ శాంతి, సుస్థిరత కోసం దేశాల మధ్య పరస్పర సహకారం అవసరమని అన్నారు. ప్రపంచవ్యాప్త ఉద్రిక్తతల విషయంలో భారత్ వైఖరి ఎప్పుడూ ఒకటేనని, శాంతి, సుస్థిరత కీలకమని, రెండు ప్రజాస్వామ్య దేశాలు కలిసి పనిచేస్తే శాంతి మరింత పటిష్టమవుతుందని అన్నారు. ప్రపంచ దేశాల్లో భారతీయులు ఎక్కడున్నా వారితో ఎప్పుడూ సంప్రదింపులు జరుపుతూ వారి భద్రతకు భారత్ కట్టుబడి ఉంటుందని చెప్పారు. అమెరికా- ఇజ్రాయిల్ సంయుక్తంగా ఇరాన్ లక్ష్యంగా వైమానిక దాడులు చేయడం, ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంపై ఇరాన్ ప్రతి దాడులకు దిగింది. ఇజ్రాయెల్, అరబ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్ దాడులతో విరుచుకుపడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ శాంతియుత పరిష్కారానికి పిలుపునిచ్చారు. కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ప్రశంసించారు, గత దశాబ్దంలో భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో మోడీ పోషించిన పాత్ర అద్భుతమైనదని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి మోడీతో సంయుక్త విలేకరుల సమావేశంలో కార్నీ మాట్లాడుతూ, "గత దశాబ్దంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో, భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఈ దేశంలో తలసరి ఆదాయాలు చరిత్రలో ఎన్నడూ చూడని వేగంతో పెరిగాయి, మానవ చరిత్రలో అరుదుగా కెనడా మీ ఆశయాన్ని, మీ ఉద్దేశ్య భావాన్ని పంచుకుంటుంది. ఈ కొత్త యుగంలో విజయం కోసం ప్రిస్క్రిప్షన్ 2023లో మీ జి20 అధ్యక్షత థీమ్ ద్వారా చక్కగా ఉదహరించబడిందని నమ్ముతున్నా, దానికి హాజరయ్యే గౌరవం లభించింది. ఆ థీమ్, 'ఒకే భూమి, ఒక కుటుంబం, ఒకే భవిష్యత్తు', ఎందుకంటే మన యుగపు సవాళ్లను ఒకే దేశం పరిష్కరించదు," అని కార్నీ అన్నారు.

## ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో అమెరికా వాడిన ఆయుధాలు ఇవే!

వాషింగ్టన్, మార్చి 2: ఇరాన్‌పై అమెరికా చేపట్టిన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో అమెరికా ఇప్పటి వరకు ఇజ్రాయెల్‌తో కలిసి 2000కుపైగా టార్గెట్లను ధ్వంసం చేసింది. ఇరాన్‌పై దాడులకు ఉపయోగించిన ఆయుధాలను, తమ టార్గెట్లను కూడా సెంట్‌కామ్ బహిర్గతం చేసింది. బి-2 స్టెల్త్ బాంబర్లు, లూకస్ డ్రోన్లు, పేట్రియాట్ క్షిపణులు, థాడ్ యాంటీ బాలిస్టిక్ మిసైల్ సిస్టమ్, ఎఫ్-18, ఎఫ్-16, ఎఫ్-22, ఫైటర్ జెట్లు, ఎ-10 అటాక్ జెట్స్, ఎఫ్-35 స్టెల్త్ ఫైటర్స్, ఇఎ-18జి, ఎలక్ట్రానిక్ అటాక్ ఎయిర్ క్రాఫ్ట్, అవాక్స్ విమానం, ఎయిర్‌బార్న్ కమ్యూనికేషన్ రిలే, పి-8 మారిటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్, ఆర్సీ-135 నిఘా విమానం, ఎంక్యూ-9 రీపర్స్, ఎం-142 హైమొబిలిటీ రాకెట్ వ్యవస్థ, అణుశక్తి విమాన వాహక నౌక, గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్లు, కౌంటర్ డ్రోన్ వ్యవస్థలు, రీఫ్యూయలింగ్ విమానాలు, రీఫ్యూయలింగ్ షిప్‌లు, సి-17 గ్లోబ్ మాస్టర్ కార్గో విమానం, సి-130 కార్గో విమానం వాడినట్లు సెంట్‌కామ్ వెల్లడించింది. ఇరాన్ క్షిపణి దాడులను నిలువరించేందుకు దీనిని వాడుకోని స్తున్నట్లు వెల్లడించింది. అమెరికా బి-2 స్టెల్త్ బాంబర్లు ప్రయాణించేందుకు అనువైన రన్‌వే ఇక్కడ ఉంది.

## కువైట్‌లో 3 అమెరికా యుద్ధవిమానాలు కూల్చివేత

కువైట్, మార్చి 2: ఇరాన్‌పై ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న మూడు అమెరికా ఎఫ్15ఈ స్ట్రైక్ ఈగల్ యుద్ధ విమానాలు కుప్పకూలాయి. ఈ విమానాలను తామే కూల్చామని ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది. అయితే ఇవి శత్రువుల దాడిలో కూలిపోలేదని మిత్రదేశమైన కువైట్ ఎయిర్ డిఫెన్స్ దళాలే వీటిని పొరపాటున కూల్చేశాయని అమెరికా సైన్యం ఓ ప్రకటన చేసింది. ఈ విషయాన్ని అమెరికాఅధికారికంగా ధృవీకరించింది. అమెరికా కాలమానం ప్రకారం 1వ తేదీ రాత్రి 11:03 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో ఇరాన్ నుంచి యుద్ధ విమానాలు, డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులతో దాడులు జరుగుతున్నాయి. ఈ తీవ్ర ఉద్రిక్తతల నడుమ అమెరికా విమానాలను శత్రువుల విమానాలుగా పొరబడిన కువైట్ బలగాలు కాల్పులు జరపడంతో అవి కూలిపోయాయి. దీన్నే సైనిక పరిభాషలో ఫ్రెండ్లీ ఫైర్ అంటారు.

# 4 వారాల్లో ముగింపు పలుకుతా

**ఇరాన్ - అమెరికా యుద్ధంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు**



వాషింగ్టన్, మార్చి 2: ఇరాన్‌తో కొనసాగుతున్న సైనిక ఘర్షణ సుమారు నాలుగు వారాల్లో ముగిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంచనా వేశారు. ఇదే సమయంలో ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ సైనిక చర్యలో తొలిసారిగా అమెరికా సైనికులు మరణించినట్లు ఆయన ధ్రువీకరించారు. మరోవైపు, ఇరాన్ కొత్త నాయకత్వంతో చర్చలకు తాను సిద్ధంగా ఉన్నానని కూడా సంకేతాలిచ్చారు. మీడియా సంస్థలతో మాట్లాడుతూ ట్రంప్ ఇరాన్‌తో యుద్ధం మొదలైన తర్వాత తొలిసారిగా అమెరికాకు నష్టం వాటిల్లినట్లు అంగీకరించారు. కువైట్‌లోని స్థావరంలో ఉన్న అమెరికా సైనికుల్లో ముగ్గురు మరణించగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ అధికారికంగా ప్రకటించింది. ఇది చాలా పెద్ద దేశం, అందుకే దీనికి నాలుగు వారాలు లేదా అంతకంటే తక్కువ సమయం పట్టొచ్చు అని ట్రంప్ ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అణ్వాయుధాలు సంపాదించకుండా ఇరాన్‌ను నిరోధించడం, ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా ఇజ్రాయెల్‌తో కలిసి ఈ సైనిక చర్య చేపట్టినట్లు ట్రంప్ వివరించారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం తర్వాత ఏర్పడిన కొత్త నాయకత్వంతో చర్చలు జరపడానికి తాను అంగీకరించానని చెప్పారు. వారు చర్చలు కోరుకుంటున్నారు, నేను దానికి అంగీకరించానని తెలిపారు. సైనిక చర్య పూర్తి స్థాయిలో కొనసాగుతుందని, నిర్దేశిత లక్ష్యాలు పూర్తయ్యే వరకు దాడులు ఆగవని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘర్షణ ముగిసేలోపు మరింత ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని కూడా ఆయన హెచ్చరించడం గమనార్హం. ఇరాన్‌పై ఆపరేషన్‌లో ఇప్పటివరకు అమెరికాకు చెందిన ముగ్గురు సైనికులు మరణించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ధ్రువీకరించింది. దీనిపై ట్రంప్ స్పందిస్తూ తమ సైనికుల మృతికి ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. అయితే యుద్ధం ముగిసేలోపు మరింత ఎక్కువ మంది అమెరికా సైనికులు మృతిచెందే అవకాశం ఉందని పేర్కొన్నారు. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల వల్ల ఇరాన్‌లో దాదాపు 600 మంది మరణించారు. ఇదిలావుండగా ఇరాన్ ఐఆర్‌జీసీ, మిలిటరీ దళాలు ఆయుధాలు వీడితే వారికి రక్షణ కల్పిస్తామని ట్రంప్ వెల్లడించారు. లేదంటే వారికి చావు తప్పదని హెచ్చరించారు. తన ఆఫర్‌ను వాడుకొని ఇరాన్ ప్రజలు స్వేచ్ఛ పొందాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన, భయంకరమైన మిలిటరీ దాడులను చూస్తున్నామని అమెరికా అధ్యక్షుడు తెలిపారు. ఇరాన్ దీర్ఘశ్రేణి అణ్వాయుధాలను కలిగి ఉండటం అమెరికాకు ముప్పు అని పేర్కొన్నారు. దాన్ని అడ్డుకోవడం కోసమే తాము ఈ దాడులు చేపట్టామన్నారు. తమ లక్ష్యాలన్నీ నెరవేరే వరకు ఇది కొనసాగుతుందని చెప్పారు.

## గల్ఫ్‌దేశాల్లో భయం...భయం...!

దుబాయి, మార్చి 2: గల్ఫ్ దేశాల్లో సోమవారం ఉదయం భయానక వాతావరణం అలుముకుంది. దుబాయ్, అబుదాబి, దోహాతో పాటు పలు ప్రధాన నగరాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాన్ తన పొరుగు దేశాలపై దాడులను తీవ్రతరం చేయడంతో గల్ఫ్ ప్రాంతం ఉలిక్కిపడింది. ఇప్పటివరకు సైనిక స్థావరాలపై దాడులకే పరిమితమైన ఇరాన్ ఇప్పుడు వ్యూహం మార్చింది. తాజాగా పౌర నివాసాలు, విమానాశ్రయాలు, షాపింగ్ మాల్స్ పై దాడులు చేస్తుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య పరస్పర దాడులు కొనసాగుతుండగా, ఇరాన్ తన దాడులను ముమ్మరం చేయడం యుద్ధ మేఘాలను మరింత ముదురుస్తోంది.

# ఇజ్రాయెల్ ప్రధానికి మోడీ ఫోన్

- శత్రుత్వాలకు ముగింపు పలకాలని హితువు
- యుఎఇ అధ్యక్షుడుతోనూ మోడి ఫోన్ చర్చలు

న్యూఢిల్లీ, మార్చి 2: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమైన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుతో ఫోన్ చేసి చర్చలు జరిపారు. ప్రస్తుత ప్రాంతీయ పరిస్థితిని చర్చించారు. పశ్చిమాసియాలో శత్రుత్వాలకు ముగింపు పలకాల్సిన అవసరాన్ని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. నెతన్యాహుతో ఫోన్ సంభాషణకు సంబంధించిన వివరాలను ప్రధాని మోడీ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. "ఇటీవలి పరిణామాలపై భారత దేశం ఆందోళనలు తెలియజేశారు. పౌరుల భద్రతను ప్రాధాన్యతగా నొక్కి చెప్పారు. శత్రుత్వాలను త్వరగా నిలిపివేయవలసిన అవసరాన్ని భారతదేశం పునరుద్ఘాటించింది" అని ప్రధాని మోడీ రాసుకొచ్చారు. ఆ తర్వాత యుఎఇ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో కూడా ఫోన్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశంపై దాడులను ఖండించారు, ఈ క్లిష్ట సమయాల్లో భారతదేశం యుఎఇకి సంఘీభావంగా నిలుస్తుందని చెప్పారు. సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లపై జరిగిన దాడులను ప్రధాని నరేంద్ర మోడీ ఖండించారు. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాలకు ఫోన్ చేసి ప్రధాని మోడీ మాట్లాడారు. ఆ రెండు దేశాల్లోని భారతీయుల క్షేమంపై ఆరా తీశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు, ఆపై ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అంతకు ముందు ఆదివారం రాత్రి మోడీ అధ్యక్షతన భద్రత వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఎస్) సమావేశం జరిగింది. పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితులపై సమీక్షించారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌లో జరిగిన వైమానిక దాడులు, అనేక గల్ఫ్ దేశాలలో దాడులతో సహా తదనంతరం పరిణామాలపైనా కమిటీ చర్చించింది. గల్ఫ్ ప్రాంతంలోని ప్రవాస భారతీయుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భారతీయ ప్రయాణికులు, షెడ్యూల్డ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, అలాగే ప్రాంతీయ భద్రత, ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలపై విస్తృత ప్రభావాలను కూడా సిసిఎస్ సమీక్షించింది. ఈ పరిణామాల వల్ల ప్రభావితమైన భారతీయ పౌరులకు సహాయం చేయడానికి అవసరమైన, సాధ్యమయ్యే చర్యలు తీసుకోవాలని భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సంబంధిత అన్ని విభాగాలను ఆదేశించింది.

## మంటల్లో పశ్చిమాసియా



## చమురు శుద్ధి కేంద్రాలపై ఇరాన్ దాడి

దుబాయి, మార్చి 2: పశ్చిమాసియాలో యుద్ధం భీకర రూపం దాల్చింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇరాన్ తన క్షిపణి, డ్రోన్ దాడులతో గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. ఈ ఉదయం సౌదీ అరాంకోకు చెందిన అతిపెద్ద చమురుశుద్ధి కర్మాగారం "రాస్ తనూరా"పై ఇరాన్ డ్రోన్లతో దాడి చేయడంతో సౌదీ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ దాడి కారణంగా సౌదీ అరాంకో తన కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసింది. సౌదీ రక్షణ శాఖ ఈ డ్రోన్లను అడ్డుకున్నట్లు ప్రకటించినప్పటికీ, ప్లాంట్ వద్ద అగ్నిప్రమాదం సంభవించినట్లు సౌదీ సంస్థలు వెల్లడించాయి. కేవలం సౌదీ అరేబియానే కాకుండా యూఏఈ, ఖతార్, కువైట్, బహ్రెయిన్ వంటి దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణి దాడులను ముమ్మరం చేసింది. ఈ దాడుల ప్రభావం అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై తీవ్రంగా పడింది. ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం వాటా కలిగిన హోర్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. భద్రతా కారణాల దృష్ట్యా షిప్పింగ్ కంపెనీలు తమ సేవలను నిలిపివేయడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు కొరత ఏర్పడే ప్రమాదం కనిపిస్తోంది. దీని ప్రభావంతో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ఒక్కసారిగా 13 శాతం పెరిగి బ్యారెల్‌కు 80 డాలర్లకు చేరుకుంది. ఒకవేళ ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే చమురు ధర 100 డాలర్లను దాటవచ్చని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉంటే, ఇరాన్ దాడులను సౌదీ అరేబియా తీవ్రంగా ఖండించింది. తమ భూభాగాన్ని లేదా గగనతలాన్ని ఇరాన్‌పై దాడులకు అనుమతించేది లేదని తాము అమెరికా, ఇజ్రాయెల్ లకు స్పష్టం చేసినప్పటికీ తమపై ఇరాన్ దాడులకు దిగిందని సౌదీ అసహనం వ్యక్తం చేసింది. ఈ చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇరాన్ రాయబారికి సమన్లు జారీ చేసింది.

## కువైట్‌లో అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్ దాడి!

### గల్ఫ్ దేశాల్లో తీవ్ర ఉద్రిక్తత

కువైట్ సిటీ, మార్చి 2: ఇరాన్ తమ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా దాడులు చేపట్టింది. దీంతో పరిస్థితులు మరింత దిగజారాయి. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో పొగ దట్టంగా అలముకుంది. అంబులెన్స్‌లు, అగ్నిమాపక యంత్రాలు అక్కడికి చేరుకున్నట్లు పలు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. మరోవైపు, ఇరాన్ డ్రోన్ దాడులతో బహ్రెయిన్ రాజధాని మనామాతోపాటు దుబాయ్, దోహా, అబుదాబిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాక్‌లోని ఎయిర్‌పోర్టు సమీపంలో రెండు డ్రోన్లను ఆ దేశ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చేశాయి. సైప్రస్‌లోని బ్రిటన్ నౌకాదళ స్థావరంపై డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడిలో స్వల్ప నష్టమే జరిగిందని సైప్రస్ ప్రభుత్వం వెల్లడించింది. ఇక, ఇజ్రాయెల్‌లో సైరన్ల మోత మోగుతోంది. ఇరాన్ నుంచి వచ్చే క్షిపణులను తమ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ అడ్డుకుంటోందని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ వెల్లడించాయి. ఈ సందర్భంగా యుద్ధం ఆపేందుకు మధ్యవర్తులతో ఇరాన్ సంప్రదింపులు జరుపుతోందంటూ వస్తోన్న వార్తలను ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీ ఖండించారు. యుద్ధం విషయంలో అమెరికాతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. 'ఈ దాడులను మేం మొదలుపెట్టలేదు. ట్రంప్ తన తప్పుడు ఆకాంక్షలతో ఈ ప్రాంతాన్ని సంక్షోభంలోకి నెట్టేశారు. ఇజ్రాయెల్ అధికార కాంక్ష కోసం అమెరికా సైనికులను బలి చేస్తున్నారు' అని అలీ లరిజాని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఇరాన్‌పై దాడుల్లో 555 మంది మృతి.. వందలమందికి గాయాలు

దుబాయి, మార్చి 2: అమెరికా, ఇజ్రాయెల్ దళాల వైమానిక దాడుల వల్ల ఇరాన్‌లోని సుమారు 131 నగరాల్లో ప్రభావం పడినట్లు ఇరాన్ వెల్లడించింది. తమ దేశానికి చెందిన 555 మంది మరణించారని టెలిగ్రాం పోస్టులో ఇరాన్ పేర్కొన్నది. అయితే పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభంపై ప్రపంచ దేశాలు ఆసక్తిగా చూస్తున్నాయి. కొన్ని దేశాలు అమెరికా-ఇజ్రాయిల్ వైఖరిని ఖండించగా, మరికొన్ని దేశాలు ఆ దాడులను సమర్థించాయి. అయితే కీలకమైన జర్మనీ ప్రస్తుతం అమెరికా ఇజ్రాయెల్ దళాలకు అండగా నిలవనున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇరాన్ తమ దాడుల్ని ఆపకుంటే, అప్పుడు అమెరికా దళాలతో జోడీ కట్టే అవకాశాలు ఉన్నట్లు జర్మనీ వర్గాలు చెబుతున్నాయి. ఇజ్రాయెల్ ఆర్మీ రేడియోతో జర్మనీ సైనిక వర్గాలు ఈ విషయాన్ని పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇరాన్ వైఖరిని ఖండిస్తూ ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ గత రాత్రి ప్రకటన జారీ చేశాయి. తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు, గల్ఫ్ మిత్రులను రక్షించుకునేందుకు, అవసరమైతే ఇరాన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ఆ దేశాలు వార్నింగ్ ఇచ్చాయి.

## ఐఆర్‌జిసి హెడ్‌క్వార్టర్స్ ధ్వంసంచేసాం.. అమెరికా సెంట్‌కామ్ వెల్లడి

వాషింగ్టన్, మార్చి 2: మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా అలుముకున్నాయి. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రధాన కార్యాలయాన్ని పూర్తిగా ధ్వంసం చేశామని అమెరికా సైన్యానికి చెందిన సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించింది. పాము తల నరికేశాం అంటూ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈ దాడితో ఇకపై ఐఆర్‌జీసీకి ప్రధాన కార్యాలయం అంటూ ఏదీ లేదని స్పష్టం చేసింది. సెంట్‌కామ్ విడుదల చేసిన ఒక ప్రకటనలో వివరాలు వెల్లడిస్తూ గత 47 ఏళ్లలో ఐఆర్‌జీసీ 1,000 మందికి పైగా అమెరికన్ల మృతికి కారణమైంది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యం అమెరికా సొంతం అని పేర్కొంది. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరులో భాగంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీతో పాటు పలువురు సీనియర్ సైనిక కమాండర్లు మరణించారు. ప్రతీకారంగా ఇరాన్ కూడా అమెరికా సైనిక స్థావరాలు, ఇజ్రాయెల్‌పై పెద్ద ఎత్తున క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తోంది. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో ఇప్పటి వరకు తమ సైనికుల్లో ముగ్గురు మరణించగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడినట్లు సెంట్‌కామ్ అధికారికంగా ధ్రువీకరించింది.

## 50 గ్రామాలు ఖాళీచేసి వెళ్లాలని ఇజ్రాయెల్ సైన్యం ఆదేశాలు

టెల్ అవీవ్, మార్చి 2: ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం తర్వాత తీవ్ర రూపం దాల్చిన ఘర్షణలు ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య భీకర దాడులకు దారితీశాయి. ఈ క్రమంలో, లెబనాన్‌లోని సుమారు 50 గ్రామాల ప్రజలు వెంటనే తమ ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ఇజ్రాయెల్ సైన్యం (ఐడిఎఫ్) సోమవారం హెచ్చరిక జారీ చేసింది. హిజ్బుల్లా ఉగ్రవాదులు తమ సైనిక కార్యకలాపాలను జనావాసాల నుంచే నిర్వహిస్తున్నారని, ఈ కారణంగా సామాన్య పౌరులకు ఎలాంటి ప్రాణనష్టం జరగకూడదనే ఉద్దేశంతోనే ఈ ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు ఐడీఎఫ్ తెలిపింది. గ్రామాలకు కనీసం 1000 మీటర్ల దూరంలో ఉన్న ఖాళీ ప్రదేశాలకు వెళ్లాలని ప్రజలకు సూచించింది. ఈ హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు లెబనాన్‌పై విరుచుకుపడ్డాయి. రాజధాని బీరుట్‌తో పాటు దక్షిణ, తూర్పు లెబనాన్‌లోని హిజ్బుల్లా స్థావరాలే లక్ష్యంగా బాంబుల వర్షం కురిపించాయి. ఆపరేషన్ రోరింగ్ లయన్ పేరుతో ఇజ్రాయెల్ ఈ దాడులను చేపట్టింది. ఇరాన్ మద్దతున్న హిజ్బుల్లా గ్రూపు ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడికి పాల్పడటంతో ఇజ్రాయెల్ ఈ తీవ్ర ప్రతిచర్యకు దిగింది.

## లెబనాన్ హిజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు

బీరూట్, మార్చి 2: ఇజ్రాయెల్ జరిపిన మెరుపు దాడుల్లో హిజ్బుల్లా కీలక నేత మృతి చెందాడు. లెబనాన్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. ఇజ్రాయెల్ రక్షణ దళం జరిపిన వైమానిక దాడుల్లో లెబనాన్ పార్లమెంట్‌లోని హిజ్బుల్లా బ్లాక్ అధిపతి మహమ్మద్ రాద్ మృతి చెందారు. హిజ్బుల్లా ఉగ్రసంస్థకు చెందిన మరికొందరు ఉన్నతాధికారులు కూడా ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటి వరకు 31 మంది మృతి చెందారు. వందల సంఖ్యలో గాయపడ్డారు. ఇరాన్‌కు మద్దతుగా హిజ్బుల్లా మిసైళ్లు, డ్రోన్లను ప్రయోగించింది. ఈ క్రమంలో ఇజ్రాయెల్ హిజ్బుల్లా స్థావరాలపై వైమానిక దాడులు నిర్వహించింది. హిజ్బుల్లా నాయకులు లెబనాన్ రక్షణ కంటే ఇరాన్‌కే అధిక ప్రాధాన్యత ఇచ్చారని, అందుకు వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఇజ్రాయెల్ రక్షణ దళం నార్తర్న్ కమాండర్ చీఫ్ రఫీ హెచ్చరించారు. హిజ్బుల్లా తమపై మొదట రాకెట్ దాడులు నిర్వహించిందని, అందుకే తాము ప్రతిదాడులు చేస్తున్నామని స్పష్టం చేశారు. మరిన్ని దాడులు నిర్వహిస్తామని, సమీపంలోని 50 గ్రామాలను ఖాళీ చేయాల్సిందిగా అక్కడి ప్రజలకు సూచించినట్లు తెలిపారు.

## పాక్ నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పై అఫ్ఘాన్ డ్రోన్ దాడి

కాబూల్, మార్చి 2: పాకిస్థాన్-అఫ్ఘానిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. సరిహద్దుల్లో ఇరుదేశాల మధ్య భీకర దాడులు కొనసాగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున తమ వైమానిక దళం పాక్‌లోని కీలక సైనిక స్థావరాలపై వైమానిక దాడులు నిర్వహించినట్లు అఫ్ఘానిస్థాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. రావల్పిండిలోని పాక్ ఆర్మీ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పై భారీ దాడులు చేపట్టినట్లు తెలిపింది. క్వెట్టాలోని 12వ కార్ప్స్ ఆర్మీ ప్రధాన కార్యాలయం, ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పలు కీలకమైన పాక్ సైనిక స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. తమ దేశంలోని వివిధ ప్రాంతాలపై పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడిందని.. పాక్ చొరబాట్లకు ప్రతీకారం తీర్చుకొనేందుకు ఈ దాడులు చేశామని అఫ్ఘాన్ తెలిపింది. తమ దాడుల్లో నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ సహా ఇతర సైనిక స్థావరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొంది.



డిజిపి కార్యాలయంలో జరిగిన దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకల్లో పాల్గొన్న అదనపు డిజిపి (శాంతి భద్రతలు) మహేష్ భగవత్, మల్టీజోన్-1 ఐజి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

## డిజిపి కార్యాలయంలో శ్రీపాదరావు జయంతి వేడుకలు

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపి శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు సోమవారం నాడు డిజిపి కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శాంతి భద్రతల అదనపు డిజిపి మహేష్ భగవత్ శ్రీపాదరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉమ్మడి ఎపి హయాంలో స్పీకర్‌గా ఆయన అందించిన సేవలను మహేష్ భగవత్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మల్టీ జోన్ 1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి, ఎఐజి రమణ కుమార్‌తోపాటు డిజిపి కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలందరికీ రవాణా, బీసీ సంక్షేమ శాక మంత్రి పొన్నం ప్రభాకర్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ మన సంస్కృతిలో స్నేహం, సౌహార్దం, ఆనందానికి ప్రతీక. రంగుల లాగానే మన జీవితాలు సంతోషాలతో నిండాలని, ప్రతి ఇంట్లో ఐక్యత, శాంతి, సుఖసమృద్ధులు నెలకొనాలని ఆకాంక్షి ంచారు. సహజసిద్ధమైన రంగులు, సంప్రదాయ పద్ధతిలో హోలీ పండుగ జరుపుకోవాలని మంత్రి సూచించారు. హోలీ పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త ఆశలు, విజయాలు తీసుకురావాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షి ంచారు.

## హోలీ నేపథ్యంలో సైబర్ నేరగాళ్ల ఆఫర్లు

### అప్రమత్తంగా ఉండాలి : టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా మంగళవారం జరగనున్న హోళి పండగ నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు అనేక రకాల ఆఫర్ల పేరిట ప్రజలను మోసం చేసేందుకు ఎత్తుగడలు వేస్తున్నట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) డైరక్టర్ శిఖా గోయల్ తెలిపారు. ఈ విషయంలో అందరు జాగ్రత్తగా వుండాలని ఆమె కోరారు. ఈ మేరకు సోమవారం శిఖా గోయల్ ఒక ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరగాళ్లు అంది వచ్చే ప్రతీ అవకాశాన్ని వాడుకుంటున్నారని, ఇందులో భాగంగా హోలీని పురస్కరించుకుని ముందుగా ఆఫర్లు ఇస్తూ ఇంటికే రంగులు పంపుతామని, పార్టీ పాసులు, ఫుడ్ ఆర్డర్లు, మిఠాయిల ఆర్డర్లు, బహుమతుల ఆర్డర్లు, క్యాష్ బ్యాక్ లింకులు పంపుతూ మోసాలకు వ్యూహాలు పన్నారని ఆమె తెలి పారు. ఇందుకుగానూ నకిలీ ఈ కామర్స్ వెబ్‌సైట్లను వాడుతూ, గోల్‌మాల్ డిజిటల్ పేమెంట్స్ లింకులు పంపుతారని ఆమె వివరించారు.

ఈ తరహా మోసాలన్నీ సోషల్ మీడియా ద్వారా జరుగుతున్నాయని, వీటిని ఎవరూ నమ్మవద్దని శిఖా గోయల్ కోరారు. సోషల్ మీడియా, వాట్సాప్‌లలో వచ్చే అడ్డగోలు ఆఫర్లను, ప్రకటనలను నమ్మవద్దని, ఎవరు పడితే వారు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, తమ వ్యక్తిగత వివరాలను ఎవరికి చెప్ప వద్దని ఆమె కోరారు. నమ్మకంగా వుండే ప్లాట్ ఫారంల నుంచే వస్తువులను కొనాలని ఆమె తెలిపారు. ఈ విషయంలో ఎవరికైనా అనుమానాలు తలెత్తితే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని, సైబర్‌క్రైం పోలీసులను సంప్రదించాలని శిఖా గోయల్ తెలిపారు.

## పెన్షనర్ల బకాయిలు రూ.11 వేల కోట్లు

### నెలకు రూ.1,000 కోట్లకు తగ్గకుండా రిలీజ్

### ప్రస్తుతం రూ.700 కోట్లు విడుదల

### సెప్టెంబరు 2027 నాటికి పూర్తిగా చెల్లింపు

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల బకాయిల చెల్లింపుల కోసం నిధులను పెంచాలని సర్కార్ భావిస్తున్నది. ఇందులో భాగంగా 2026-27 ఆర్థిక సంవత్సరం మొదలయ్యే వచ్చే ఏప్రిల్ నుంచి ప్రతి నెల రూ.1,000 కోట్లకు తగ్గకుండా విడుదల చేయాలని ల్యంగా గా పెట్టుకున్నట్టు తెలిసింది. ఆర్థిక శాఖ అధికారవర్గాల వివరాల మేరకు పెన్షనర్ల బకాయిలను చెల్లించేందుకు ప్రతి నెల రూ.700 కోట్లకు తగ్గకుండా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నది. కానీ ప్రతి నెలా సుమారు 400 మంది ఎంప్లాయిస్ రిటైర్ అవుతున్నారు. ఒక్కొక్కరికి సగటున రూ. 1 కోటి వరకు ఇవ్వాల్సి ఉంటున్నది. దీంతో మళ్లీ రూ.300 కోట్ల వరకు పెండింగ్ పడుతున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు సుమారు రూ.11 వేల కోట్లు పెండింగ్ ఉన్నట్లు తెలిసింది. ఇలాగే కొనసాగితే పెన్షనర్లలో అసంతృప్తి పెరిగిపోవడంతో పాటు, బకాయిలను క్లియర్ చేయడం సాధ్యం కాదని ప్రభుత్వం గుర్తించింది. అందుకోసం ప్రస్తుతం ప్రతి నెల చెల్లిస్తున్న బకాయిల మొత్తాన్ని పెంచడం వల్ల కాస్త ఉపశమనం కలుగుతుందని, అందుకే ప్రతి నెల చెల్లిస్తున్న రూ.700 కోట్లను రూ.1000 కోట్లకు పెంచాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మరోపక్క ప్రతి నెల పాత అప్పులకు కిస్తీలు, వడ్డీలు, ఉద్యోగులకు జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు చెల్లించడం తప్పనిసరి. అందుకే పెన్షనర్ల బకాయిలను ఒకేసారి క్లియర్ చేయడం సాధ్యం కావడం లేదని ఆర్థిక శాఖ వర్గాలు అంటున్నాయి. కానీ ప్రతి నెల ఇస్తున్న రూ.700 కోట్లను దశలవారీగా పెంచుకుంటూ వెళ్తే బకాయిలన్నింటినీ క్లియర్ చేయొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏప్రిల్ నుంచి రూ. వెయ్యి కోట్లు రిలీజ్ చేయాలి. ఆరు నెలల తర్వాత మరో రూ.300 కోట్లు పెంచడం, ఆ తర్వాత ప్రతి నెల రూ. 1500 కోట్లు రిలీజ్ చేస్తే 2027 సెప్టెంబరు నాటికి బకాయిలు మొత్తం క్లియర్ చేయొచ్చని ఓ సీనియర్ ఐఏఎస్ వెల్లడించారు.

# అన్ని శాఖలు సమన్వయంతో సాగాలి

### స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు

### మహిళా భద్రత, సాధికారతకు సమగ్ర కార్యాచరణ

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** కేవలం ఒక్కశాఖకే పరిమితం కాకుండా విద్య, ఆరోగ్యం, పోలీసు, అటవి, పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని మహిళా శిశుసంక్షేమశాఖ ఉన్నతాధికారులను ఆ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్రంలో మహిళల సమగ్ర అభి వృద్ధి, భద్రత, ఆర్థిక సాధికారత కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై సచివా లయంలో సోమవారం ఆమె ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహిం చారు. ఇతర శాఖలతో సమన్వయం కోసం ప్రత్యేకంగా ఉప కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రి నిర్ణయించారు. బాల్యదశ నుంచే పిల్లల్లో లింగ సమానత్వంపై అవగాహన కల్పించేలా పాఠశాల పాఠ్యాంశాల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు. మహిళల భద్రత, సంక్షేమం, సాధికారత కోసం అవలంబించాల్సిన నూతన విధానాలపై చర్చించారు. మహిళా భద్రతను మరింత సమగ్రంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.

రాష్ట్రంలో ఇప్పటికే అమలులో ఉన్న షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, సైబర్ క్రైమ్ నియంత్రణ చర్యలు సమర్థవంతంగా పనిచేస్తున్నప్పటికీ, విద్యాసంస్థలు, హాస్టళ్లు, కార్యాలయాలు, రాత్రి వేళల ప్రయాణాలు, డిజిటల్ వేదికలు, అసంఘటితరంగం వంటి విభిన్న రంగాల్లో ఇంకా వ్యవస్థాపరమైన లోపాలు ఉన్నాయని



సమావేశం అభిప్రాయపడింది. వాటిని అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మహిళా భద్రతను కేవలం చట్టపరమైన అంశంగా కాకుండా మౌలిక వసతులు, సాంకేతికత, అవగాహన, పర్యవేక్షణ, బాధ్యతాయుత పరిపాలనల సమన్వయంతో చూడాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క అన్నారు. మహిళల రక్షణ కోసం విద్యాసంస్థలు, కార్పొరేట్ సంస్థల్లో, కంపెనీల్లో ఐసీసీ కమిటీలకు తప్పనిసరి ఆడిట్ వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. రాత్రి 8 గంటల తర్వాత మహిళా ఉద్యోగులకు జీపీఎస్ అనుసంధానిత సురక్షి త రవాణా విధానం ఉండాలని సూచించారు. అసంఘటితరంగ మహిళల కోసం ప్రత్యేక నమోదు, గుర్తింపు కార్డు, ఫిర్యాదు వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ప్రజా రవాణాలో సిసి టివి పర్యవేక్షణను బలోపేతం చేసి పీక్ అవర్‌లో భద్రతా ఆడిట్లు నిర్వహించాలని నిర్ణయించారు. సైబర్ మార్ఫింగ్, స్టాకింగ్, బ్లాక్‌మెయిల్ వంటి నేరాలపై వేగంగా స్పందించడంతోపాటు బాధితులకు కౌన్సెలింగ్ కల్పించాల న్నారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగ మహిళల రక్షణకు ప్రత్యేక విధానాలు రూపొందించాలన్నారు. గృహ హింస కారణంగా ఒంటరిగా మిగిలిన మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో రుణాలు అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఆశ్రయ గృహాలు, హాస్టళ్ల భద్రతపై డిజిటల్ పర్యవేక్షణ ప్రోటోకాల్ అమలు చేయాలని ఆదేశించారు. మహిళల భద్రతకు సంబంధించి హోం, మహిళా శిశు సంక్షేమ, విద్య, కార్మిక, రవాణా, మున్సిపల్ పరిపాలన, ఐటి, ఆరోగ్యశాఖల సమన్వయంతో రాష్ట్ర స్థాయి మహిళా భద్రత కన్వర్జెన్స్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని మంత్రి సూచించారు.

మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులందరికీ సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్స్ సిద్ధం చేయాలని, ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న మహిళలకు మెటర్నిటీ బెనిఫిట్స్ చట్టపరమైన రక్షణతో అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. లైంగిక వేధింపుల కేసుల పురోగతిపై పర్యవేక్షణ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాల కోసం ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మించాలని, వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లలో చేరిక ప్రక్రియను ప్రభుత్వ యాప్ ద్వారా పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. మహిళల భద్రత అనేది ఒక్క శాఖ బాధ్యత కాదని, అది ప్రభుత్వ సమగ్ర కర్తవ్యమని స్పష్టం చేశారు. నిర్లక్ష్యానికి చోటులేకుండా బాధ్యతతో, సాంకేతికతతో, సమన్వయంతో పనిచేస్తేనే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు మహిళా సాధికారతకు అవసరమైన పలు కీలక పథకాలను రూపొందించి సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదంతో త్వరలో ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు.

అదేవిధంగా.. మహిళలకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇవ్వాల్సిన ఇందిరమ్మ మహిళా శక్తి యూనిఫాం చీరల డిజైన్లను మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ దివ్యా దేవ రాజన్ పరిశీలించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలను బలోపేతం చేయడం, బ్యాంకు లింకేజిలు కల్పించడం, చిన్నవ్యాపారాల్లో ప్రోత్సహించడంపై సమావేశంలో చర్చించారు. 2047 నాటికి వివిధ రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉన్నతాధికారులు సంజయ్ కుమార్, శికా గోయల్, క్రిస్టినా చోంగ్తు, అనితా రామచంద్రన్, ప్రియాంకా వర్గీస్, శృతి ఓజా, దివ్యా దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు 96.54 శాతం హాజరు

### మహబూబాబాద్‌లో మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు

### రేపటి నుంచి సంస్కృతం మూల్యాంకనం ప్రారంభం

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** రాష్ట్రం వ్యాప్తంగా సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 96.54 శాతం మంది విద్యా ర్థులు హాజరయ్యారు. ఇంటర్ వార్షిక పరీక్షలు ఈ నెల 25 నుంచి ప్రారంభమైన సంగతి తెలిసిందే. సోమవారం నుంచి సబ్జెక్టు పరీక్షలు ప్రారంభం కాగా.. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మేథమెటిక్స్, పొలిటికల్ సైన్స్, బొటనీ పేపర్-1 పరీక్షలు జరగాయి. వాటిలో మహబూబాబాద్ జిల్లాలో ఒక మాల్ ప్రాక్టీస్ కేసు మాత్రమే నమోదైనట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజులపాటు ఇంటర్ విద్యార్థులకు లాంగ్వేజెస్ పరీక్షలు జరిగాయి. సోమవారం జరిగిన ఇంగ్లీష్ పేపర్-2 పరీక్షల సందర్భంగా రాష్ట్రంలోని కరీంనగర్, సిద్ధిపేట జిల్లాల్లో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైనట్టు అధికారులు తెలిపారు. శనివారం జరిగిన మేథమేటిక్స్ పేపర్-1, బోటనీ పేపర్-1, పొలిటికల్ సైన్స్ పేపర్-1 పరీక్షలకు సెట్ బిని ఎంపిక చేసినట్టు తెలిపారు. సోమవారం జరిగిన పరీక్షలకు 96.54 శాతం మంది విద్యా ర్థులు హాజరయ్యారు. పరీక్షలకు 5,50,563 మంది హాజరు కావల్సి ఉండగా.. వారిలో 5,31,782 మంది విద్యార్థులు హాజరయ్యారు. మహ బూబాబాద్ జిల్లాలో ఒక మాల్ ప్రాక్టీస్ కేసు నమోదైనట్టు సెక్రటరీ తెలిపారు. ఇంటర్ బోర్డు నుంచి రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాల్లో అబ్జర్వర్స్ పరీక్షల సరళిని పరిశీలించి, పరీక్షా కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. సంస్కృతం పేపర్-1, పేపర్-2 జవాబు పత్రాల మూల్యాంకనం రేపటి (బుధవారం) నుంచి ప్రారంభం కానుంది. ఎక్కువ మంది విద్యార్థులు సంస్కృతం పరీక్షను రాస్తున్న నేపథ్యంలో ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ముందుగానే సంస్కృతం జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ముందుగానే ఈ నెల 4 నుంచి ప్రారంభించనున్నారు. ఇక మిగిలిన పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనాన్ని ఈ నెల 15 నుంచి ప్రారంభించి 20 వరకు మూడు విడతలుగా నిర్వహించనున్నారు.

### కుమ్మెర జాతరలో మరణించిన చిన్నారి తండ్రికి

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం.. ప్రభుత్వ ఇల్లు

### ప్రకటించిన రాష్ట్ర బిసి కమిషన్

### ఘటనపై వివరాలు సమర్పించిన నాగర్‌కర్నూల్ కలెక్టర్

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** కుమ్మెర జాతరలో మరణించిన చిన్నారి తండ్రికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వనున్నారు, అలాగే రెండు పడకల ఇల్లును మంజూరు చేయనున్నట్టు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ తెలిపారని తెలంగాణ బీసీ కమిషన్ ప్రకటించింది. తెలంగాణ బీసీ కమిషన్ ఫిబ్రవరి 23న నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌ను కుమ్మెర జాతర సంఘటనపై నివేదిక కోరడం జరిగింది. కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి ఫిబ్రవరి 24న కుమ్మెర గ్రామాన్ని సందర్శించి వివరాలు తెలుసుకోవడం జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బధ్వావత్ సంతోష్ తమ నివేదికను ఎల్‌సి/256/2026ను ఫిబ్రవరి 28న బీసీ కమిషన్‌కు పంపగా కమిషన్‌కు సోమవారం చేరినట్టు కమిషన్ తెలిపింది. జిల్లా యంత్రాంగం ద్వారా ఫిబ్రవరి 25,2026న పాప తండ్రి గణేష్‌కు డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేటివ్ ఫండ్ నుండి ఒక లక్ష రూపాయలు ఇవ్వడం జరిగిందని, పాప తండ్రి గణేష్‌కు నాగర్‌కర్నూల్ గవర్నమెంట్ మెడికల్ కాలేజిలో అవుట్‌సోర్సింగ్ జాబ్ ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తన లేఖలో తెలిపారని కమిషన్ ప్రకటించింది. పాప తండ్రి గణేష్‌కు 2 పడకల గదిని ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ పాప కుటుంబంతో మాట్లాడి, అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ రిపోర్టులో 18వ తారిఖునాడు కుమ్మెర మల్లన్న జాతర నుండి 21వ తారీఖు వరకు జరిగిన అన్ని సంఘటనలను కూలంకషంగా వివరించడం జరిగిందని కమిషన్ సోమవారం జారీ చేసిన ప్రకటనలో తెలిపింది. 17 ఫిబ్రవరి 2026 నుండి 20 ఫిబ్రవరి 2026 వరకు ఆ జాతరలో సుమారు 20 వేల భక్తులు పాల్గొన్నారని తెలపడం జరిగింది. 18వ తారీఖు సాయంత్రం 8:30 గంటల ప్రాంతంలో యు. శ్రీనివాస్ రెడ్డి ద్వారా నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో చంద్రకళ, బౌరమ్మ, గణేష్‌లపై ఒక ఫిర్యాదు చేయడం జరిగింది. అదేరోజు రాత్రి 9:30 గంటల ప్రాంతంలో గణేష్ ద్వారా శ్రీనివాస్‌రెడ్డితోపాటు మరో ఆరుగురిపై ఒక ఫిర్యాదు పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేయబడినది. ఫిబ్రవరి 21 నాడు మౌనిక తన 2 నెలల పాప ఉదయం 6 గంటల నుండి స్పందించడం లేదని నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తీసుకురాగా ఉదయం 7:00 గంటల ప్రాంతంలో డ్యూటి డాక్టర్ ఆ పాప చనిపోయిందని డిక్లేర్ చేయడం జరిగింది. తల్లి అయిన మౌనిక అనుమానం మేరకు ఈ కేసును అనుమానస్పద కేసుగా నాగర్‌కర్నూల్ పీఎస్‌లో రిజిస్టర్ చేయడం జరిగిందని కలెక్టర్ రిపోర్టులో పేర్కొన్నారు. 23వ తేది నాడు ఏ1 శ్రీనివాస్ రెడ్డి, ఏ2 మధుసూదన్ రెడ్డి, ఏ3 శ్రీకాంత్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడికి పంపారు. మరో 6 గురు నిందితులు పరారిలో ఉన్నారని కలెక్టర్ రిపోర్టులో చెప్పడం జరిగింది. పాప తల్లి మౌనిక కులాన్ని నిర్ధారించడానికి ఆధారంగా ఆమె ఎటువంటి సర్టిఫికేట్లు ఇప్పటివరకు అందజేయలేదని కల్టెర్ తెలిపారు. మౌనిక కులాన్ని నిర్ధారించడానికి మహమ్మదాబాద్ తహశీల్‌దార్‌కు ఆదేశించగా మౌనిక తల్లి బాలక్రిష్ణమ్మ పిచ్చగుంట్ల (వంశరాజ్) కులానికి చెందినదని ఆ కులం బీసీ-ఏ సీరియల్ నెం. 18గా తెలుపుతూ లెటర్ నెం. బి/306/2026, ద్వారా తెలపడం జరిగింది.

## మహిళా వర్సిటీకి అఫిలియేటెడ్ కాలేజీలివ్వడం అసాధ్యం

### ఉన్నత విద్యామండలి స్పష్టీకరణ

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీకి ఆఫిలి యేటెడ్ కాలేజీలివ్వడం సాధ్యంకాదని ఉన్నత విద్యామండలి స్పష్టంచేసింది. యూనివర్సిటీ విభజన ఇంకా పూర్తికాలేదని, ఫ్యాకల్టీ లేరని, వసతుల్లేవని.. ఇటువంటి ప్రస్తుత తరుణంలో అఫియేటెడ్ కాలేజీలను బదలాయించలేమని ఉన్నత విద్యామండలి స్పష్టంచేసింది. రాష్ట్రంలో మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ కొద్ది నెలల క్రితం అసెంబ్లీలో చట్టం చేసిన విషయం తెలిసిందే. కొత్తగా వీరనారి చాకలి ఐలమ్మ పేరుతో మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ చట్టం చేశారు. దీంతో ఇప్పటి వరకు ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో కోఠిలో కొనసాగుతున్న మహిళా కళాశాలను యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని మహిళా కాలేజీలు, విద్యాసంస్థలను మహిళా వర్సిటీకి అనుబంధంగా బదలాయించాలని అభ్యరిస్తూ ఉన్నత విద్యామండలికి మహిళా యూనివర్సిటీ లేఖ రాసింది. దీనిపై సాధ్యాసాధ్యాల కోసం ఉన్నత విద్యామండలి నిపుణుల కమిటీని వేసింది. ఉన్నత విద్యా మండలి నియమించిన కమిటీ పలు అంశాలను పరిగణిలోకి తీసుకుని.. ఆఫిలియేటెడ్ కాలేజీలను మహిళా యూనివర్సిటీకి కేటాయించడం సాధ్యం కాదని తేల్చింది. అదే విషయాన్ని తెలుపుతూ యూనివర్సిటీకి లేఖ రాసింది.

### రంగంలో జాతీయ పాడి పరిశ్రమ సంస్థ

### నిర్వహణ బాధ్యతలకు బోర్డు గ్రీన్‌సిగ్నల్

### నష్టాల్లో ఉన్న సంస్థను గాడిన పెట్టే నిర్ణయం

## మదర్ డెయిరీ టేకోవర్

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** పాడి రైతుల శ్రేయస్సు కోసం పురుడుపోసుకున్న నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం (నార్ముల్ మదర్ డెయిరీ) నష్టాల ఊబిలో కూరుకుపోయి ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. రాష్ట్రానికి చెందిన ఈ మదర్ డెయిరీ మూసివేతకు సిద్ధమైంది. దీన్ని గాడిన పెట్టేందుకు జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ రంగంలోకి దిగింది. ఈ డెయిరీని టేకోవర్ చేసుకునేందుకు పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒక దశలో లాభాలతో స్థిరాస్తులు కొనుగోలు చేసే స్థాయికి ఎదిగిన ఈ డెయిరీ కొన్నేళ్లుగా రాజకీయ జోక్యం, పాలకవర్గాలు తీసుకున్న అస్థవ్యస్థ, తప్పుడు విధానాలు, అవినీతికి తోడు, క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమాలు, మార్కెట్లో పెరిగిన పోటీ వంటి కారణాలతో రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన మదర్ డెయిరీ నష్టాల్లో మునిగిపోయింది. దీనికి తోడు ప్రస్తుత పరిస్థితుల్లో ఈ డెయిరీని గట్టెక్కించాలంటే దాదాపు రూ.75 కోట్ల వరకూ నిధులు అవసరం కానుండగా, సంస్థ నిర్వహణకు మరికొంత ఆర్థిక సాయం అత్యవసరం కానుంది. కాగా రాజకీయాలకు వేదికగా మారిన ఈ డెయిరీని పటిష్ట పరచకపోగా, అస్థిరత్వానికి గురయ్యేలా చేశారనే అపవాదు ఉంది. ఈ డెయిరీ నిర్వహణను పాలకవర్గాలు పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. 2003 స్వయం ప్రతిపత్తి సంస్థగా మారిన తర్వాత పాల మార్కెటింగ్‌కు ఢిల్లీకి చెందిన మదర్ డెయరీతో 2005లో ఒప్పందం చేసుకుంది. అప్పటి నుండి లాభాల బాటలో కొనసాగుతూ వచ్చింది. 2015లో అమూల్ పాలు ప్యాకింగ్ చేసేందుకు నార్మ్యాల్ ఒప్పందం చేసుకుంది. అయితే మార్కెట్లో తమకు పోటీగా ఉన్న అమూల్ పాల ప్యాకింగ్‌కు ఒప్పందం చేసుకోవడం ఢిల్లీ మదర్ డెయిరీ వ్యతిరేకించింది. దీని పర్యవసానంగా నార్మ్యాల్ డెయిరీతో ఢిల్లీ మదర్ డెయిరీ చేసుకున్న మార్కెటింగ్ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. దీంతో నార్ముల్ మదర్ డెయిరీకి నష్టాలు ఆరంభమయ్యాయి. పదేళ్లలో బ్యాంకు రుణాలు రూ.35.15 కోట్లకు చేరడం, ఏడాదికి రూ.4 కోట్లు చొప్పున వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. అంతేకాకుండా పాలు పోసే వారికి బిల్లులు చెల్లించాల్సి ఉంది. మరోపక్క రాజకీయ జోక్యం, ఒత్తిళ్ల కారణంగా అవసరానికి మించి ఉద్యోగులను ఇబ్బడిముబ్బడిగా నియమించారు. దీంతో ప్రతీ నెలా సుమారు రూ.40 లక్షల మేర అదనపు భారం పెరిగింది. దీనికి తగినట్లుగా 240 మంది తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో ఆర్థిక భారం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో ఇటీవల మదర్ డెయిరీ పాలకవర్గం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ మదర్ డెయిరీని నిర్వహించేందుకు అనుమతించాలని కోరింది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం సుముఖత కనపరిచన నేపథ్యంలో సంస్థ బోర్డు జాతీయ పాడి పరిశ్రామిభివృద్ధి సంస్థ బోర్డుతో భేటీ అయి, డెయిరీ ఆర్థిక పరిస్థితులు, మనుగడ తదితర అంశాలను చర్చించి, టేకోవర్ చేసుకోవాలని ప్రతిపాదించింది. ఇందుకు జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ బోర్డు షరతులతో కూడిన నిర్వహణకు అంగీకరించడంతో మదర్ డెయిరీ టేకోవర్ చేసుకోనుంది.

## ప్రైవేట్‌స్కూల్ బస్సు నిర్లక్ష్యానికి ఇద్దరు విద్యార్థులు బలి

### నల్గొండలో హృదయవిదారక ఘటన

**నల్గొండ రూరల్, మార్చి 2, ప్రభాతవార్త:** నల్గొండ మండలం చందనపల్లి గ్రామంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. ఇంటర్ పరీక్ష రాయాలనే ఆశతో బయలుదేరిన ఇద్దరు యువకులు మార్గమధ్యంలోనే మృతిచెందడం హృదయ విదారకం. శాలిగౌరారం మండలం బండమీది గూడెం గ్రామానికి చెందిన గైగుల్ల వంశీ (20), ఉట్కూర్ గ్రామానికి చెందిన గుడిసె రవి (20) స్ప్లెండర్ ప్లస్ బైక్ పై నల్గొండకు వస్తుండగా, చందనపల్లి వద్ద ఎదురుగా వచ్చిన ఎస్ పి ఆర్ స్కూల్ కు చెందిన బస్సు అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడంతో ఘోర ప్రమాదం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా వాహనం నడపడం తోనే ఈ ప్రమాదం సంభవించినట్టు తెలుస్తోంది. బైక్‌ను ఢీకొట్టిన బస్సు కారణంగా ఇద్దరు యువకులు తీవ్ర రక్తగాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇంటర్ పరీక్ష రాయడానికి వెళ్లిన ఇద్దరు విద్యార్థులు ఇలా మధ్యలోనే ప్రాణాలు కోల్పోవడం ప్రతి ఒక్కరినీ కలచివేసింది. తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి ఎదగాలని కలలు కన్న కుటుంబాలకు ఈ ఘటన పెద్ద దెబ్బగా మారింది. ప్రైవేట్ స్కూల్ బస్సులు రోడ్లపై అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు బలైపోతున్నాయనే విమర్శలు మళ్లీ వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల భద్రతను బోధించే సంస్థలే రోడ్డు భద్రతలో బాధ్యత లేకుండా ప్రవర్తిస్తే సమాజం ఎవరిని ఆశ్రయించాలి.? వంశీ తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నల్గొండ రూరల్ ఎస్ఐ దొంగరి సైదా బాబు తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, మృతుల కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషాద ఘటన మరోసారి ప్రైవేట్ విద్యాసంస్థల రవాణా విధానాలపై ప్రశ్నార్థక చిహ్నం మిగిల్చింది. నిర్లక్ష్యానికి మూల్యం అమాయకుల ప్రాణాలేనా అనే ప్రశ్నకు సమాధానం కార్పొరేట్ పాఠశాలలు పెట్టి తీరాల్సిందే!

## రెడ్కోకు జాతీయ పురస్కారం

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** హరిత ఇంధన రంగం, ఇంధన పరిరక్షణ విషయంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థకు (రెడ్కో) జాతీయ స్థాయి పురస్కారం లభించింది. ఈ మేరకు రెడ్కో జనరల్ మేనేజర్ జీఎస్వీ ప్రసాద్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో దేశానికి విశిష్ట సేవలందించిన వారికి బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ సంస్థ ఎంపిక చేస్తోంది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ వాఖ ఆధ్వర్యంలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆ సంస్థ డైరక్టర్ జనరల్ పాణిగ్రహి ఈ అవార్డును ప్రసాదక్ అంద చేశారు.

## మత్స్య పరిశ్రమ అభివృద్ధి, సంక్షేమానికి బడ్జెట్‌లో రూ. 5,000 కోట్లు కేటాయించాలి

### 9న జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరాహార దీక్షలు

### మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయం

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి వచ్చే బడ్జెట్‌లో రూ. 5000 కోట్లు కేటాయించాలని తెలంగాణ మత్స్య కారులు మత్స్య కార్మిక సంఘం డిమాండ్ చేసింది. బడ్జెట్ కేటాయింపు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరాహార దీక్షలను చేపట్టనున్నట్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ తెలిపారు. మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి 2026-27 బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.5000 కోట్లు కేటాయించాలని, గత 12 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో 986 మంది మత్స్యకారులు చనిపోయారని. ఆ కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా నిధులను ఈ బడ్జెట్లో కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరెట్ల ముందు నిరాహార దీక్షలు చేయాలని సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని లెల్లెల బాలకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా, రాష్ట్ర నాయకులు గొడుగు వెంకట్, బక్కి బాలమణి, గాండ్ల అమరావతి, మునిగల రమేష్, బోడంకి చందు, తేలు ఇస్తారి, మేఘనబోయిన శేఖర్ విడుదల చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇన్సూరెన్స్‌తోపాటు మరో ఐదు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియ చెల్లిస్తామని ఏప్రిల్ 2, 2017 సంవత్సరం జీవో నెంబర్ 6 ను విడుదల చేసి చట్టం చేశారని గుర్తు చేశారు. కానీ చనిపోయిన 986 మంది మత్స్యకార కుటుంబాలకు ఇప్పటివరకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వక పోవడం చాలా బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మత్స్య పరిశ్రమ అభివృద్ధి మత్స్యకారుల సంక్షేమం పట్ల ఎలాంటి చిత్తశుద్ధి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వృత్తిని నమ్ముకున్న లక్షలాదిమంది మత్స్యకారులు ఆర్థికంగా ఎదగలేక పేదరికంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కోట్లాదిమంది ప్రజలకు మంచి పోషక ఆహారాన్ని వేల కోట్ల రూపాయలు సంపాదించి పెడుతున్న మత్స్యకారులకు బడ్జెట్ కేటాయింపుల్లో న్యాయంగా రావాల్సిన వాటా దక్కటం లేదన్నారు. కనీసం ఈ ఏడాదైనా 2026- 27 సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపుల్లో మత్స్య పరిశ్రమకు రూ. 5000 కోట్లు కేటాయించడంతోపాటు పెండింగ్ ఎక్స్‌గ్రేషియాకు చెల్లించాల్సిన రూ. 50 కోట్లను కూడా ఈ బడ్జెట్లో కేటాయించాలని బాలకృష్ణ డిమాండ్ చేశారు.



## అసెంబ్లీలో దుద్దిళ్ల శ్రీపాదరావుకు నివాళులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 2:** తెలంగాణ శాసన సభ ప్రాంగణంలో మాజీ స్పీకర్, దివంగత నేత దుద్దిళ్ల శ్రీపాదరావు 89 వ జయంతి కార్యక్రమం జరిగింది. సోమవారం శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బోగరపు దయనంద్, తెలంగాణ శాసనసభ సెక్రెటరీ డా. నరసింహ చార్యులు, శాసనసభ సెక్రెటరీ ఆర్.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం

### జయంతి సందర్భంగా గాంధీభవన్‌లో నివాళులు

**హైదరబాద్, మార్చి 2,ప్రభాతవార్త:** మాజీ స్పీకర్ శ్రీపాదరావు ప్రజల మనిషి అని ఆయన సేవలు చిరస్మరణీయం అని పిసిసి ఉపాధ్యక్షుడు కుమార్ రావు అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో శ్రీపాదరావు జయంతి సంద ర్భంగా ఆయన చిత్రపటానికి భారీ పూలమాలలతో అలకంరించి కాంగ్రెస్ శ్రేణులు నివాళులు అర్పించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు గజ్జల కాంతం, అల్లం భాస్కర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన స్పీకర్‌గా అనేక ప్రాంతాల అభివృద్ధికి తన వంతు కృషిచేశారని గుర్తుచేసుకొన్నారు. శ్రీపాదరావు గొప్ప రాజకీయ దార్శనికుడు అని వారు అభివర్ణించారు,



## జల్లికట్టు క్రీడలో తీవ్రవిషాదం

### ఎద్దు పొడిచి ముగ్గురు మృతి, 76 మందికిపైగా గాయాలు

### 15 మంది పరిస్థితి విషమం

**చెన్నై, మార్చి 2:** శివగంగై జిల్లాలో ఏర్పాటు చేసిన జల్లికట్టులో తీవ్ర విషాదం నెలకొంది. సోమవారం జరిగిన ఈ క్రీడలో ఎద్దు పొడవడంతో ముగ్గురు మరణించారు. మరో 76మందికిపైగా గాయపడ్డారు. స్థానికుల సహాయంతో వారందరినీ పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో 15 మంది పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. జల్లికట్టు సందర్భంగా సరైన భద్రతా చర్యలు చేపట్టలేదని అందువల్లే ఇలా జరిగిందంటూ స్థానికులతో పాటు బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. మరో వైపు ఈ ఘటనలో మరణించిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు ఇప్పటికే ఆసుపత్రికి చేరుకు న్నారు. తమిళనాడులో జల్లికట్టు పోటీలను సంప్రదాయ క్రీడగా ప్రజలు జరుపుకొంటారు. ఈ క్రీడలను చూసేందుకు ఏపీ, తెలంగాణ ప్రజలు భారీగా తమిళనాడుకు తరలివస్తారు. పరుగులు తీస్తున్న పశువులను పట్టుకోవడానికి యువకులు ఉత్సాహంగా పోటీపడి పరుగెడతారు. ఇలాంటి సమయంలో కొన్నిసార్లు ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటుంటాయి.

## మండుతున్న ఎండలు..

### ఫిబ్రవరిలో అధికమైన బీర్ల అమ్మకాలు

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు దంచి కొడుతుండడంతో బీర్లకు డిమాండ్ విపరీతంగా పెరుగుతోంది. రోజు రోజుకు రాష్ట్రంలో బీర్ల విక్రయాలు గణనీయంగా పెరుగుతున్నాయి. మద్యం ప్రియులు ఎక్కువగా చల్లని బీర్‌ను సేవించేందుకే మొగ్గు చూపుతున్నారు. ఫిబ్రవరి నెలలోనే బీర్ల అమ్మకాలు 40శాతం మేర పెరిగాయి. రానున్న మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో అమ్మకాలు మరింత పెరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఫిబ్రవరి 28న ఒక్కరోజే 3లక్షల 28వేల బీర్ల కేసులు అమ్ముడయ్యాయి. అదే రోజున 2లక్షల 85వేల హార్డ్ లిక్కర్ కేసులు అమ్ముడయ్యాయి. ఫిబ్రవరి నెలలో 39లక్షల బీర్లు, 30లక్షల హార్డ్ లిక్కర్ కేసులు అమ్ముడైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. బీర్లకు డిమాండ్ పెరుగుతుండడంతో వేసవిలో కొరత రాకుండా ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

# బిఆర్‌ఎస్ దూకుడు.. కాంగ్రెస్ మౌనం!

### రాష్ట్ర సరిహద్దులు దాటుతున్న ఆరోపణలు

### తెలంగాణ ప్రభుత్వంపై పినరయి విజయన్ విమర్శలు


**హైదరబాద్, మార్చి 2,ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొద్దిరోజులుగా అవినీతి, అసాంఘిక వంటి అంశాలు అస్త్రాలుగా చేసుకొని అధికారపార్టీ నాయకులపై వాటిని ఆపాదించి బిఆర్‌ఎస్ ఆరోపణలు తీవ్రతరం చేసింది, మరోవైపు ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం కఠినంగా వ్యవహరించడం,మూసినది ప్రక్షాళన వంటి అభివృద్ధి కార్యక్రమాల చేపట్టగా వాటిపై కూడా బిఆర్‌ఎస్, బిజెపి ప్రతిపక్షాలు విమర్శలు చేస్తూ రాజకీయ ఆరోపణల యుద్ధం తీవ్రతరం చేస్తుంటే,ప్రభుత్వంలో భాస్వాములైన నాయకులు, పలువురు మంత్రులు వాటికి సమాధానాలు చెప్పకుండా మౌనంగా ఉండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లోనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ళు అయిన సందర్భంగా ప్రతిపక్షాల విమర్శల దాడి స్థాయి పెంచింది. ప్రభుత్వమే ప్రతిపక్షానికి విమర్శలు చేయడానికి అస్త్రాలు ఇచ్చినట్లుగా సెల్ఫ్‌గోల్ కొట్టుకొంటున్నారని కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృప్తి మొదలైంది. సిమెంట్‌ఫ్యాక్టరీ బెదిరింపుల అంశం, సింగరేణి సంస్థకు నైనీ కోల్ బ్లాక్ టెండర్లతో ఆరోపణలతో ప్రతిపక్షాలు కాంగ్రెస్‌ను ఇరుకునపెట్టడం ప్రారంభించాయి. తాజాగా ఖమ్మం జిల్లాలో వెలుగు మట్లలో ఇళ్లు కూల్చివేయడం, మూసి ప్రక్షాళన, మధు పార్క్ అపార్టుమెంట్ అంశాలను ప్రతిపక్షాలు తమకు అనుకూలంగా మలుచుకోవడానికి రాజకీయ విన్యాసాలు చేస్తున్నాయి.బిఆర్‌ఎస్ వర్కింగ్‌ప్రసిడెంట్ కెటిఆర్, హరీష్ రావు,బిఆర్‌ఎస్ కీలక నేతలు రోజు ప్రభుత్వాన్ని ఏదో ఒక అంశాన్ని తీసుకొని ఎండగడుతూనే ఉన్నారు. ఎక్కడ వెనకబడి పోతామో అని దీనికి తోడు బిజెపి కేంద్రమంత్రులు విమర్శల దాడులు తీవ్రతరం చేస్తూ ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి పై వరుస విమర్శలు వెల్లువెత్తినా వాటిని తిప్పికొట్టడంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు విఫలమవుతున్నారనే కాంగ్రెస్ శ్రేణులు ఆవేదన చెందుతున్నారు. కొండాసురేఖ కూతురు చేసిన ఆరోపణలు మొదలకొని రాష్ట్రంలో ఏ చిన్న అంశమైనా రాజకీయ రంగులు అద్దుతూ బిజెపి,బిఆర్‌ఎస్ నేతలు ముందుకు వస్తున్నారు.వెలుగుమట్ల సంఘటనతో కాంగ్రెస్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు రాష్ట్రసరిహద్దును దాటాయి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఏకంగా తెలంగాణలో బుల్డోజర్ రాజ్యం నడుస్తోందని ఇక్కడ అలాంటి అరాచకం తీసుకొని వద్దామా అంటూ ప్రజా క్షేత్రంలోకి వెళ్ళుతున్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, గ్రామపంచాయతీ ఎన్నికలు,మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ ఢంకా మోగించినా ప్రతిపక్ష బిఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాలు, పరిపాలనా నిర్ణయాలు, సంక్షేమ పథకాల అమలు అన్నింటిపైనా విమర్శలు చేస్తూ ప్రజల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అభిప్రాయం కూడగట్టే ప్రయత్నం చేస్తున్నాయి. రాష్ట్ర రాజకీయ వేదికపైనే కాదు జాతీయ వేదికపై కాంగ్రెస్ చేస్తున్న పొరపాట్లను బిఆర్‌ఎస్,బిజెపి చక్కగా ఉపయోగించుకోంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎఐ సమిట్‌లో కాంగ్రెస్ శ్రేణనులు చేసిన నిరసనను బిఆర్‌ఎస్ నేతలు దేశప్రతిష్టకు ముడిపెట్టి కాంగ్రెస్ జాతీయ అగ్రనేత రాహుల్ గాంధీ పై కూడా విమర్శలు చేసి దేశభక్తి సెంటిమెంటును కూడా అస్త్రంగా వినియోగించారు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నుంచి మొదలు కొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరకు లక్ష్యంగా చేసుకొని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు కాంగ్రెస్ నుంచి ప్రతిస్పందిస్తూ బహిరంగంగా ఆ రెండు పార్టీలను బలంగా కొద్దిమంది మాత్రమే ఎండగడు తున్నారు. గాంధీభవన్‌కు మాత్రమే పరిమితమయ్యే నేతలు కావడంతో వారి గొంతు పెద్దగా ఆశించినరీతిలో ప్రజలకు చేరడంలేదు. భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, విప్‌లు ఆదిశ్రీనివాస్, బీర్ల ఐలయ్య వంటివారు బిఆర్‌ఎస్ ఆరోపణలను తిప్పికొట్టే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ శ్రేణుల అభిప్రాపడుతున్నారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రభుత్వంపై వస్తున్న విమర్శలకు సమాధానం చెబుతున్నప్పటికి ఇతర సీనియర్ నేతలు, ముఖ్యంగా మంత్రులు ఎందుకు ముందుకు రావడం లేదన్న ప్రశ్న కాంగ్రెస్ కేడర్ నుంచే వినిపిస్తోంది.కాంగ్రెస్ అధిష్టానం నుంచి స్పష్టమైన వ్యూహాత్మక దిశానిర్దేశం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోన్నదని కాంగ్రెస్ వాదులు ఆందోళన చెందుతున్నారు. బిఆర్‌ఎస్ బిజెపిలు నిరంతరం చేస్తున్న రాజకీయ విమర్శలకు సమాధానం ఇవ్వకపోతే ప్రజల్లో అవే నిజమని నమ్మే పరిస్థితి వస్తుందనీ కాంగ్రెస్ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాల్లో ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజమే అయినప్పటికి వాటికి సముచితన సమాధానం ఇవ్వకపోతే ప్రజాభిప్రాయం దిశ మారే ప్రమాదం ఉందని కాంగ్రెస్ నేతలు ఇప్పటికైనా గుర్తించాల్సిన అవసరం ఉంది.బిఆర్‌ఎస్ దూకుడుతో సర్పంచ్ ఎన్నికలల్లో, మున్సిపల్,కార్పొరేషన్ ఎన్నికలలో ప్రతిక్షస్థానం పదిలపరుచుకొంది. లోక్‌సభ ఎన్నికల్లో చతికిలపడిన పార్టీ రెండు సంవత్సరాలలోనే ఓట్లశాతంలో గణీయమైన పెరుగుదల కనబరిచిందంటే బిఆర్‌ఎస్ తనకు అనుకూలంగా ప్రజాభిప్రాయం కూడగట్టుకోవడంలో ప్రతి రాజకీయ ఎత్తును జాగ్రత్తగా వేస్తున్నదని అర్థం. రాహుల్‌గాంధీని కూడా బోల్డ్ చేసే స్థాయిలో బిఆర్‌ఎస్ నాయకత్వం బంతివిసురుతున్నది ఇప్పటికైనా 2023 డిసెంబర్‌కుపూర్వం నాటి ఐక్యతన పార్టీలో కనబరచకపోతే రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందుల్లోకి పోవడం ఖాయం.

# మధ్యప్రాచ్యంలో ఇరాన్ దాడుల సెగలు

### పది గల్ఫ్ దేశాల్లో ఎయిర్‌పోర్టులు మూసివేత

### 3,400 విమానాలను నిలిపివేసిన వైమానిక సంస్థలు.. భారత్‌లోనూ అదే తీరు

**దుబాయ్, మార్చి 2:** ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్‌లు కొనసాగించిన దాడులకు ధీటుగా ఇరాన్ మధ్య ప్రాచ్య దేశాలపై దాడులు ముమ్మరం చేసింది. అంతేకాకుండా సుమారు పది గల్ఫ్‌దేశాల ఎయిర్‌పోర్టులు టార్గెట్‌గా వైమానిక దాడులుజరిపింది. అరబ్‌దేశాలపై జరిపిన దాడులకు గల్ఫ్‌దేశాల్లోని ప్రజలు వణికిపోయారు. సుమారు మూడువేలకుపైగా విమానాలను నిలిపివేసారు. దుబాయి, అబూదాబి, దోహా, బహ్రెయిన్ విమానాశ్రయాలు మూతపడ్డాయి. పైగా గల్ఫ్‌దేశాల్లోని గగనతలాలను మూసివేయడంతో భారత్‌లోని విమానసర్వీసులకు కూడా తీవ్రనష్టం వాటిల్లింది. ఇప్పటివరకూ 630 రూట్లలో సర్వీసులు నిలిచిపోయినట్లు విమానసంస్థలు చెపుతున్నాయి. ఎయిర్‌ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్ సర్వీసులే నిలిచిపోయాయి. ఇండిగో ఒక్కటే 160 విమానాలు నిలిపివేసింది. ఇక దాడులుప్రారంభించిన రోజే మధ్యప్రాచ్యంలో 1800 విమానాలు నిలిచిపోతే రెండోరోజు కూడా మరో 1400 విమానాలను నిలిపివేసారు.మొత్తంగా 3400 వామానాలను ఈరెండురోజుల్లోనే రద్దుచేసారు. ప్రాంతీయంగానే కాకుండా దీర్ఘకాలికరూట్లలో విమానాలు నిలిచిపోవడంతో ప్రయాణీకకులు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారు. ఇరాన్, ఇజ్రాయెల్; ఇరాక్,ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్ దేశాలు తమతమ ఎయిర్‌స్పేస్‌లనుమూసివేసాయి. ప్రపంచంలోనే అత్యంత రద్దీకలిగిన విమాన ప్రయాణ హబ్‌లను నిలిపివేసింది. వీటిలో దుబాయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, టెల్ అవీవ్ బెన్ గురియన్ ఎయిర్‌పోర్టు, దోహా హమద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులు కూడా మూసివేసారు. భారత్ యూరోప్, భారత్ అమెరికా విమానాలనను కూడా నిలిపివేసింది. పశ్చిమాసియా గగనతలంపై వెళ్లే సర్వీసులన్నింటినీ నిలిపివేసారు. నిజానికి ఇరాన్ బహ్రెయిన్, దుబాయి, ఖతార్, దోహా వంటి నగరాల్లోని విమానాశ్రయాలపై క్షిపణి, బాంబుదాడులు జరిపింది.



ఎమిరేట్స్, ఎతిహాద్ ఎయిర్‌లైన్స్ కూడా ఈ దాడుల భయంతో విమానసర్వీసులు నిలిపివేసాయి.

# ఘనంగా విజయ్, రష్మిక పెళ్లి రిసెప్షన్

### స్వగ్రామంలో సత్యనారాయణ వ్రతం నిర్వహించిన కొత్త దంపతులు

### హాజరైన ఎంపి, కలెక్టర్, ఎమ్మెల్యేలు, అధిక సంఖ్యలో అభిమానులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఉప్పునుంతల, మార్చి 2, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మనపేట గ్రామం నూతన దంపతులు విజయ్ దేవరకొండ-రష్మిక మందాన సందర్శించడంతో పండుగ వాతా వరణంలో మునిగిపోయింది. గ్రామ ముఖ ద్వారం వద్ద తెల్లవారుజామున నుంచే అభిమానులు, గ్రామస్థులు భారీగా గుమిగూడి పూలమాలలు, హర్షధ్వానాలు, ఇతర ప్రత్యేక కార్యక్రమాలతో స్వాగత ఏర్పాట్లు చేశారు.

డప్పు వాయిద్యాలు, కోలాటాల నృత్యాల మధ్య నూతన జంటకు ఆహ్వా నం పలికారు. చిన్నారులు నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ తమ గ్రామానికి గర్వకారణమైన విజయ్‌ను, ఆయన సతీమణి రష్మికను ఒక్కసారి చూడాలని ఆసక్తిగా తరలివచ్చారు. మహిళలు మంగళహారతులు పట్టి సాం ప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. ఉదయం 11:15 గంటలకు నూతన దంపతులు వేదమంత్రాల మధ్య తులసి మాతకు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం సత్యనారాయణ వ్రతంలో పాల్గొని కుటుంబ సభ్యులతో కలిసి ఆశీ ర్వాదాలు పొందారు.



సత్యనారాయణస్వామి వ్రతంలో నూతన దంపతులు విజయ్ దేవరకొండ, రష్మిక

తన వివాహం అనంతరం తొలిసారి సతీమణితో కలిసి స్వగ్రామానికి చేరు కున్న విజయ్‌కు చిన్ననాటి స్నేహితులు హృదయపూర్వక స్వాగతం పలికారు. పాత జ్ఞాప కాలను గుర్తుచేసుకుంటూ గ్రామవీధుల్లో కాసేపు కలియతిరిగారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా బాదావత్ సంతోష్ దంపతులు, ఎంపి మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కలిసి నూతన దంపతులను ఆశీర్వదించారు. అదేవిధంగా కలెక్టర్ దంపతులు నూతన వధువరులకు జ్ఞాపికను బహూకరించారు. అచ్చంపేట నియోజకవర్గంలోని వివిధ పార్టీల ముఖ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

గ్రామ దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గ్రామాభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం ఆకాంక్షిం చారు. ఓ మారుమూల గ్రామంలో జన్మించిన విజయ్ స్వశక్తితో సినీరంగంలో ఎదిగి దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందడం గర్వ కారణమైందని గ్రామ పెద్దలు అన్నారు. సాంప్రదాయ సంగీతం, సంబరాలు, హర్షధ్వానాల మధ్య గ్రామం మొత్తం ఒక మహోత్సవ వాతావరణాన్ని సృష్టించింది. విజయ్ దేవరకొండ-రష్మిక మందాన జంట రాకతో గ్రామ చరిత్రలో చిరస్మరణీయమైన రోజు నమోదైంది.

## ప్రజలందరికి హోలీ శుభాకాంక్షలు

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరబాద్, మార్చి 2,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజల జీవితాలలో అభివృద్ధి సంక్షేమంతో నిత్యం ఆనందాల రంగుల హరివిల్లు విరభూయాలని టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఆకాంక్షిస్తూ హోలీ పండగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, స్నేహం, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందాన్ని, ఐక్యతను మరింత బలపరచాలని ఆకాంక్షి ంచారు. హోలీ పండుగ మన సంస్కృతి సంప్రదాయాలలో ప్రత్యేక స్థానం కలిగినదని పేర్కొన్నారు. హోళి అంటేనే భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ మహత్తర లక్షణమని అన్నారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరూ కలిసి ఈ పండుగను జరుపుకోవడం సమాజానికి శుభసూచకమని తెలిపారు. యువత సహజ రంగులను ఉపయోగించి పర్యావరణహితంగా హోలీ జరుపుకోవాలని సూచించారు. అలాగే నీటి వృథా నివారిస్తూ, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తగా పండుగను జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. హోలీ పండుగ అందరికీ కొత్త ఆశలు, కొత్త ఉత్సాహాన్ని తీసుకురావాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షి ంచారు.

## పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు

### ముగింపు దశలో ఉన్న ప్రాజెక్టుల జాబితా రెడీ

### దేవాదుల ఎత్తిపోతల పథకానికి ప్రాధాన్యత

### ప్రాజెక్టుల భూసేకరణకు ప్రత్యేకంగా నిధులు

**హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు ఈ ఏడాది బడ్జెట్ (2026-27)లో నిధుల కేటాయింపులు జరగనున్నట్లు తెలుస్తోంది. వేల కోట్లు ఖర్చు చేసినా గడిచిన పదేళ్లలో పూర్తికాని ప్రాజెక్టులను ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేసేలా నీటిపారుదలశాఖకు ఈ బడ్జెట్‌లో అత్యధిక ప్రాధాన్యత దక్కనుంది. తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించే ప్రాజెక్టులను ముందుగా గుర్తించి, వాటికి తక్షణమే నిధులను విడుదల చేసేలా ఒక ప్రాధాన్యతా క్రమాన్ని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రాధాన్య ప్రాజెక్టులకు తగినంత మేర నిధుల కేటాయింపు చేసేలా కసరత్తు పూర్తికావొస్తోంది. ప్రాజెక్టుల నిర్వహణ, కాల్వల మరమ్మతులకు సైతం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ నేపథ్యంలోతెలంగాణలో గోదావరి జలాలను ఎత్తైన ప్రాంతాలకు అందించాలనే మహత్తర లక్ష్యంతో ప్రారంభమైన దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మరోసారి బడ్జెట్ సీజన్‌లో చర్చకు కేంద్ర బిందువుగా మారింది.

గోదావరి నదిలో లభ్యమయ్యే వరద జలాలను వినియోగించి వరంగల్, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి వంటి ఎత్తైన జిల్లాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. నీటిని పలు దశల్లో ఎత్తిపోతల ద్వారా పైభాగాలకు తరలించే విధంగా రూపకల్పన చేసిన ఈ పథకం సాంకేతికంగా క్లిష్టమైనది. భారీ పంప్ హౌసులు, సుదీర్ఘ పైప్‌లైన్లు, కాల్వల నిర్మాణం, పంపిణీ వ్యవస్థలతో రాష్ట్రంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాలలో ఇది ఒకటి. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 6.21 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నదే ప్రధాన లక్ష్యం. ప్రాజెక్టులో మిగిలిపోయిన పనులు పూర్తి చేయాలంటే తక్షణమే రూ.4,312 కోట్ల విడుదల అవసరమని ఇంజినీరింగ్ వర్గాలు సూచిస్తున్నాయి. ఒకేసారి పూర్తిస్థాయి నిధులు విడుదల చేస్తేనే పనులు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉన్నదని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఇప్పటికే 91 శాతం పనులు పూర్తయిన ఈ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత లభించబోతోందని నీటిపారుదలశాఖ వర్గాలు చెబుతున్నాయి. కాగా... నీటిపారుదలశాఖకు ఈ బడ్జెట్‌లో ఏకంగా రూ.80 వేల కోట్లు అవసరమవుతాయని తొలుత చీఫ్ ఇంజనీర్లు ప్రతిపాదించారు. ఆ మొత్తాన్ని ఇంజనీర్ ఇన్‌చీఫ్ స్థాయిలో రూ.45 వేల కోట్లకు కుదించారు. 2026-27లో ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులు వాటి వివరాలను ఆర్థిక శాఖకు అందించారు.

# మరో కసాయి తల్లి

### మూడు నెలల పసికందును నీటి తొట్టెలో వేసి చంపేసింది..

### రిమాండ్‌కు తరలించిన పోలీసులు

**బిజినేపల్లి, మార్చి 2, ప్రభాతవార్త:** మాతృత్వం మంట కలిసింది కడుపులో పెట్టుకొని చూసుకోవలసిన కన్నతల్లి కసాయిగా మారింది . మూడు నెలల పసికందు అని కనికరం లేకుండా కాపురానికి అడ్డొస్తున్నాడని నీటి తొట్టిలో వేసి హతమార్చింది. పాలెం గ్రామంలో శనివారం తెల్లవారుజామున మూడు నెలల బాలుడు అనుమానాస్పద మృతి చెందిన సంఘటన లో కాపురానికి అడ్డుగా వస్తున్నాడని కన్నతల్లే కడతేర్చిందని డిఎస్పి బుర్రి శ్రీనివాస్ వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పాలెం గ్రామానికి చెందిన ఉల్లం గొండ్ల నీలమ్మ ను పానగల్ మండలం శాగాపూర్ గ్రామానికి చెందిన గుర్రంకొండ నరేంద్రకు 10 ఏళ్ల క్రితం ఇచ్చి వివాహం చేసినట్లు తెలిపారు. వివాహానంతరం వీరికి ఇద్దరు పిల్లలు. గత రెండేళ్లుగా ఇద్దరి మధ్య గొడవలు తలెత్తడంతో తల్లిదండ్రుల వద్దే ఉంటూ జీవనం సాగిస్తుంది. అప్పుడప్పుడు భర్త నరేందర్ అత్తగారింటికి వచ్చి భార్యను కాపురానికి రమ్మని ప్రాధేయపడేవాడని వివరించారు. అత్తగారింటికి వెళ్లడం ఇష్టంలేని నీలమ్మ తల్లిదండ్రుల వద్ద ఉంటుండగా జనవరి 4న కుమారుడు జన్మించగా గత నెల 27 తేదీన నరేందర్ తో పాటు, నీలమ్మ అత్త మామ పాలెం గ్రామానికి వచ్చి పంచాయతీ పెట్టి కాపురానికి రావాలంటూ కోరిన నిరాకరించినట్లు వివరించారు. భర్తతోపాటు అత్తమామలు వెళ్లిపోవడంతో అదే రాజు రాత్రి నిద్ర అనంతరం రెండు గంటల ప్రాంతంలో మూడు నెలల బాలుడిని ఇంటి ముందున్న నీటి తొట్టిలో పడవేసి కన్నతల్లే కడతేర్చింది అని డీఎస్పీ వెల్లడించారు. బాలుని హత్య చేసి భర్త కుటుంబీకులపై నెట్టే ప్రయత్నం చేయగా కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేయగా అసలు విషయం వెలుగు చూసిందని పోలీసులు వెల్లడించారు. పత్రికా సమావేశంలో సీఐ అశోక్ రెడ్డి ఎస్ఐ కే శ్రీనివాస్ తదితరులున్నారు.



### సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో మహాధర్నా

### తీన్మార్ మల్లన్న, జాజుల, నారగోని, గుజ్జ కృష్ణ తదితరుల మద్దతు



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న తీన్మార్ మల్లన్న

# బిసిల కోసం అత్యాచార నిరోధక చట్టం తక్షణమే తేవాలి

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మార్చి 2, ప్రభాతవార్త:** బిసిలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తక్షణమే బీసీల కోసం ప్రత్యేక అత్యాచార నిరోధక చట్టం తేవాలని బీసీ నేతలు తీన్మార్ మల్లన్న, జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్జకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో కుమ్మెర సంఘటనను నిరసిస్తూ, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్య నారాయణ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి వారు మాట్లాడుతూ కుమ్మెర గ్రామంలో బీసీ, దళితులపై రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు చేసిన దాడిలో రెండు నెలల పసికందు మరణించి, పదిరోజులు గడిచి పోయినా ఇప్పటివరకు నిందితులను అరెస్ట్ చేయక పోవటం దారుణమన్నారు. ప్రియంకరెడ్డి కేసులో జరిగిన సత్వర న్యాయం ఇక్కడ ఎందుకు జరగటం లేదని ప్రశ్నించారు. రెడ్డి సానుభూతితో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఏ జెంట్లైన ప్రజా ప్రతినిధు లు ఈ కేసు అంశంలో స్పందిస్తున్న తీరు చూ స్తుంటే దోషులను తప్పిం చటానికి అన్ని ఏర్పాట్లు చేసు కున్నట్లు తేలి పోయిందని ఆరోపిం చారు. బీసీలపై, దళితు లపై ఈ దురాగతాలు ఈనాటివి కావని, తెలం గాణ గ్రామాల్లో ఈ హత్యాచారాల పరంపర వందల సంవత్సరాలుగా కొనసాగు తోందని గుర్తు చేశారు. బీసీలను అగ్రకులాలు గ్రామాలలో బహిష్కరిస్తే, బీసీలంతా ఏకమై, అగ్రకులాలకు ఓటు వేయ కుండా బహిష్కరించాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, కుమ్మెర నింది తులపై హత్య కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాం డ్ చేశారు. బీసీలకు కూడా ఎస్సీ ఎస్టీ అట్రా సిటీ చట్టం మాదిరి ప్రత్యేక అట్రాసిటీ చట్టం తీసుకురావాలని డిమాం డ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పం దించి, బాధితులకు న్యాయం చేయాలని, నింది తులను కఠినంగా శిక్షించాలని, లేనిపక్షం రెడ్లపై ఈ బీసీల తిరుగుబాటు ఆరంభం మాత్రమేనని, భవిష్య త్తులో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు హారశంకర్‌గౌడ్, జానయ్య, ప్రొఫెసర్ మురళి మనోహర్, వేముల రామకృష్ణ, నంద గోపాల్, విక్రంగౌడ్, పి.సతీష్, పి.సుధాకర్ ముదిరాజ్, పాండు యాదవ్, సాగర్‌దాస్, వెంకట రాముడు, సంధ్య, మధుసూదన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబట్ట

## జూనియర్ అసిస్టెంట్ జి. గణేష్



జీడిమెట్ల, మార్చి 2, ప్రభాతవార్త: ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు లంచం డిమాండ్ చేసిన జూనియర్ అసిస్టెంట్ జి. గణేష్, ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. సోమవారం కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. బాధితుడి నుంచి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ప్రాసెస్ చేయడానికి గణేష్ రూ. 20,000 లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా గతంలోనే రూ. 5,000 అడ్వాన్స్ తీసుకున్నారు. మిగిలిన రూ. 15,000 నగదును సోమవారం బాధితుడి నుంచి తీసుకుంటుండగా, సిటీ రేంజ్1 ఏసీబీ అధికారులు ఆయనను పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.15,000 లంచం నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, ఆయనను అరెస్ట్ చేసి నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 1064 కు లేదా వాట్సాప్ నంబర్ 9440446106కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు తెలిపారు.

## ఈగల్ పోలీసులకు చిక్కిన వాంటెడ్ గంజాయి స్మగ్లర్

హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త: తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిషాలో గంజాయి సహా ఇతర మాదకద్రవ్యాల కేసుల్లో నిందితుడుగా వున్న వాంటెడ్ గంజాయి స్మగ్లర్ సురేంద్ర ఖేముడు అలియాస్ దేబ్‌దాస్ కిలో(36)ను ఈగల్ పోలీసులు ఖమ్మంలో పట్టుకున్నారు. వివరాలను ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య సోమవారం మీడియాకు వెల్లడించారు. ఒడిషాలోని మల్కన్‌గిరి జిల్లా కలిమెల మండలం రసిబేడా గ్రామానికి చెందిన దేబ్‌దాస్ కిలో నాలుగవ తరగతి వరకు చదివాడు. ఆ తరువాత చిన్నతనం నుంచే గంజాయి స్మగ్లర్‌గా మారాడు. ఒడిషా నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి దానిని ఏపితోపాటు తెలంగాణలో విక్రయించేవాడు. 2016 నుంచి ఇతనిపై నార్కోటిక్ కేసులున్నాయి. కేసులపై వచ్చి పారిపోగా అతని కోసం ఈగల్ పోలీసులు గాలించి ఆదివారం నాడు అరెస్టు చేశారు. నిందితుడిని రిమాండుకు తరలించారు. కాగా తెలంగాణలో మాదకద్రవ్యాల గురించి ఎలాంటి సమాచారం ఎవరి వద్ద వున్నా వెంటనే 1908 లేదా 8712671111కు ఫోన్ చేయాలని సందీప్ శాండిల్య కోరారు.

## తల్లిదండ్రులను గెంటేసిన కుమారులు

### కార్యాలయాల చుట్టూ తిరిగినా దక్కని ఫలితం

### తమకు న్యాయం చేయాలని ప్రజావాణిలో వినతి

సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి: ఇంట్లో నుంచి తమను కొడుకులు గెంటేశారని సంవత్సరం నుంచి పోలీసు స్టేషన్, మండల, ఆర్డీఓ కార్యాలయాలను ఆశ్రయించినా ఫలితం దక్కడం లేదని ఓ వృద్ధ దంపతులు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోహెడ మండలం పెద్ద సముద్రాల గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు జంగం మల్లయ్య, ఎల్లవ్వలు గత 5 యేండ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న పట్టించుకోకుండా స్వంత కుమారులే ఇంటి నుంచి గెంటివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము సంపదించిన ఆస్తిని పెద్ద కుమారునికి 30 గుంటలు, రెండో కుమారునికి 30 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం తమను పట్టించుకోకుండా ఇంటి నుంచి గెంటేశారని వాపోతున్నారు. చేసేదేమిలేక కిరాయి ఇండ్లలో కాలం వెల్లదీస్తున్నామని తెలిపారు. వృద్ధ దంపతుల కూతురు తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలని మందలించగా ఆమెపై ఇష్టం వచ్చినట్లు నోటికి పని చెబుతున్నారని ఆరోపించారు. గ్రామంలోని పెద్దమనుషుల సమక్షంలో జరిగిన చర్చల్లో సైతం తమ సమస్యకు పరిష్కారం లభించలేదన్నారు. దీంతో చేసేదేమిలేక వృద్ధ దంపతులు ప్రజావాణి కార్యక్రమంలో మాకు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు.

ఉత్తర తెలంగాణలో పెరుగుతున్న

## విద్యుత్ వినియోగం

### 6,273 మెగావాట్లతో ఎన్పీడీసీఎల్ కొత్త రికార్డు

హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త: ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) పీక్ ఎలక్ట్రిసిటీ డిమాండ్‌లో కొత్త రికార్డు నమోదైంది. సంస్థ పరిధిలో విద్యుత్ డిమాండ్ సోమవారం రికార్డు స్థాయిలో 6,273 మెగావాట్లకు చేరుకుంది. ఇది ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. సంస్థలో తొలిసారిగా గత మూడు రోజులుగా రికార్డు స్థాయిలో విద్యుత్‌కు డిమాండ్ ఏర్పడుతోంది. ఈ రికార్డు బ్రేకింగ్ డిమాండ్‌ను చూస్తే ఫిబ్రవరి 28వ తేదీన ఎన్పీడీసీఎల్ హిస్టరీలో మొదటిసారిగా గరిష్ట డిమాండ్ 6,057 మెగావాట్లు కాగా, దాన్ని అధిగమించి ఈ నెల 1వ తేదీన 6,267 మెగావాట్లకు చేరుకోవడం, తాజాగా అంతకంటే ఎక్కువగా 6,273 మెగావాట్లకు చేరుకోవడం విశేషం. ఇక విద్యుత్ డిమాండ్ పెరుగుదల ప్రధానంగా వేసవి వేడి తీవ్రత పెరుగుదల కారణంగా ఉందని విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు వెల్లడించారు. డిమాండ్‌లో భారీ పెరుగుదల ఉన్నప్పటికీ, వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా కంపెనీ నిరంతర, నిరంతర విద్యుత్ సరఫరాను అందిస్తోందని తెలిపారు.

తిరుపతిలో క్యారేజ్ రిపేర్ షాప్‌ను

## తనిఖీ చేసిన జనరల్ మేనేజర్

తార్నాక, మార్చి 2 ప్రభాతవార్త: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సోమవారం తిరుపతిలోని క్యారేజ్ రిపేర్ షాప్ (సి.ఆర్.ఎస్)ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జనరల్ మేనేజర్ సి.బి.ఆర్ షాప్‌ను సమగ్రంగా పరిశీలించి, వర్క్‌షాప్ పనితీరును సమీక్షించారు. ముఖ్యంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌లు, సాంప్రదాయ ఎ.సి కోచ్‌ల మరమ్మతు పనులను తనిఖీ చేశారు. అదనంగా సి.ఎఫ్ (క్యారేజ్ ఫిట్టింగ్) షాప్, బోగీ సెక్షన్, వీల్ ప్రెస్ మెషిన్, ఎ.జె.టి.బి (ఆటోమేటిక్ జర్నల్ టర్నింగ్ బర్నిషింగ్) మెషిన్ వంటి విభాగాల పనితీరును సమీక్షించారు. అవుట్‌గోయింగ్ షాప్‌లోని కోచ్‌లు, బయోటాయిలెట్లు, ఓవర్‌హాలింగ్ సెక్షన్‌ను కూడా పరిశీలించి, భద్రతా ప్రమాణాల అమలు స్థితిగతులను ఆరా తీశారు. వర్క్‌షాప్‌లో అందుబాటులో ఉన్న భద్రతా పరికరాలను తనిఖీ చేసి, సిబ్బందితో నేరుగా మాట్లాడి విధుల్లో పాటించాల్సిన భద్రతా చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. వర్క్‌షాప్ అధికారులు మాస్టర్ ప్లాన్ మరియు భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలను జనరల్ మేనేజర్‌కు వివరించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్క్‌షాప్ పనితీరు, పురోగతి, చేపట్టాల్సిన తదుపరి చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ ప్రతినిధులతో కూడా సంభాషించి వారి విజ్ఞప్తులను స్వీకరించారు.

## ఎక్సైజ్‌శాఖలో త్వరలో బదిలీలు


### ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారికి స్థానచలనం

హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త: త్వరలో ఎక్సైజ్ శాఖలో బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లను వేరే ప్రాంతాలకు బదిలీ చేయనున్నట్లు ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ తెలిపారు. ఎక్సైజ్‌శాఖలో ఎనిమిదేళ్లుగా బదిలీలు లేని విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన సోమవారం తెలిపారు. మరో మూడు రోజుల్లో ఈ అంశంపై మంత్రులు, ఉన్నతాధికారుల సమీక్ష జరగనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 20కల్లా వరకు బదిలీ ప్రక్రియ పూర్తవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకే ప్రాంతంలో చాలా సంవత్సరాలకు బదిలీలు లేకుండా విధులు నిర్వహించడం సిబ్బందికి ఇబ్బందేనని, అదే విధంగా ఎక్సైజ్ శాఖకు కూడా మంచి పరిణామం కాదని కమిషనర్ తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో 2500 మంది సిబ్బందికి లబ్ధి చేకూరనుందని తెలిపారు. శాఖలో చాలా కాలంగా ఉన్న ప్రమోషన్స్‌పై కీలక చర్యలు చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు.

# పేదల ఉసురుతీస్తున్న కాంగ్రెస్

### అమెరికాతో ట్రేడ్ డీల్ వల్ల ఏ దేశంతో యుద్ధం వస్తుందో రాహుల్ చెప్పాలి

### రేవంత్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, మార్చి 1 ప్రభాతవార్త: బాన్సువాడ బాధిత కుటుంబాలను పరామర్శించిన బండి సంజయ్ మీరు బఫర్ జోన్లు, ఎఫ్‌టిఎల్ పేరుతో ఇకపై పేదల ఇండ్లను కూల్చాలనుకుంటే, అదే ప్లేస్‌లో కట్టిన పెద్దల ఇండ్లను, కాంగ్రెస్ నేతల ఇండ్లను కూల్చేసేందుకు బిజెపి కార్యకర్తలు బుల్డోజర్లతో వస్తారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. కామారెడ్డి బాధితులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఒకవేళ శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమైతే అందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు పరీక్షలున్నాయనే సాకుతో చెరువును ఆక్రమించి ఒవైసీ కుటుంబం నిర్మించిన ఫాతిమా కాలేజీని టచ్ కూడా చేయని కాంగ్రెస్ ప్రభుత్వం, ఖమ్మంలో ఇండ్లను నిర్మించుకుని బతుకుతున్న కుటుంబాల్లో టెన్త్, ఇంటర్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు బతిమిలాడినా వినకుండా వాటిని ఎందుకు కూల్చివేశారు? ఫాతిమా కాలేజీకి ఒక న్యాయం? పేదలకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా హిందువులపై, హిందూ దేవాలయాలపై కాంగ్రెస్ ప్రభుత్వం దాడులు చేయిస్తూ అరాచకాలకు పాల్పడుతుందన్నారు. ఒవైసీ కళ్లల్లో ఆనందం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాలు చేస్తోందన్నారు. అరాచకాలను భరిద్దాం? ఇంకెన్నాళ్లు బిచ్చపు బతుకులు బతుకుదాం. రాజకీయాలను, పార్టీలను పక్కనపెట్టి కాషాయ జెండా పట్టి ఏకమై కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలకు గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తాను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అయినప్పటికీ ఒక హిందువుగా మాట్లాడుతున్నానని చెప్పారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణా మహాభియాన్ పేరిట కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ విచ్చేశారు. అక్కడి నుండి పార్టీ జిల్లా కార్యాలయానికి వెళ్లి బాన్సువాడ బాధిత కుటుంబాలను పరామర్శించి వారి గోడును విన్నారు. వారికి బిజెపి అండగా ఉంటుందని, అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. రాహుల్ శిక్షణా తరగతుల పేరుతో హైదరాబాద్‌కు వచ్చారు. వాస్తవానికి అదే శిక్షణా తరగతుల వేదికపై సిఎం రేవంత్ మాట్లాడుతూ రాహుల్‌కి రూ. వెయ్యి కోట్లు వసూలు చేసి ఇస్తాం అని అన్నారు. రాహుల్ ఇక్కడికి వచ్చి ఆ మూటల కోసమా? లేక శిక్షణా తరగతుల కోసమా అని రాహుల్ గాంధీని కోరుతున్నా. హైదరాబాద్‌కు వచ్చారు కాబట్టి దయచేసి మూసి సుందరీ కరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చివేస్తున్న ప్రాంతాలకు వెళ్లాలని, ఖమ్మంలో భూదాన్ భూముల పేరుతో పేదల ఇండ్లను కూల్చివేసిన ప్రాంతానికి వెళ్లాలని కోరుతున్నా. హిందూ దేవాలయాలపై దాడులు జరిగిన బంజారాహిల్స్ పెద్దమ్మతల్లి, సికింద్రాబాద్ ముత్యాలమ్మ దేవాలయాలను సందర్శించాలని కోరుతున్నానని అన్నారు.

జలమండలిలో కాగిత రహిత కార్యకలాపాలు

## ఈ-ఆఫీస్ ప్రారంభించిన ఎండి అశోక్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 1 ప్రభాతవార్త: జలమండలి అన్ని కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ వ్యవస్థను పూర్తిగా అమలు చేయాలని ఎండి అశోక్ రెడ్డి తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ-ఆఫీస్‌ను అన్ని విభాగాలలో అమలు చేస్తున్నట్లు.. దీనివల్ల కార్యాలయాల్లో సామర్థ్యం, పారదర్శకత, బాధ్యతతో పాటు సేవల ప్రమాణాలు మెరుగుపడనున్నాయని అయన అన్నారు. సోమవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో జెఎండి మయాంక్ మిట్టల్‌తో కలిసి ఈ-ఆఫీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ ఈ-ఆఫీస్ విధానం ద్వారా ఫైళ్ల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని, అలాగే పరిపాలనలో జవాబుదారీతనం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతి ఫైలు మాన్యువల్ గా స్వీకరించడం జరగదని ఈఆఫీస్ ద్వారా పంపించాలని అధికారులతో సూచించారు. ఈ-ఆఫీసులో స్కాన్ చేసి భద్రపరచడమే కాకుండా వివిధ విభాగాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఈ-ఆఫీసులో పొందుపరచడం జరుగుతుందని, సంబంధించిన అధికారి ఎవరైనా వారి విభాగపు ఫైల్స్ ఈ-ఆఫీసులో సరిచూసుకునే వెసులుబాటు ఉండడంతో పరిపాలన సులభతరం అవుతుందని అన్నారు. తొలుతగా ప్రధాన కార్యాలయంలో అన్ని కార్యకలాపాలను ఈ-ఆఫీస్ లో నిర్వహిస్తామని.. విడతల వారీగా అన్నీ డివిజన్‌లలో ఈ విధానాన్ని అమలు చేస్తామని ఎండి వివరించారు. డిజిటలైజేషన్ వ్యవస్థ... సాంప్రదాయ మాన్యువల్ ఫైల్ మూమెంట్ విధానాన్ని పూర్తిగా డిజిటల్‌గా నిర్వహిస్తారు. అన్ని ఫైళ్లు ఈ-ఆఫీస్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఎలక్ట్రానిక్ రూపంలో సృష్టించబడుతూ, ప్రాసెస్ చేయబడి, పంపబడుతూ, భద్రపరచబడతాయి. దీంతో భౌతిక ఫైళ్లపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. పేపర్ వినియోగం తగ్గింపు.. డిజిటల్ డాక్యుమెంటేషన్, ఈనోటింగ్ మరియు డిజిటల్ అనుమతుల ద్వారా పేపర్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యం. ఇది పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా వ్యయ నియంత్రణకు దోహదపడుతుంది. వేగవంతమైన అనుమతులు, నిర్ణయాలు ఎలక్ట్రానిక్ ఫైల్ రూటింగ్, ఆటోమేటెడ్ వర్క్‌ఫ్లో ద్వారా ఫైళ్లు ఆలస్యం లేకుండా వేగంగా ప్రాసెస్ చేయబడతాయి. అధికారులు తమ కార్యాలయ వ్యవస్థల ద్వారా ఫైళ్లను సమీక్షించి, ఆమోదం ఇవ్వగలరు. దీంతో నిర్ణయాల ప్రక్రియ వేగవంతమవుతుంది. ఫైళ్ల రియల్‌టైమ్ ట్రాకింగ్.. ప్రతి దశలో ఫైళ్ల స్థితిని రియల్‌టైమ్‌లో పర్యవేక్షించవచ్చు.

కాళేశ్వరానికి నష్టం వస్తే

## బాధ్యత కాంగ్రెస్‌దే

– మాజీ మంత్రి కెటిఆర్

హైదరాబాద్, మార్చి2 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి: కాళేశ్వరం బ్యారేజీలకు ఏమైనా జరిగితే పూర్తి బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హెచ్చరించారు. మేడిగడ్డ బ్యారేజీపై కుట్రలు చేసింది చాలదన్నట్టు, అన్నారం బ్యారేజీని కూల్చేందుకు కుతంత్రాలకు తెరతీశారా అని పశ్నించారు. నిబంధనలకు పాతరేసి ఏకంగా బ్యారేజీ కిందే భారీ ఎక్స్‌వేటర్లతో ఇసుక తవ్వకాలు జరపడం దుర్మార్గమే కాదు.. అతిపెద్ద నేరమని అన్నారు. బ్యారేజీ సమీపంలో ఇసుక తవ్వకాలు చేపట్టకూడదన్న రూల్స్‌ను బ్రేక్ చేసిన మాఫియాపై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ ఏకంగా బ్యారేజీని బలహీనపరిచి బీఆర్ఎస్‌పై బురదజల్లే పన్నాగాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బ తీసేందుకు నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ చేస్తున్న దాన్ని అన్నదాతలు క్షమించరన్నారు. కాళేశ్వరం బ్యారేజీలకు ఏమైనా జరిగితే పూర్తి బాధ్యత కాంగ్రెస్ పార్టీదే అని కేటీఆర్ స్పష్టం చేశారు.




## ఇరాన్‌పై దాడులు అమానుషం: సీపీఎం నిరసన

చిక్కడపల్లి మార్చి 2 ప్రభాతవార్త: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు జరుపుతున్న దాడులను వ్యతిరేకిస్తూ సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మాట్లాడుతూ, అమెరికా సామ్రాజ్యవాదం నేడు అంతర్జాతీయ టెర్రరిస్టుగా మారిందని విమర్శించారు. **విధ్వంసం:** ప్రపంచ దేశాలపై అడ్డగోలుగా దాడులు చేస్తూ, ప్రజలను చంపి ఆర్థిక వ్యవస్థలను అమెరికా ధ్వంసం చేస్తోందని రాఘవులు ఆవేదన వ్యక్తం చేశారు. **మారణకాండ:** గతంలో గాజాపై జరిగిన దాడిలో 70 వేల మందిని చంపి మారణకాండ సృష్టించారని, ఇప్పుడు ఇరాన్‌లోని అణుశుద్ధి కర్మాగారాలను లక్ష్యంగా చేసుకున్నారని మండిపడ్డారు. **ప్రభుత్వ తీరుపై విమర్శ:** మిత్రదేశమైన ఇరాన్‌పై దాడులు జరుగుతుంటే ప్రధాని మోడీ కనీసం ఖండించకపోవడం దేశ ప్రజలకు అవమానకరమని విమర్శించారు. ట్రంప్ ప్రభుత్వం మన రైతాంగంపై భారమైన సుంకాలు విధిస్తున్నా, కేంద్రం అమెరికాకు తొత్తుగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. అరుణ్‌కుమార్, కేంద్ర కమిటీ సభ్యులు టి. జ్యోతి, ఎస్. వీరయ్య మరియు ఇతర రాష్ట్ర కమిటీ నేతలు పాల్గొన్నారు.

## విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలో భారీగా అక్రమాలు బట్టబయలు

హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త: రాష్ట్రంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఫిబ్రవరి నెలలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో భారీగా అక్రమాలు వెలుగు చూశాయి. ఈ మేరకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి శిఖా గోయల్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజిలెన్స్ అధికారులు జీఎస్‌టి, రవాణా, భూగర్భ వనరుల శాఖ, వాణిజ్య పన్నులు, అటవీ, పౌర సరఫరాలు, పోలీసు విభాగం అధికారులతో కలిసి తనిఖీలు చేబట్టారు. వెయ్యికి పైగా వాహనాలను తనిఖీ చేయగా 200 పైగా వాహనాలు అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణతో జప్తు చేశారు. పర్మిట్లు లేని వాహనాలు, పన్ను చెల్లించని వాహనాలు, హైవే బిల్లులు లేని వాహనాలు, ఇసుక, కంకర, ఇటుకలు, నిత్యావసర సరుకుల అక్రమ రవాణా వాహనాలపైనా చర్యలు తీసుకున్నారు. అక్రమ ఇసుక తరలింపుకు పాల్పడ్డ 24 వాహనాలు జప్తు చేయగా ఇందులోని 245 మెట్రిక్ టన్నుల ఇసుకను జప్తు చేసి 19 మందిని అరెస్టు చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి 131 క్వింటాళ్ల బియ్యం, 27 క్వింటాళ్ల గోధుమలను జప్తు చేశారు. వీటి విలువ 5.8 లక్షల రూపాయలు. ఫిబ్రవరి నెలలో రూ.10.79 కోట్ల ఆదాయం నష్టంగా వున్నట్లు గుర్తించి, దీనిపై జరిమానాగా ఆయా సంస్థలకు రూ.1.96 కోట్లను విధించారు. కాగా అక్రమాలకు సంబంధించి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టోల్ ఫ్రీ నంబర్ 14432కు ఫిర్యాదు చేయాలని డిజి శిఖా గోయల్ కోరారు.

## ఖజనాకు జీఎస్టీగా రూ.4,125 కోట్లు జమ

హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త: తెలంగాణలో రాష్ట్ర ఖజానాకు జీఎస్టీ సొమ్ము భారీగా చేరుకుంది. గత నెలకు సంబంధించి ఏకంగా రూ. 4,125 కోట్ల మేర జీఎస్టీ వసూళ్లను సాధించింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 14 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేసింది. హైదరాబాద్, దాని చుట్టూ విస్తరించిన పరిశ్రమలు, ఐటీ, ఫార్మా, సేవా రంగాలు విస్తరించడంతో జీఎస్టీ ఆదాయంలో పెరుగుదల చోటు చేసుకుందని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఆయా రంగాల నుండి వస్తున్న పన్ను ఆదాయం రాష్ట్ర ఖజానాకు వెన్నెముకగా నిలుస్తోంది. ఐటీ ఎగుమతులు, కొత్తగా సాఫ్ట్వేర్ కంపెనీలు ఇక్కడ ప్రారంభించడం ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు పన్నుల రూపంలో భారీ ఆదాయం సమకూరుతోంది. మరోవైపు ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వల్ల రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్ రంగాలతోపాటు తెలంగాణ ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖ పన్ను ఎగవేతను అరికట్టడానికి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ, డేటా అనలిటిక్స్‌తో పన్ను చెల్లింపులను పకడ్బందీగా పర్యవేక్షిస్తుండటం పన్నుల ఆదాయం పెరగుదలకు కీలకంగా మారింది.

ఇంజినీరింగ్ విద్యార్థినిపై

## లైంగిక దాడికి పాల్పడ్డ విద్యార్థి అరెస్టు

కొంపల్లి, మార్చి 2, ప్రభాతవార్త: ప్రేమించిన విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడి, ఆమె నగ్న ఫోటోలను తీసుకుని బ్లాక్ బెయిల్‌కు పాల్పడుతున్న ఓ యువకుడిని బాచుపల్లి పోలీసులు అరెస్టు చేశారు. బాచుపల్లిలోని విఎన్ ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో బీటెక్ సివిల్ చదువుతున్న యువతి అదే కళాశాలలో చదివే ఆశిష్ తనయ్(22) గత కొంత కాలంగా ప్రేమ పేరిట వెంటబడే వాడు. అనంతరం ఆ యువతికి ఒక పార్టీలో నిందితుడు ఆశిష్ మత్తుమందు కలిపిన చాక్లెట్లను ఇచ్చి ఆమె నగ్న ఫోటోలను సెల్‌ఫోన్‌లో తీసుకున్నాడు. ఈ ఫోటోలను చూపి ప్రేమిస్తున్నానని బెదిరించి తనతో శారీరకంగా కలవాలంటూ ఒత్తిడి తెచ్చి లొంగదీసుకున్నాడు. తాజాగా అవే ఫోటోలను చూపి తన స్నేహితుడితో గడపాలని ఆశిష్ యువతిని బెదిరించాడు. యువతి తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన బాచుపల్లి పోలీసులు బాధితురాలి వాంగ్మూలం నమోదుచేసి, వైద్య పరీక్షల తరువాత నిందితుడు ఆశిష్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అతని వద్ద వున్న యువతి నగ్న ఫోటోలతో పాటు ఇతర ఆధారాలను జప్తు చేశారు.

## విశ్రాంత, ఉపాధ్యాయ ఉద్యోగుల

# బకాయిలు తక్షణమే చెల్లించాలి

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు డిమాండ్

### భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష




నిరాహార దీక్షనుద్దేసించి ప్రసంగిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు

ధర్నాచౌక్, మార్చి 2, ప్రభాతవార్త: విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగ ఉపాధ్యాయులకు రావల్సిన పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో భారతీయ జనతాపార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల తెలంగాణ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని వ్యతిరేకిస్తూ, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ముఖ్య అతిథులుగా రామచంద్రరావు, ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే ఆలేటి మహేశ్వర్‌రెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ రిటైర్‌మెంట్ అనంతరం ప్రశాంతంగా జీవించాల్సిన వయసులో తమ జీవితాంతం కష్టపడి సంపాదించుకున్న బకాయిల కోసం ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు ప్రాణాలు కోల్పోతున్నారంటే ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, ఇక రాహుల్ గాంధీకి తెలంగాణ వచ్చే అర్హతే లేదని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి చేతిలో గడ్డపార, మంత్రుల చేతుల్లో పారలు పట్టుకుని, పేదల ఇండ్లను కూలగొట్టే స్థాయికి కాంగ్రెస్ పాలన దిగజారిందని, ఈ రుణమైన అణిచివేతకు ఇక ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమయిందని తెలిపారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ కింద ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలు వేలకోట్లు బకాయి ఉండటంతో ఆసుపత్రులలో రోగులకు వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ లేదు, విద్యార్థులకు ఫీరియంబర్స్‌మెంట్ లేదు, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవు, విశ్రాంత ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవు, తెలంగాణ రాష్ట్రంలో ఏ వర్గం ప్రజలు కూడా సంతృప్తిగా లేరని గుర్తు చేశారు. ప్రభుత్వం మారితే సమస్యలు తగ్గుతాయి అనుకుంటే బీఆర్ఎస్ తరువాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు మరింత పెరిగాయని ఆరోపించారు. రానున్న రోజుల్లో అసెంబ్లీలో, మండలిలో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సమస్యలపై బలంగా మాట్లాడతారని, వారి సమస్యలు పరిష్కారం అయ్యే వరకు బీజేపీ వారి పక్షాన నిలబడి పోరాడుతుందని హామీ ఇచ్చారు. ఈటెల రాజేందర్ ఈ దీక్షా కార్యక్రమంలో బీజేపీ నేతలు వకుళా భరణం కృష్ణమోహన్, బండ కార్తికారెడ్డి, భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు కొనుగోలుకు విద్యుత్ పంపిణీ సంస్థలకు రుణాలు

- నిబంధనల సడలింపునకు చర్యలు
- 10 నుండి 15 శాతం దిగుమతుల పెంపు
- పవర్ ఫైనాన్స్‌కు విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త: విద్యుత్ ఉత్పత్తి అవసరమైన బొగ్గు కొనుగోలు, దిగుమతులకు సంబంధించి పంపిణీ సంస్థలకు రుణ సౌకర్యం కల్పించాలని కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. జనరేటర్లైన జెన్కోలకు నిర్దిష్ట బొగ్గు రుణాలు అందించడం ఇదే మొదటిసారి. దిగుమతి చేసుకున్న బొగ్గు కోసం విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలను అందించడానికి డిస్పెన్సేషన్‌తో కూడిన మార్గదర్శకాలను విద్యుత్ మంత్రిత్వ శాఖ రూపొందించినట్లు తెలిసింది. దీంతో త్వరలో బొగ్గు దిగుమతులకు విద్యుత్ పంపిణీ సంస్థలు జెన్కోలకు సులభమైన రుణాలు లభించనున్నాయి. ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యుత్ రిటైలర్లు నుండి చెల్లింపులు అందకపోవడంతో దిగుమతి చేసుకున్న బొగ్గును కొనుగోలు చేయడానికి తమ వద్ద డబ్బు లేదని వివిధ రాష్ట్రాలకు చెందిన జెన్కోలతో పాటు, ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తి సంస్థలు కేంద్రానికి ఇప్పటికే తెలిపాయి. విద్యుత్ సంస్థలకు రుణాలు ఇవ్వడానికి, ముఖ్యంగా బ్లెండింగ్ ప్రయోజనాల కోసం దిగుమతి చేసుకున్న బొగ్గును కొనుగోలు చేయడానికి, దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత ప్లాంట్లను నడపడానికి వీలుగా అవసరమైన నిబంధనలను సడలించాలని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌పై కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. విద్యుత్ డెవలపర్లు బొగ్గును దిగుమతి చేసుకోవడానికి ఆసక్తిగా ఉండడంతో పాటు, అందుకు అవసరమైన నిధులు సమకూర్చడానికి ప్రభుత్వం నుండి ఫైనాన్సింగ్ విధానాన్ని కోరుతుండడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే విద్యుత్ ప్లాంట్లకు పంపిణీ సంస్థలు చెల్లించాల్సిన బకాయిలు మొత్తం 1.03 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇక విద్యుత్ ప్లాంట్లలో దాదాపు 20 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు మాత్రమే ఉండగా, ఇవి దాదాపు ఎనిమిది రోజుల పాటు ఉంటాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు బొగ్గు అవసరం తప్పనిసరి అయ్యింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని బొగ్గు నిల్వలను నిర్మించడానికి మరియు అధిక డిమాండ్ మధ్య ప్రాజెక్టులను కొనసాగించడానికి, విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు బొగ్గు దిగుమతుల కోసం అవసరమైన రుణాలను మంజూరు చేసేందుకు రుణదాతల ద్వారా కేంద్రం సులభతరం చేస్తుంది. ప్రధానంగా విద్యుత్ సంక్షోభాన్ని నివారించడానికి వర్షాకాలం ముందు నిల్వలను నిర్మించడానికి బొగ్గును దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వం ఉత్పత్తి సంస్థలపై ఆధారపడుతోంది. అన్ని ఉత్పత్తి ప్రాజెక్టులు వాటి అవసరంలో 10 శాతం దిగుమతి చేసుకోవాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉత్పత్తి సంస్థలు 22 మిలియన్ టన్నుల బొగ్గు దిగుమతులు చేసుకుంటాయి. అలాగే ప్రైవేట్ కంపెనీలు మరో 16 మిలియన్ టన్నులు తీసుకువస్తాయి. విద్యుత్ మంత్రిత్వ శాఖ బుధవారం ఇచ్చిన ఆదేశాల్లో బొగ్గును దిగుమతి చేసుకోని ప్లాంట్లకు వాటి లక్ష్యాలను ప్రస్తుత 10 శాతం నుండి 15 శాతానికి పెంచుతామని తెలిపింది.

8,9 తేదీల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో

## మెగా మహిళా రైతు మేళా

–హాజరుకానున్న సిఎం రేవంత్ రెడ్డి,మంత్రులు

– ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య


అత్తాపూర్ మార్చి 2, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మార్చి 8,9 తేదీల్లో మెగా మహిళా రైతు మేళాని నిర్వహించనున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ, కోర మాండల్ ఇంటర్నేషనల్‌లు ఈ కార్యక్రమం నిర్వహణకి తోడ్పాటు అందిస్తున్నాయని ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య పేర్కొన్నారు. ఈ మెగా మహిళా రైతు మేళాని విజయవంతంగా నిర్వహించడానికి అవసరం అయిన ఏర్పాట్లు గురించి చర్చించడానికి వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి, ఉద్యాన శాఖ సంచాలకులు యాస్మీన్ బాషా, పీజే టీఏయూ ఉప కులపతి అల్దాస్ జానయ్య పాల్గొని మాట్లాడారు. మహిళా రైతుల సాధికారిత గురిగా నిర్వహించనున్న ఈ మేళాకి సుమారు 8 నుంచి 10 వేల మంది మహిళా రైతులు హాజరవుతారని జానయ్య పేర్కొన్నారు. ఈ రెండు రోజుల మెగా మహిళా రైతు మేళా లో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న కీలక సవాళ్ళు వాటి పరిష్కారాల పై శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.



# అంతా మన మంచికే!

వంట ఆలస్యమైంది. దాన్ని సరిచేసుకుని బయటికి వచ్చేసరికి ఎక్కాల్సిన బస్సు వెళ్లిపోయింది. ఎక్కడికో అర్జెంటుగా వెళ్తున్నాం... బండిని ఎడమవైపు తిప్పాల్సింది పోయి, కుడివైపు పోనిచ్చాం. ఇంకేం ట్రాఫిక్‌లో ఇరుక్కు పోయాం. వంట మాడి పోవడం, వస్తుందనుకున్న ఉద్యోగం ఆఖరి నిమిషంలో చేజారడం, ఎక్కడికో వెళ్తే క్యాబ్ ఆగిపోవడం... ఇలాంటివి మనకు అప్పుడప్పుడూ ఎదురవుతూనే ఉంటాయి. ఉంటాయి కదా! అలాంటప్పుడు ఏమనిపిస్తుంది? ఛీ ట్రైం. బాగోలేదు. ఈరోజు అస్సలు బాలేదు అంటే! ఇప్పుడు ఇంకో కోణంలో చూద్దాం. బస్సు వెళ్లిపోయిందని మరోదానికోసం ఎదురు చూస్తున్నారు. అప్పుడు ఫ్రెండ్ నుంచి మెసేజ్ మా ఆఫీసులో ఖాళీలున్నాయి. ఈరోజు వస్తే ఉద్యోగం ఖాయం. జీతం కూడా ఎక్కువే అని ట్రాఫిక్ లో ఓ వ్యక్తి పరిచయం అయ్యారు. మీరు పెట్టాలనుకుంటున్న వ్యాపారమే చేస్తున్నారు. మాటల్లో స్నేహంగా మారి సాయం కూడా చేస్తానన్నారు. ఇప్పుడేమనిపిస్తోంది? దురదృష్టం అనుకున్న సందర్భాలే అనుకోని అవకాశాలు తెచ్చిపెట్టాయి కదా? జీవితంలో చిన్న చిన్న అసంతృప్తులు మామూలే ఆ మాత్రం దానికే మనల్ని మనం, పరిస్థితులను, తిట్టుకుంటూ కూర్చుంటే మనసు, రోజు పాడవడం తప్ప ఏమీ ఉండదు. ఇదే చెబుతుంది. ఖిబర్న్ టోస్ట్ థియరీఖి. ఎలాగూ మీరేం చేయాలనుకున్నారో అది కుదరలేదు. కాబట్టి, ఒక దీర్ఘశ్వాస తీసుకుని దాన్ని మర్చిపోండి. తరవాత ఏం చేయాలో ఆలోచించండి. అన్నిసార్లూ మ్యాజిక్ జరగకపోవచ్చు. కానీ ఇలా ఆలోచించినప్పుడు ఒత్తిడి మాయం అవుతుంది. పైగా ధ్యాస మళ్లిస్తాం కదా... దీంతో కొత్త ఆలోచనలు వస్తాయి. కాబట్టి ప్రతి చిన్నదాన్నీ కష్టంగా భావించి జీవితాన్ని భారం చేసుకోవడమెందుకు? అన్నీ మన చేతిలో ఉండవు అనుకుంటూ ముందుకు వెళితే సరి. కొత్త అవకాశాలు దొరుకుతాయి. ఏం జరిగినా అంతా మన మంచికే అని పెద్దలూ ఊరికే అనలేదు.

# కనురెప్పలు అందంగా ఉండాలంటే..



ముఖం అందంగా కనిపించడంలో కనురెప్పలు ముఖ్య పాత్ర పోషిస్తాయని చెప్పవచ్చు. కనురెప్పలు అందంగా కనిపించడానికి మస్కారా, ఐ లాషెస్ వంటి వాటిని వాడుతూ ఉంటారు. అయితే వీటిలో రసాయనాలు ఎక్కువగా ఉండడం వల్ల కంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

**కలబంద జెల్..** కలబంద జెల్ కనురెప్పలకు తేమను అందిస్తుంది. దీనిని కొద్దిగా కనురెప్పలపై రాసి రాత్రంతా అలాగే ఉంచాలి. ఇలా చేయడం వల్ల కనురెప్పలు ఒత్తుగా, అందంగా తయారవుతాయి. కలబంద జెల్ రాయడం వల్ల కనురెప్పలపై మంట కూడా తగ్గుతుంది. చల్లారిన గ్రీన్ టీని కనురెప్పలపై కాటన్ ప్యాడ్ తో రాయాలి. ఇలా చేయడం వల్ల గ్రీన్ టీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కనురెప్పల పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. అంతేకాకుండా గ్రీన్ టీ రాయడం వల్ల అలసిపోయిన కళ్లకు ఉపశమనం లభిస్తుంది. కళ్ల వాపు తగ్గు తుంది. కనురెప్పలు అందంగా కనిపించడానికి మేకప్ వేస్తూ ఉంటారు. ఐ లాషెస్ ను కూడా ఉపయోగిస్తూ ఉంటారు. అయితే వీటిని తొలగించడం ఒక పెద్ద సమస్య అని చెప్పవచ్చు. కనురెప్పలు రుద్దకుండా, లాగకుండా సున్నితంగా మేకప్‌ను తొలగించాలి. అప్పుడే కనురెప్పలు బలంగా, ఆరోగ్యంగా ఉంటాయి.

**ఆముదం..** కనురెప్పలు ఒత్తుగా తయారవ్వడంలో ఆముదం ఎంతో సహాయపడుతుంది. ఆముదం నూనెలో పోషకాలు, మాయిశ్చరైజింగ్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి కనురెప్పల పెరుగుదలను ప్రోత్సహించడంలో, వాటినిబలోపేతం చేయడంలో సహాయపడతాయి. నిద్రించే ముందు ఒక చుక్క ఆముదం నూనెను కనురెప్పలపై సున్నితంగా రాయాలి. ఇలా చేయడం వల్ల మంచి ఫలితాలను చూడవచ్చు. ఆముదం నూనె లాగా కొబ్బరి నూనె కూడా కనురెప్పలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. కొబ్బరి నూనె రాయడం వల్ల కళ్ల చుట్టూ ఉండే సున్నితమైన చర్మంపై చికాకు తగ్గుతుంది. రోజూ రాత్రి పడు కునే ముందు కనురెప్పలపై కొద్దిగా కొబ్బరి నూనె రాసి సున్నితంగా మర్దనా చేయాలి.

ఇలా చేయడం వల్ల కనురెప్పలు, ఆరోగ్యంగా, అందంగా తయారవుతాయి.

**విటమిన్ ఇ నూనె..** విటమిన్ ఇ నూనె కూడా కనురెప్పల ను బలంగా, ఒత్తుగా చేయడం లో దోహదపడు తుంది. విటమిన్ ఇ క్యాప్సుల్స్ ను కనురెప్పలపై రోజుకు ఒకసారి రాయాలి. ఇలా చేయడం వల్ల కనురెప్పలు ఒత్తుగా తయారవు తాయి. అలాగే రసాయనాలు ఎక్కువగా, కఠినంగా ఉండే మస్కారా వంటి వాటిని వాడడం వల్ల వెంట్రుకలు బలహీనంగా తయారయ్యే అవకాశం ఉంది. కనుక సున్నితంగా, రసాయనాలు తక్కువగా ఉండే మేకప్‌ను ఉపయోగించడం మంచిది. వీటితో పాటు ప్రోటీన్, విటమిన్స్, బయోటిన్ ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. ఇవి వెంట్రుకలను బలంగా తయారు చేయడంలో సహాయపడ తాయి. ఇవి ఉపయోగించడం వల్ల కూడా కను రెప్పలు అందంగా, బలంగా, ఒత్తుగా తయారవుతాయి.



# ఆనందాల హోలీ

పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ఆనందోత్సాహాలతో ఆనందంగా జరుపుకునే పండుగ హోలీ. ప్రకృతి రమణీయ శోభతో పూల సోయగా లను మోసుకొస్తుంది వసంతం ఋతువు. ఈ ఋతువు మానవుల మనసుకి నవచైతన్యాన్నిస్తుంది. పూల మొక్కలు పరిమాళాలతో పలకరించే ఈ ఋతువు కొత్త ఉత్సాహానికి ఊపిరి పోస్తుంది. ప్రకృతిలోని అపురూప దృశ్యాలు కనువిందు చేస్తూ మనసంతా ఆహ్లాదాన్ని నింపుతాయి. రకరకాల పుష్పాలన్నీ కనిపించగానే మురిసి పోయి ఆనందంతో మైమరచి పోతారు. ఈ ఋతువులో




ప్రకృతి స్వచ్ఛంగ, నిర్మలంగా ఎటువంటి కల్మషం లేకుండా హాయిగా ఉంటుంది. ప్రకృతి ఇంత ప్రశాంతంగా ఉన్న సమయంలో వస్తుంది హోలీ. నాడు సంప్రదాయ బద్దమైన హోలీ పండగను ప్రేమాను రాగాలకు తార్కాణం గా జరుపుకునే వారు. ప్రకృతిలో దొరికే రకరకాల పూలతో, వేపాకులు, తుల సాకులు, పసుపు, కుంకుమ కలిపిన నీటిని వసంతో త్సవంగా జరుపుకునేవారు. ఇలా చేయడం వల్ల చర్మవ్యాధులు ప్రబలకుండా ఉండేవి. నేడు వాటి స్థానంలో కృత్రిమ రసాయనిక రంగులు మార్కెట్లోకి రావడంతో ప్రజలు వాటి పైన మోజు పెంచుకుని లేని అనర్థాలను కొని తెచ్చుకుంటున్నారు. మరుగొల్పే చల్లని మల్లెలు, కాంతులీనే కనకాంబ రాలు, సన్నజాజుల సోయగాలు, పరిమళాలు వెదజల్లే లిల్లీలు కనుల విందు చేస్తాయి. గులాబీల గుబాళిస్తాయి. ఈ కాలంలో మోడుబోయిన మోదుగ చెట్ల నిండా ఎర్రని పూలు ప్రత్యేక ఆకర్షణీయంగా కనిపిస్తాయి. హోలీ నాడు కృత్రిమ రంగులకు దూరంగా ఉంటూ, ప్రకృతి లో లభించే సహజ రంగులను వినియోగిస్తే, మన ఆరో గ్యాన్ని మనం కాపాడుకునే వాళ్ళమవుతాం. సంప్రదాయ బద్ధ మైన రంగుల పండుగ కాబట్టి, రంగు వచ్చే రకరకాల పూలతో, ముఖ్యంగా మోదుగ పూలతో తయారు చేసుకున్న రంగులతోనే హోలి జరుపుకోవడం చాలా మంచిది. కృత్రిమ రసాయనిక రంగులు వాడి చర్మ వ్యాధులు తెచ్చుకోవడం అవివేకం అవుతుంది. అంతేకాదు రసాయనిక రంగులు వాడటం వలన కంటి చూపు పోయే ప్రమాదం కూడా లేకపోలేదు. రంగులు చల్లుకోవడంలో జాగ్రత్తలు తీసుకుంటూ, సున్నితమైన రంగులతో సరదాగా కాసేపు ఆడుకుని, ఆవెంటనే వంటికి అంటిన రంగుల్ని తొలగించుకుంటే చర్మ వ్యాధులు రాకుండా ఉంటాయి. ఇలా తగు జాగ్రత్తలు తీసుకుంటూ పండుగను ఆనందంగా జరుపుకోవచ్చు.

-కాయల నాగేంద్ర

# ప్రశాంతం

నేడు ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఉండటం, రణ గోణ ధ్వనులకు దూరంగా ఉండాలని కొ రుకుంటున్నారు. నిజమే కాని మానవునికి ప్రశాంతత దొరికేది చాలా మంది కోవెల అనుకుంటారు. కోవెలలో చక్కటి సంగీతం మంద్ర స్థాయి లో వినపడుతూ ఉంటుంది. ఆ సంగీతం వింటూ ఉంటే ప్రశాంతత దొరుకుతుంది. అయితే అక్కడ కూడ ఒకరిపై ఒకరు చాడీలు చెప్పుకుంటూ, మూడవ వ్యక్తి గురించి చర్చ చేస్తారు. మనం దేవుని సన్నిధికి ఎందుకొస్తాం ప్రశాంతత కొరకు అది మరచి పోయి లోకం పట్ల పరిస్థితులు పట్ల ఆకర్షణ అవుతాడు. చాలా మంది ఏదో మొక్కుబడిగా వచ్చి సెల్ లో వచ్చేటివి చూస్తు వుంటారు. ఇంకా కొద్ది మంది సమయం చిక్కితే సెల్ లో కాలక్షేపం చేస్తుంటారు. ఆ సెల్లే మన ప్రశాంతతను దెబ్బ తీస్తుంది. మనం దైవం పట్ల విధేయత చూపాలి. కోవెల లోనైనా కనీసం సెల్ వాడకుంటే మంచిదిభగవంతుని వైపు కొద్ది సేపైనా అన్నీ మరచి ప్రశాంతంగా చూడాలి. ఏ ఆలోచనలు పెట్టుకోరాదు. అప్పుడే వ్యక్తి నిజమైన ప్రశాంతత పొందు తాడు.ప్రశాంతత ఒక్క కోవెలలో నే దొరుకుతుంది అనేది అపోహే. జన సంచారానికి దూరంగా, రణ గొణ ధ్వనులకు దూరంగా ప్రకృతిని ఆస్వాదిస్తూ గడపడం ఉత్తమం. సమస్యలు ఉన్నవారు రోజు కొంత సేపు ప్రకృతిని చూస్తూ ప్రశాంతతను అలవర్చు కోవాలి. ప్రకృతిని చూస్తూ ఉంటే కోపతాపాలు ఏవి వుండవు. అవి తొలగిపోతాయి.అదే ఉత్తమ జీవన విధానం.



-కనుమ ఎల్లారెడ్డి

# రవ్వ ఢోక్లా



**కావలసినపదార్థాలు**

బొంబాయి రవ్వ: రెండు కప్పులు, పుల్లటి పెరుగు: ఒక కప్పు, పచ్చిమిర్చి: నాలుగు, ఉప్పు: తగినంత, చక్కెర: ఒక టీస్పూన్, ఆవాలు, నువ్వులు: అర టీస్పూన్ చొప్పున, నూనె: పావు కప్పు, కరివేపాకు: ఒక రెబ్బ, అల్లం: అంగుళం ముక్క, బేకింగ్ సోడా: పావు టీస్పూన్, బేకింగ్ పౌడర్: ఒక టీస్పూన్.

**తయారీ విధానం**

రవ్వను మిక్సీ జార్‌లో వేసి ఒక నిమిషంపాటు గ్రైండ్ చేసుకోవాలి. రెండు పచ్చిమిర్చి, అల్లం కచ్చాపచ్చాగా దంచుకోవాలి. ఒక గిన్నెలో రవ్వ, పెరుగు, ఉప్పు, చక్కెర, పచ్చిమిర్చి మిశ్రమం వేసి కొద్దికొద్దిగా నీళ్లుపోసి ఇడ్లీ పిండిలా కలిపి మూతపెట్టి పదినిమిషాలు పక్కన పెట్టాలి. నానిన పిండిలో బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా వేసి మరోసారి బాగా కలపాలి. ఒక గిన్నెకు నూనెరాసి రవ్వ మిశ్రమం వేసుకోవాలి. వెడల్పాటి కుక్కర్‌లో నీళ్ల పోసి, రవ్వమిశ్రమం వేసిన గిన్నెపెట్టిఆవి రిపై 20 నిమిషాలు ఉడికించాలి. బాగా ఉడికిన ఢోక్లాను చల్లారాక ముక్కలుగా కోయాలి. స్టవ్ మీద కడాయి పెట్టి రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి వేడయ్యాక ఆవాలు,నువ్వు లు, చీల్చిన పచ్చిమిర్చి, కరివే పాకు వేసి వేగిన పోపును ముక్కలుగా కోసుకున్న ఢోక్లాపై వేసుకుని కలుపుకొంటే ఘుమఘుమలాడే ఫలహారం సిద్ధం.



# సహజ రంగులతో ..

వయసుతో సంబం ధం లేకుండా ప్రతి ఒక్కరూ చిన్నపిల్లలుగా మారిపోయే వేడుకంటే హోలీనే గుర్తొస్తుంది కదూ! ఎంత సేపు ఆడినా తనివి తీరదు... సమయమూ తెలియదు. ఒళ్లంతా రంగులతో నిండిపోతే మనసుకీ తెలియని ఉత్సాహం. మరి ఆ తరువాత? రంగుల్ని వదలగొట్టడానికి నానా తిప్పలు పడాలి. అంతేనా?




రంగుల్లోని రసాయనాల కారణంగా చర్మం. కురులు దెబ్బతింటాయి. కళ్లు, శ్వాస సంబంధిత సమస్యలూ ఎదురవుతాయి. కాబట్టి, సహజ రంగుల్నే వాడండి. ఇంట్లో తయారీ ఇబ్బంది అనుకుంటే ఆన్‌లైన్ సాయం తీసుకోండి. బోలెడు సంస్థలు వీటిని అందిస్తున్నాయి. పసుపు, గులాబీ రేకలు, వేప, బీట్రూట్, నేరేడు.... వీటిని ఉపయోగించి రంగుల్ని సిద్ధం చేస్తున్నారు. కావాల్సిన రంగులన్నీ దొరుకుతాయి. పైగా సహజ సిద్ధం. నచ్చినట్టుగా రంగుల కేళీ ఆడేసుకోవచ్చు. ఇది కదా ఆనందం. మరి ప్రయత్నిం చారా సహజ రంగులు! అడేద్దామా ఆరోగ్యంగా హోలీ?

# 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'
## 6న విడుదల : సుధీర్ శ్రీరామ్



మిస్సమ్మ, 'అదిరందయ్యా చంద్రం' టాటా బిర్లా మధ్యలో లైలా లాంటి క్లాసిక్ ఎంటర్‌టైనర్స్ తర్వాత శివాజీ, లయ జంటగా నటించిన సినిమా 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసన్ని. 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' లాంటి విజయాల తర్వాత ఈటీవీ విన్‌తో కలిసి ప్రముఖ నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి సమర్పిస్తున్న సినిమా

**మీ నేపథ్యం ఏమిటి?**

మా నేపథ్యం కడప. నాన్న పోస్ట్‌మాస్టర్. నాకు చిన్న ప్పటి నుండి సినిమాలంటే ఇష్టం. సినిమా సెలబ్రిటీలా నాకు ఓ గుర్తింపు రావాలని కోరిక ఉండేది. హ్యాపీడేస్ సినిమా చూసి ఇంజనీరింగ్ పూర్తి చేశాను. 2015 నుంచి సినీ పరిశ్రమలోకి ఉన్నాను. కొన్ని సినిమాలకు దర్శకత్వ శాఖలో పనిచేశాను. అడవిశేష్ నటించిన ఎవరు సినిమాకు దర్శకత్వ శాఖలో పనిచేశాను.

**సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని చిత్రానికి శివాజీ గారిని హీరో ఎంచుకోవడానికి రీజన్?**

90స్ సినిమాలో శివాజీ గారిని చూడగానే మా నాన్న గుర్తొచ్చారు. సినిమా కథలు చెప్పే సమయంలో ఆయనకు ఎందుకు కథ చెప్పకూడదు? అనిపించి ఖిసాంప్రదాయిని సుప్పిని సుద్దపూసనిఖి కథతో శివాజీ గారిని అప్రోచ్ అయ్యాను. కథ వినగానే ఆయన ఈ కథను నేనే ప్రొడ్యూస్ చేస్తాను అన్నారు. ఆ మాట వినగానే ఎంతో హ్యాపీగా అనిపించింది. ఈ సినిమా ఎలాంటి కథాంశంతో ఉంటుంది?

ఈ కథ క్రైమ్ కామెడీ. దర్శకుడు నెల్సన్ తెరకెక్కించే సినిమా తరహాలో ఉంటుంది. కో..కో.కోకిల, డాక్టర్ సినిమాలా డార్క్ కామెడీ ఉంటూ థ్రిల్లింగ్ నేపథ్యం ఉంటుంది.

**మొదట్లో ఈసినిమాను ఓటీటీలో డైరెక్ట్ స్ట్రీమింగ్ అన్నారు? ఇప్పుడు థియేటర్స్‌లో విడుదల చేస్తున్నారు ? ఎందుకని?**

ముందుగా థియేటర్ కోసమే అనుకున్నాం. అనుకున్నారు.లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయ్ థియేటర్‌లో విడుదలైన తరువాత ఈటీవీ విన్ వాళ్లకు ఎక్కడో ఈటీవీ విన్ వర్జినల్ మిస్ అవుతున్న ఫీలింగ్ కలిగింది. సో.. వాళ్లు ఇది మంచి సినిమా, ఈటీవీ విన్‌లో డైరెక్ట్‌గా స్ట్రీమ్ చేస్తే బాగుంటుందని అనుకున్నారు.

**ఈ సినిమా మేకింగ్ శివాజీ గారి ఇన్‌వాల్వ్‌మెంట్ ఎంత వరకు ఉంది?**

శివాజీ గారు ఇన్‌వాల్వ్‌మెంట్ కథలో ఎలాంటి మార్పులు చేయలేదు. ఆయన స్టయిల్‌లో డైలాగులు చెప్పేవాడు. ఆయన ప్రాపర్‌గా పాటల్లో ఇన్‌వాల్వ్ అయ్యాడు. పాయ సాంగ్ శివాజీ గారి సజెషన్‌తో చేశాం.

# 'పెద్ది' డబ్బింగ్ ప్రారంభించిన మెగా పవర్ స్టార్‌రామ్ చరణ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ పెద్ది సినిమా వేసవిలో గ్రాండ్ గా విడుదల కానున్న నేపథ్యంలో బజ్ నెక్స్ట్ లెవల్ కి చేసుకుంది. బుచ్చి బాబు సానా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు భారీగా నిర్మిస్తున్నారు.ఈ సినిమా ప్రమోషన్స్ లో ఇప్పటికే సంచలనం సృష్టించింది. ఆస్కార్ అవార్డు గ్రహీత సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్ స్వరపరిచిన ఫస్ట్ షాట్ గ్లింప్స్, బ్లాక్ బస్టర్ ఫస్ట్ సింగిల్ చికిరి చికిరి కి ట్రెమండస్ రెస్పాన్స్ తో రికార్డులను బద్దలు కొట్టాయి.తాజాగా రామ్ చరణ్ 'పెద్ది' డబ్బింగ్ ప్రారంభించారు. పెద్ది పాత్రలో చరణ్ చెప్పిన 'ఏమది' డైలాగ్ అందరినీ ఆకట్టుకుంటుంది. వీడియోలోబుచ్చి.. చికిరి పాటలో మోహిత్ చౌహాన్ వాయిస్ కి నువ్వు ఎంత యాక్టింగ్ చేశావంటే.. నువ్వు పాడావా ఆయన పాడాడా? అనే డౌట్ వచ్చిందయ్యా.. పెద్ది సెకండ్ సింగిల్ ఖిరై రై రారాఖి మార్చి 2న రిలీజ్ కాబోతోంది.ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆస్కార్‌విజేత స్వరకర్త రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. పెద్ది ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది.



జూలైలో ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సినిమాపై అభిమానుల్లో, ప్రేక్షకుల్లో భారీ అంచనాలు, ఉత్సాహం నెలకొనగా.. వాటిని రెట్టింపు చేసేలా త్వరలోనే టీజర్ విడుదల కానుంది. ప్రేక్షకులను గొప్ప సినీ అనుభూతిని అందించడం కోసం అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, ఛాయాగ్రాహకుడిగా నిమిష్ రవి వ్యవహరిస్తున్నారు. ఎడిటింగ్ బాధ్యతలను నవీన్ నూలి నిర్వహిస్తున్నారు.

# 'విశ్వనాథ్ సన్స్' చిత్రీకరణ పూర్తి

కళా దర్శకుడిగా బంగ్లాన్ వ్యవహరి స్తున్నారు. సమష్టి కృషితో ప్రేక్షకులను కథలో లీనం చేసే గొప్ప ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరి స్తున్నారు. సార్/వాతి, 'లక్కీ భాస్కర్' వంటి వరుస విజయాల తర్వాత ప్రముఖ నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య కలిసి మరో ప్రతిష్టాత్మక తమిళతెలుగు ద్విభాషా చిత్రాన్ని అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై నిర్మితమవుతున్న ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. ఎక్కడా రాజీ పడకుండా భారీ స్థాయిలో రూపుదిద్దు కుంటున్న 'విశ్వనాథ్ సన్స్' సినిమాపై అన్ని వర్గాల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. తారాగణం: సూర్య, మమిత బైజు, రాధిక శరత్‌కుమార్, రవీనా టాండన్


# 'పోలీస్ కంప్లైంట్'లో వరలక్ష్మి శరత్ కుమార్ లవ్ సాంగ్

సౌత్ ఇండియన్ టాలెంటెడ్ నటి వరలక్ష్మి శరత్ కుమార్, వెర్సటైల్ యాక్టర్ నవీన్ చంద్ర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'పోలీస్ కంప్లైంట్. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై, బాలకృష్ణ మహారాణా నిర్మిస్తున్న ఈ సినిమాలో వరలక్ష్మి శరత్ కుమార్ నవీన్ చంద్ర జంటపై చిత్రీకరించిన బ్యూటిఫుల్ మెలోడియస్ సాంగ్ "ప్రేమ ఓ ప్రేమ" అనే పల్లవితో మొదలైన ప్రేమ గీతాన్ని సీనియర్ జర్నలిస్టు ప్రభు లాంచ్ చేశారు. ఈ




పాట అన్విక ఆడియోస్ ద్వారా రిలీజ్ అయింది. "ప్రేమ ఓ ప్రేమ" పాటకు సంగీతం సుధాకర్ మారియో సమకూర్చారు. ఈ పాట యూత్‌కు బాగా నచ్చుతుందని, ట్రెండింగ్‌గా నిలిచిపోతుందని, సూపర్ హిట్ లవ్ సాంగ్స్‌లో ఈ పాట కూడా చోటు దక్కించుకుంటుందని దర్శకుడు సంజీవ్ మేగోటి నమ్మకాన్ని వ్యక్తం చేశారు. హారర్ థ్రిల్లర్, అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కించినట్టు తెలిపారు. యాక్షన్, కామెడీ, రొమాన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్, నవీన్ చంద్ర, రాగిణి ద్వివేది, కృష్ణ సాయి, ఆదిత్య ఓం, రవిశంకర్, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, రవిశంకర్, పృథ్వి, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, శరత్ లోహితశ్వ, జెమినీ సురేష్, దిల్ రమేష్ తదితరులు నటిస్తున్నారు.

# 'బ్యాండ్ మేళం' పల్లెలోని సందల్లన్ని మీవే' రిలీజ్



'కోర్ట్ చిత్రంలో హర్ష్ రోషన్, శ్రీదేవీ తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. మళ్లీ ఇప్పుడు వీరిద్దరూ కలిసి 'బ్యాండ్ మేళం' అంటూ ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. బ్లాక్ బస్టర్ రచయిత కోన వెంకట్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపు దిద్దుకుంది. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కావ్య, శ్రావ్య ఈ మూవీని నిర్మించారు. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాని మార్చి 13న రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటి వరకు వదిలిన కంటెంట్ ఆడియెన్స్‌లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే.'బ్యాండ్ మేళం' టీజర్, 'తిప్పు కుంటానవ్' అనే పాట ఎంతగా వైరల్ అయ్యాయో అందరికీ తెలిసిందే. ఇక ఇప్పుడు ఈ మూవీ నుంచి రెండో పాటను విడుదల చేశారు. 'పల్లెలోని సందల్లన్ని మీవే' అంటూ సాగే మెలోడీ పాటను మాస్ మహారాజా రవితేజ సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. పల్లెలోని సందల్లన్ని మీవే అంటూ సాగే ఈ బ్యూటీఫుల్ మెలోడీ పాటకు విజయ్ బుల్గానిన్ ఎంతో క్యాచీ ట్యూన్‌ను అందించారు.

# 'రాకాస' టీజర్ ఈవెంట్‌లో నిహారిక కొణిదెల



ప్రముఖ నటి, నిర్మాత నిహారిక కొణిదెల 2024లో విడుదలైన కమిటీ కుర్రోళ్లు చిత్రంతో ఎన్నో అవార్డుల్ని, రివార్డుల్ని అందుకున్నారు. అలాంటి ఓ అద్భుతమైన సినిమా తరువాత జీ స్టూడియోస్ సమర్పణలో నిహారిక తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాతగా ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి 'రాకాస' మూవీని నిర్మించారు. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఈ సినిమాను ఏప్రిల్ 3న రిలీజ్ చేయబోతోన్నారు. నిహారిక కొణిదెల మాట్లాడుతూ .. పింక్ ఎలిఫెంట్ నుంచి వచ్చే ప్రతీ కంటెంట్‌ను ఆడియెన్స్ ప్రేమిస్తూ, సపోర్ట్ చేస్తూనే ఉన్నారు. 'రాకాస' చెప్పిన కథ నాకు వెంటనే నచ్చేసింది. మనందరినీ గతంలోకి తీసుకెళ్లేలా 'కమిటీ కుర్రోళ్లు' మూవీని నిర్మించాను. సినిమా ఏదైనా సరే ఎంటర్టైన్మెంట్ ఇవ్వాలన్నదే నా పింక్ ఎలిఫెంట్ ప్రొడక్షన్ లక్ష్యం. సంగీత్ శోభన్ మాట్లాడుతూ .. 'నిహారిక, మానస గారి వల్లే 'రాకాస' ఈ స్థాయికి వచ్చింది. ఆ ఇద్దరి వల్లే నేను ఈ స్థాయిలో నిలబడ్డాను. ఈ మూవీ కోసం ఆ ఇద్దరూ ఎంతో కష్టపడ్డారు. దర్శకురాలు మానస శర్మ మాట్లాడుతూ .. 'రాకాస' కోసం మేమంతా చాలా కష్టపడి పని చేశాం. నిహారిక వల్లే నేను దర్శకురాలిగా మారాను. నేను ఆమెకి ఎప్పుడూ రుణపడి ఉంటాను. జీ తెలుగు హెడ్ దివ్య మాట్లాడుతూ .. 'పింక్ ఎలిఫెంట్‌తో కలిసి 'రాకాస'ని చేయడం ఆనందంగా ఉంది. నిహారికతో కలిసి పని చేయడం మాకు ఎప్పుడూ సంతోషంగానే ఉంటుంది. సంగీత దర్శకుడు అనుదీప్ మాట్లాడుతూ ..రాకాస సినిమాలో మూడు పాటలుంటాయి. మూవీ రిలీజ్ తరువాత మరో పాటను విడుదల చేస్తాం.

# ఒక్క కప్! 4జట్లు!!

## సంగ్రామానికి రంగం సిద్ధం | సెమీఫైనల్లో అసలు పరీక్ష



## సిక్స్‌ల మోత


పొట్టి ప్రపంచకప్‌లో సిక్కల మోత మోగుతోంది. స్టేడియాలు సిక్స్‌లతో హోరెత్తుతున్నాయి. బ్యాట్స్‌మన్ ఆకాశమే హద్దుగా చెలరేగుతున్నారు. సిక్స్‌లు, ఫోర్ల పరంగా ఈ ప్రపంచ కప్ రికార్డు సృష్టిస్తోంది. ఇప్పటివరకు ఏకంగా 699 సిక్స్‌లు, 1340 బౌండరీలు పారాయి. వెస్టిండీస్ హిట్‌మ్యాన్ షిమ్రాన్ హిట్మెర్ సిక్స్‌ల మోత మోగించాడు. బౌలర్లకు చుక్క చూపిస్తూ 19 సిక్స్‌లతో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. ఫర్హాన్ 18 సిక్స్‌లు, మరో 37 బౌండరీలు బాదాడు. రికల్టన్(సౌతాఫ్రికా), షనక(శ్రీలంక) చెరో 15 సిక్స్‌లు.. సికిందర్ రజా(జింబాబ్వే), రూథర్ ఫోర్డ్(వెస్టిండీస్), జేసన్ హోల్డర్(వెస్టిండీస్) తలా 13 సిక్స్‌లు...అలెన్(న్యూజిలాండ్), విల్ జాక్స్(ఇంగ్లాండ్), బ్రెవిస్(సౌతాఫ్రికా), హార్దిక్ పాండ్యా(భారత్), ఇషాన్ కిషన్(భారత్) తలా 12 సిక్స్‌లు సాధించారు. శివమ్ దూబే ఇప్పటి వరకు 11 సిక్స్‌లు బాదాడు.



## 5 శతకాలు

టీ20 ప్రపంచకప్‌లో శతకాల మోత తక్కువే. కేవలం అయిదు సెంచరీలే నమోదయ్యాయి. అందులో రెండు సెంచరీలు పాక్ ఓపెనర్ ఫర్హాన్ ఖాతాలో ఉన్నాయి. నమీబియా, శ్రీలంకలపై సెంచరీల మోత మోగించాడు. ఇక కెనడా యువరాజ్(110), శ్రీలంక ప్లేయర్ నిశాంక(100), ఇంగ్లాండ్ కెప్టెన్ బ్రూక్(100) సెంచరీలు చేశారు. మరో నలుగురు సెంచరీల దరిదాపుల్లోకి వచ్చారు. ఈ టోర్నీలో ఎక్కువ రన్స్ చేసిన బ్యాట్స్‌మెన్లలో ఫర్హాన్(383) టాప్ ప్లేస్‌లో ఉన్నారు. అతను 7 మ్యాచ్‌ల్లో 160.25 స్ట్రయిక్ రేట్‌తో 383 రన్స్ చేశాడు. అందులో 2 సెంచరీలు, రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. జింబాబ్వే ప్లేయర్ బెన్నెట్ ఆరు మ్యాచ్‌ల్లో 134.56 స్ట్రయిక్ రేట్‌తో 292 రన్స్, దక్షిణాఫ్రికా కెప్టెన్ ఆడమ్ మార్‌క్రమ్ 7 మ్యాచ్‌ల్లో 175.16 స్ట్రయిక్ రేట్‌తో 286 రన్స్ సాధించారు.



**కోల్‌కతా:** భారత్, శ్రీలంక అతిథ్యమిస్తున్న టీ20 ప్రపంచకప్ చివరి అంకానికి చేరుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియాతో పాటు దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ సెమీస్ చేరుకున్నాయి. సూపర్8 గ్రూప్1 నుంచి దక్షిణాఫ్రికా, భారత్.. గ్రూప్2 నుంచి ఇంగ్లాండ్, న్యూజిలాండ్ సెమీఫైనల్లో ప్రవేశించాయి. గ్రూప్1లో టాపర్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా.. గ్రూప్2లో రెండో స్థానంలో నిలిచిన న్యూజిలాండ్‌తో మార్చి 4న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్‌లో తొలి సెమీఫైనల్ ఆడనుంది. గ్రూప్1లో రెండో స్థానం పొందిన టీమిండియా... గ్రూప్2 టాపర్ ఇంగ్లాండ్‌తో మార్చి 5న ముంబై వాంఖడేలో తలపడనుండి.అసలు సిసలు పరీక్ష ఎదుర్కోనుంది. ఫైనల్ మార్చి 8న అహ్మదాబాద్‌లో జరగనుంది.

### కూనలే అయినా సంచలనాలు

ఫిబ్రవరి 7న మొదలైన పొట్టి క్రికెట్ ప్రపంచకప్ పలు సంచలనాలకు వేదికగా నిలిచింది. మొత్తం 20 జట్లు తలపడగా... 8 జట్లు సూపర్8కు వచ్చాయి. మేటి జట్లలో ఒకటైన ఆస్ట్రేలియా గ్రూప్ స్టేజ్‌లోనే ఇంటిదారి పట్టగా.. జింబాబ్వే, వెస్టిండీస్ సంచలన విజయాలతో సూపర్8కు చేరి ఆశ్చర్యపరిచాయి. ముఖ్యంగా ఆస్ట్రేలియా, అతిథ్య శ్రీలంకలను ఓడించి సర్‌ప్రైజ్ విక్టరీలు సాధించిన జింబాబ్వే.. అదే జోరును సూపర్8లో కనబరచలేకపోయంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ పరాజయాలే చవిచూసింది. వెస్టిండీస్ మాత్రం జింబాబ్వేపై గెలుపొంది.. భారత్, దక్షిణాఫ్రికా చేతుల్లో ఓడింది.

టీ20 ప్రపంచకప్ అతిథ్య జట్లలో ఒకటైన శ్రీలంక... సొంతగడ్డపై బోల్తా కొట్టింది. గ్రూప్ స్టేజ్‌లో మూడు విజయాలతో సూపర్8కు వచ్చిన లంకేయులు... ఇక్కడ మాత్రం నిరాశాజనక ఆటతీరుతో మూడు సూపర్8 మ్యాచ్‌ల్లోనూ ఓడింది. ఇక పాకిస్థాన్... గ్రూప్ స్టేజ్‌లో దయాది భారత్ చేతిలో షాక్ తింది. నిలకడలేమీ ఆట తీరుతో నిరుత్సాహపరిచింది. సూపర్8లో న్యూజిలాండ్‌తో మ్యాచ్ వర్షార్పణం అవడం ఆ జట్టు సెమీస్ ఆశలపై ప్రభావం చూపింది. ఇంగ్లాండ్ చేతిలో ఓడినా తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో శ్రీలంకను ఓడించింది. మూడు పాయింట్లతో న్యూజిలాండ్‌తో సమంగా నిలిచింది. అయితే మెరుగైన నెట్ రన్‌రేట్ విషయంలో వెనకబడి పాకిస్థాన్... సెమీస్ పోరుకు ముందే వైదొలిగింది.

## ఆఫ్ఘనిస్తాన్‌తో ఆరేళ్ల తర్వాత టెస్ట్

**ముంబై:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఆఫ్ఘనిస్తాన్‌తో ఎనిమిదేళ్ల తర్వాత టెస్ట్ మ్యాచ్ ఆడబోతోంది. దక్షి ణాఫ్రికా చేతిలో వైట్‌వాష్‌తో రేసులో వెనకబడిన టీమిండియా... జూన్‌లో సొంతగడ్డ పైనే ఆఫ్ఘనిస్థాన్‌తో తలపడనుంది. రెండు ఫార్మాట్ల సిరీస్ కోసం భారత్‌కు రానుంది. ఏకైక టెస్టు మ్యాచ్‌తో పాటు మూడు వన్డేల సిరీస్‌లో భారత్, అఫ్ఘన్ తలపడనున్నాయి. టెస్ట్ మ్యాచ్ జూన్ 6 నుంచి న్యూఛండీఘర్‌లో ఆడనుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి వన్డే జూన్ 14న ధర్మశాలలో, రెండో వన్డే జూన్17న లక్నోలో, మూడో వన్డే జూన్20న చెన్నైలో జరగనుంది. ఈ మేరకు భారత క్రికెట్ బోర్డు సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. రెండు జట్ల మధ్య ద్వైపాక్షి క సిరీస్ చివరగా 2024లో జరిగింది. ఇక 2018లో చిన్నస్వామి స్టేడియంలో జరిగిన టెస్ట్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై ఇన్నింగ్స్ 262 పరు గుల తేడాతో టీమిండియా నెగ్గింది. సుదీర్ఘ విరామం తర్వాత టీమిండియాతో ఏకైక టెస్టు ఆడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు

## ఒక్కో క్రికెటర్‌పై 17 లక్షల జరిమానా

**ఇస్లామాబాద్:** టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థానీ క్రికెటర్ల చెత్త ప్రదర్శనకు గాను ఆదేశ క్రికెట్ బోర్డు కన్నెర్ర చేసింది. ఒక్కో ప్లేయర్‌పై 17 లక్షల జరిమానా విధించింది. మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్, పేస్ బౌలర్ షహీన్ అఫ్రీది, ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్‌పైన కూడా ఫైన్ వేసింది. ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో సరైన ఆటతీరును ప్రదర్శించని క్రికెటర్లకు ఈ జరిమానా వేసినట్లు తెలుస్తోంది. చక్కని ప్రదర్శన చేసిన ప్లేయర్లకు జరిమానా నుంచి మినహాయింపు ఇచ్చింది. చెత్త పర్ఫార్మెన్స్‌ను ఏమాత్రం సహించేది లేదని పీసీబీ వెల్లడించింది. భవిష్యత్తులో మెరుగైన ఆటను ప్రదర్శించిన క్రికెటర్లకు మాత్రమే ప్రోత్సాహకాలు ఉంటాయని పీసీబీ చెప్పింది. పొట్టి ప్రపంచకప్‌లో పాకిస్థాన్.. సెమీస్ చేరడంలో విఫలమైంది. గ్రూప్ స్టేజ్‌లో టీమిండియా చేతిలో చిత్తు చిత్తుగా ఓడింది. ఇటీవలి ఆసియాకప్‌లోనూ మూడుసార్లు తలపడితే పాక్‌కు భారత్ చేతిలో ఓటములే ఎదురయ్యాయి. దీనికి తోడు శ్రీలంకపై భారీ తేడాతో గెలవాల్సిన మ్యాచ్‌లో పాక్ బౌలర్లు చేజేతులా అవకాశాన్ని చేజార్చారు. దీంతో పాక్ క్రికెటర్లపై ఆ దేశం అభిమానులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. మాజీలు కూడా ఆటగాళ్లపై ఫైరవుతున్నారు.



## వికెట్ల పంట

పొట్టి క్రికెట్ అంటే బ్యాట్స్‌మెన్ డామినేట్ గేమ్. కానీ ఈ ప్రపంచకప్‌లో బౌలర్లు కూడా తమవంత రోల్ పోషిస్తున్నారు. తమదైన రోజు బ్యాట్స్‌మెన్ గుండుల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. ఈ టోర్నీలో ఇప్పటివరకు వికెట్ టేకర్లుగా అమెరికా బౌలర్ వాన్ స్కాల్‌విక్, జింబాబ్వే బౌలర్ ముజర్బాని నిలిచారు. అమెరికా బౌలర్ నాలుగు మ్యాచ్‌ల్లో 13 వికెట్లు తీయగా అందులో రెండు సార్లు 4 వికెట్ల ఘనత ఉంది. ముజర్బాని 6మ్యాచ్‌ల్లో 13 వికెట్లు పడగొట్టారు. తరువాతి స్థానంలో 12 వికెట్లతో సౌతాఫ్రికా పేసర్ ఎంగిడి, టీమిండియా ఏస్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉన్నారు. బాచ్(సౌతాఫ్రికా), తీక్షణ (శ్రీలంక), అదిల్ రషీద్(ఇంగ్లాండ్), జాన్సెన్ (సౌతాఫ్రికా) 11 వికెట్లతో తరువాతి స్థానంలో ఉన్నారు. యార్కర్ల కింగ్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా వికెట్ల వేటలో ఉన్నాడు. ఆరు మ్యాచ్‌ల్లో ఇప్పటివరకు 9 వికెట్లు తీశాడు.



## పరుగుల వరద

టీ20 ప్రపంచకప్‌లో పరుగుల వరద పారుతోంది. పలు జట్లు భారీ స్కోర్లు నమోదు చేస్తున్నాయి. ఇప్పటివరకు 11 సార్లు 200 ప్లస్ స్కోర్లు నమోదయ్యాయి. టీమిండియా రెండు సార్లు, శ్రీలంక 2 సార్లు 200మార్క్ దాటింది. టీ20 ప్రపంచకప్‌లో హైయెస్ట్ స్కోరు భారత్ ఖాతాలో ఉంది. చెన్నైలో జింబాబ్వేపై సూపర్8 మ్యాచ్‌లో టీమిండియా 4 వికెట్లకు 246 రన్స్ చేసింది. గ్రూప్ స్టేజ్‌లో నమీబియాపై ఢిల్లీలో సూర్య సేన చెలరేగి 209 రన్స్ చేసింది. ఇక జింబాబ్వేపై వాంఖడేలో వెస్టిండీస్ 6 వికెట్లకు 254 రన్స్ సాధించింది. ఇది ఈ టోర్నీలో సెకండ్ హయ్యెస్ట్ టీమ్ స్కోరు. శ్రీలంక కూడా రెండుసార్లు 200 ప్లస్ స్కోరు చేసింది. ఒమన్‌పై 225 రన్స్, పాకిస్థాన్‌పై 212 రన్స్ చేసింది. ఇక ఐర్లాండ్, పాకిస్థాన్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, స్కాట్లాండ్, ఇంగ్లాండ్, ఆఫ్ఘనిస్తాన్ తలా ఒకసారి 200 మార్కు దాటాయి.

వాణిజ్యం




# పింఛన్ వడ్డీరేటు ఈసారి 8.25శాతమే!

**న్యూఢిల్లీ, మార్చి 2:** ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ( ఈపీఎఫ్)పై ఇచ్చే వడ్డీని ఉద్యోగులు భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఒ) ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వడ్డీ రేటును 8.25 శాతంగా కొనసాగించాలని ఈపీఎఫ్ఓ నిర్ణయించింది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మాన్‌సుఖ్ మాండవీయ అధ్యక్షతన సోమవారం జరిగిన 239వ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీలు (సిబిటి) సమావేశంలో వరుసగా మూడో ఆర్థిక సంవత్సరంలోనూ వడ్డీ రేటును మార్చకపోవడం గమనార్హం. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లోనూ పీఎఫ్ వడ్డీ రేటు 8.25 శాతంగానే అందించారు. ఈసారి పీఎఫ్ వడ్డీ రేటు తగ్గిస్తారనే అంచనాలు ఉన్నప్పటికీ ఎలాంటి మార్పులు చేకుండా ఊరట కల్పించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రావిడెంట్ ఫండ్‌కు చెల్లించే డబ్బులకు 8.25 శాతం వడ్డీ రేటు ఇవ్వాలని సోమవారం జరిగిన సమావేశంలో సీబీటీ నిర్ణయం తీసుకుంది. వడ్డీ రేటుకు సంబంధించి సీబీటీ ప్రతిపాదనలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు పంపిస్తారు. ప్రభుత్వం అధికారికంగా వడ్డీ రేటును నోటిఫై చేస్తుంది. ఆ తర్వాత ఈపీఎఫ్ చందాదారు అకౌంట్లకు వడ్డీ మొత్తం జమ చేస్తారు. ప్రస్తుతం ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో 7 కోట్ల మందికిపైగా చందాదారులు ఉన్నారు. 2022 23 ఆర్థిక సంవత్సరంలో భవిష్య నిధిపై వడ్డీ రేటు 8.15 శాతంగా నిర్ణయించారు. ఆ తర్వాత 2023-24 ఆర్థిక సంవత్సరంలో 8.25 శాతానికి పెంచారు. అప్పటి నుంచి ఈ వడ్డీ రేటులో ఎలాంటి మార్పులు చేయలేదు. వరుసగా మూడో ఆర్థిక సంవత్సరంలో పీఎఫ్ వడ్డీ 8.25 శాతంగా యథాతథంగా కొనసాగిస్తున్నారు. మరోవైపు.. ఇనాక్టివ్‌గా ఉన్న ఈపీఎఫ్ ఖాతాల్లోని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లకు సంబంధించి సైతం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. తొలి దశలో రూ. 1000 కంటే తక్కువ మొత్తాలు ఉన్న 1.33 లక్షల అకౌంట్లను గుర్తించారు. అందులో ఉన్న రూ. 5.68 కోట్లను సెటిల్ చేయనున్నారు. ఆ తర్వాత రూ. 1000 పైన బ్యాలెన్స్ ఉన్న అకౌంట్లను గుర్తించి వారి వారి బ్యాంకు ఖాతాల్లో ఆ సొమ్మును జమ చేయనున్నారు. కేంద్ర కేబినెట్ సైతం ఇటీవలే ఈ విషయంపై నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నిష్క్రియంగా ఉన్న పీఎఫ్ ఖాతాల్లో సొమ్ము పేరుకుపోతున్న క్రమంలో ఆయా డబ్బులను వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు.

### భారీగా క్షీణించిన

## భారత్‌రూపాయి

### డాలర్ వర్సెస్ రూపాయి 91.50

**ముంబయి, మార్చి 2:** డాలర్‌తో రూపాయి చెలామణీ భారత నష్టం చవిచూసింది. ఒక్కసారిగా 42 పైసలు క్షీణించి సోమవారం ట్రేడింగ్‌ముగిసేనాటికి 91.50గా స్థిరపడింది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై జరిపిన సంయుక్త దాడులు రూపాయి చెలామణిపైనా ప్రభావంచూపించాయి. ముడి చమురుధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో అమెరికా డాలర్‌కు డిమాండ్ భారీ ఎత్తున పెరిగింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలోను, విదేశీ ఫండ్స్ ఇన్వెస్టర్లుకూడా భారీగా విత్‌డ్రాచేయడంతో భారత కరెన్సీ క్షీణించింది. విత్‌డ్రాలన్నింటికీ డాలర్ కరెన్సీ చెల్లింపుల వ్యవస్థ కావడంతో డిమాండ్‌పెరిగి ఇతర కరెన్సీలన్నీ ఒత్తిడికి లోనయ్యాయి. అందులోభాగంగానే భారత్ రూపాయిపైనా ఈ ప్రభావంచూపించింది. ఇంటర్‌బ్యాంకు విదేశీ కరెన్సీ ఎక్స్ఛేంజి రేటు ప్రకారం రూ. 91.23వద్ద ప్రారంభం అయి కనిష్టంగా ఇంట్రాడేలో 91.65వదదకు కూడా చేరింది. చివరకు 91.50వద్దముగిసింది. 42 పైసలు భారీగా క్షీణించినట్లు తేలింది. శుక్రవారం కూడా రూపాయి 17 పైసలు నష్టపోయి 91.08 వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణ, రాత్రికిరాత్రే చమురుధరలు పెరగడం వంటివి రూపాయి క్షీణతకు కారణం అయ్యాయని షేర్‌ఖాన్ ప్రతినిది అనూజ్‌చౌదరి అన్నారు. ఇక బ్రెంట్‌ముడిచమురు 8.01శాతంపెరిగి బ్యారెల్‌కు 78.71 డాలర్లుగా కొనసాగింది. దీనివల్ల దిగుమతి బిల్లులు పెరుగుతాయని, దీనికితోడు జలసంధి మూసి వేతతో చమురురవాణా వ్యయం కూడా మరింత పెరుగుతుందని అంచనావేస్తారు. వారాంతంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.7536.36 కోట్లు.

## టాప్‌గేర్‌లో ప్యాసింజర్ వాహనాల సేల్స్!

**ముంబయి, మార్చి 2:** ప్యాసింజర్ వాహన తయారీ సంస్థలు ఫిబ్రవరి చివరి నాటికి బలమైన అమ్మకాలను సాధించాయి. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ అన్ని విభాగాలలో స్థిరమైన డిమాండ్ కనిపించింది. అమ్మకాల వృద్ధికి యుటిలిటీ వాహనాలు ఎక్కువగా దోహదపడ్డాయి, ఇవి దేశీయ మార్కెట్లో మినీ కార్ల విభాగాన్ని అధిగమించాయి. చాలా వరకు ప్రధాన తయారీ సంస్థలు వార్షిక వృద్ధిని నివేదించాయి. ఈ నెలలో రిటైల్ వ్యాపారం బాగానే ఉందని, దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి డేటా ప్రకారం, కంపెనీ మొత్తంగా 1,61,000 దేశీయ ప్యాసింజర్ వాహనాలను విక్రయించింది. ఇది గతేడాది అమ్ముడైన 160,791 యూనిట్ల కంటే కాస్త ఎక్కువ. కాంపాక్ట్ కార్ల విభాగంలో అమ్మకాలు తగ్గినప్పటికీ, యుటిలిటీ వాహనాల అమ్మకాలు గతేడాది 65,033 యూనిట్ల నుంచి 72,756 యూనిట్లకు పెరిగాయి. అమ్మకాలకు సంబంధించి, ఈ నెలలో మొత్తం అమ్మకాలు 2.14లక్షల యూనిట్లుగా ఉన్నాయని, దేశీయంగా టోకు అమ్మకాలు లక్షా 64 వేలు యూనిట్లుగా, రిటైల్ అమ్మకాలు గత సంవత్సరంతో పోలిస్తే 12 శాతం పెరిగాయని, డీలర్ ఇన్వెంటరీ 12 రోజులుగా ఉందని కంపెనీ తెలిపింది. తమ ఎగుమతుల్లో పశ్చిమాసియా దాదాపు 12.5 శాతం వాటా కలిగి ఉందని, దాదాపు 100 దేశాలలో షిప్‌మెంట్‌లు మారుతూ ఉన్నాయని కంపెనీ తెలిపింది. ఫిబ్రవరిలో టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 34 శాతం పెరిగి 62,329 యూనిట్లకు చేరుకున్నాయి, ఇది దాని పోర్ట్‌ఫోలియో అంతటా నిరంతర డిమాండ్‌ను ప్రతిబింబిస్తుంది. స్వదేశీ ఎస్‌యువీ తయారీ సంస్థ మహింద్రా మహింద్రా అమ్మకాలకు సంబంధించి, కంపెనీ దేశీయ యుటిలిటీ వాహన అమ్మకాలలో 19 శాతం వృద్ధినిసాధించింది.



## ఒక్కడాలరుపెరిగినా భారత్‌కు రూ.13వేలకోట్ల నష్టం

### హార్మూజ్ జలసంధి మూసివేతతో చమురు గండం

**ముంబయి, మార్చి 2:** పశ్చిమాసియాలో ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు భగ్గుమన్నాయి. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్మూజ్ జలసంధిని ఇరాన్ అడ్డుకుంది. దీంతో సోమవారం మార్కెట్లు ప్రారంభమైన సమయంలో ఇంటర్‌కాంటినెంటల్ ఎక్స్ఛేంజీలో బ్రెంట్ క్రూడ్ ఏప్రిల్ కాంట్రాక్ట్ ఒక బ్యారెల్‌కు 10 శాతం పెరిగి 81.87 డాలర్ల గరిష్టానికి చేరింది. ఫ్యూచర్స్‌లో బ్రెంట్ క్రూడ్ 13 శాతం పెరిగి 82.37 డాలర్లకు పెరిగింది. 2025 జనవరి తర్వాత ముడిచమురు ధరలు ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. గల్ఫ్ తీరంలో మూడు చమురు ట్యాంకర్లను దెబ్బతీశామని ఇరాన్ ప్రకటించడంతో సరఫరా నిలిచిపోతుందనే భయంతో మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు వినియోగదారుగా ఉన్న భారత్‌కు ఈ ధరల పెరుగుదల శరాఘాతంగా మారింది. గతేడాది 160 బిలియన్ డాలర్ల మేర చమురును భారత్ దిగుమతి చేసుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధర కేవలం ఒక్క డాలర్ పెరిగినా, భారత్ ఏడాదికి అదనంగా రూ.13వేల కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. భారత్ రోజుకు 5.5 మిలియన్ బ్యారెళ్ల చమురును వినియోగిస్తుండగా, అందులో 1.5 నుంచి 2 మిలియన్ బ్యారెళ్లు వివాదాస్పద హార్మూజ్ జలసంధి గుండానే దిగుమతి అవుతోంది. ఇప్పటికే రష్యా నుంచి సరఫరా తగ్గడంతో పశ్చిమాసియాపై ఆధారపడిన భారత్‌కు ఇప్పుడు ఈ యుద్ధం భారీ ఆర్థిక సంక్షోభాన్ని తెచ్చేలా కనిపిస్తోంది. భారత్ వద్ద వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి.

## మార్కెట్లను వెంటాడుతున్న యుద్ధభయాలు

### రూ.7.50 లక్షలకోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి - సూచీలన్నింటికీ తప్పని భారీ నష్టాలు

**ముంబయి, మార్చి 2:** అంతర్జాతీయ పరిణామాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీగా నష్టపోయాయి. ప్రధానంగా అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ఇన్వెస్టర్లలో ఆందోళన రేకెత్తించాయి. దీంతో ఇన్వెస్టర్లు ఒక్కసారిగా అమ్మకాలకు మొగ్గుచూపడంతో సూచీలన్నీ కుప్పకూలాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,048.34 పాయింట్లు నష్టపోయి 80,238.85 వద్ద స్థిరపడింది. ఇది సెప్టెంబర్ 2025 తర్వాత సెన్సెక్స్ నమోదైన కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. నిఫ్టీ కూడా312.95 పాయింట్లు కోల్పోయి 24,865.70 వద్ద ముగిసింది. మార్కెట్లో నెలకొన్న భయాందోళనలకు అద్దం పడుతూ అనిశ్చితి సూచీ ఏకంగా 25.01 శాతం పెరిగి 17.13కి చేరింది. నిఫ్టీ 50లో కేవలం బీఈఎల్, సన్ ఫార్మా, ఐటీసీ షేర్లు మాత్రమే లాభాల్లో ముగియగా ఇండిగో 6.25 శాతం నష్టంతో టాప్ లూజర్‌గా నిలిచింది. మారుతి సుజుకి, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఆటో ఇండెక్స్ అత్యధికంగా 2.20 శాతం పడిపోయింది. ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లలోనూ ఒత్తిడి కనిపించింది. అయితే, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ మాత్రం 0.24 శాతం లాభపడి సానుకూలంగా ముగిసింది. మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా ప్రధాన సూచీల కంటే ఎక్కువగా నష్టపోయాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకునేందుకు వెనుకాడు తున్నారని, లాభాల స్వీకరణ వైపు చూస్తున్నారని మార్కెట్ వర్గాలు తెలిపాయి. యుద్ధ భయాలతో సోమవారం ట్రేడింగ్ మొదలు కాగానే సూచీలు తిరోగమించాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల విలువ ఒక్కరోజులోనే రూ.6.50 లక్షలకోట్లు తగ్గి రూ.457 లక్షల కోట్లకు పడిపోయింది. ఇన్వెస్టర్లకు ఒక్కరోజులోనే రూ.6.50 లక్షల నష్టం వాటిల్లింది. సెన్సెక్స్ ఇండెక్స్‌లో ఇండిగో, లార్సెన్ అండ్ టర్బో, అదానీ పోర్ట్స్, మారుతీ సుజుకీ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. ఈ స్టాక్స్ 36 శాతం మేర నష్టపోయాయి. భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు 2 శాతం మేర లాభపడ్డాయి. ఇక ఎన్ఎస్ఈలో నిఫ్టీ ఆటో సెక్టార్ టాప్ లూజర్‌గా మారింది. 2.2 శాతం మేర పడిపోయింది. నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్, నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ సైతం 2 శాతం మేర పతనమైంది. ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ అత్యధికంగా 6.36 శాతం మేర నష్టపోయింది. ఆ తర్వాత లార్సెన్ షేర్లు 5 శాతం మేర నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ స్టాక్ 3.33 శాతం నష్టపోయింది. మారుతీ సుజుకీ స్టాక్ 3.16 శాతం పడిపోయింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.